మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 109 • పేజీలు:12+16 • వెల: రూ.5 బుధవారం • 21-3-2018 www.manamnews.com /manamnews

రక్తపు పోరుకు సిద్ధమే!

- ఇంచు భూమి కూడా వదులుకోం
- చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ హెచ్చరిక
- భారత్‌సహా పొరుగు దేశాలకు పరోక్ష హెచ్చరికలు

7లో..

భారత కాల్ సెంటర్ ఉద్యోగాలకు చేటు!

అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు
కంపెనీల ఔట్‌సోర్సింగ్ వద్దు
అమెరికాలోనే ఉండాల్సిందే
ఓహియో సెనేటర్ ప్రతిపాదన

7లో..

డ్రైవర్ లేని కారు ఢీకొని.. మహిళ మృతి

అమెరికాలో దుర్ఘటన
వెంటనే పరీక్షల నిలిపివేత
పాదచారిని ఢీకొన్న ఉబెర్ ఎస్‌యూవీ

7లో..

తెలంగాణ దేశానికే ఆదర్శం

వృద్ధిరేటులో రాష్ట్రం అగ్రగామి

- బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ లబ్ధి
- బీసీ.. ఎంబీసీలకు కొత్త పథకాలు
- అప్పులతో అభివృద్ధి పనులు
- గత బడ్జెట్‌లో 95 శాతం ఖర్చు
- బడ్జెట్‌పై చర్చలో ఆర్థిక మంత్రి ఈటల
- మంత్రి సమాధానం అసంతృప్తికరం
- మా ప్రశ్నలకు జవాబు చెప్పలేదు
- టీడీపీ, బీజేపీ, సీపీఎం వాకౌట్



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి):

బడ్జెట్ కేటాయింపులపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు ఈటల రాజేందర్ మంగళవారం నాడు మిగతా 3లో..

బీజేపీ ప్రభుత్వాలు అప్పులు చేయట్లేదా?

దేశం అప్పులు రూ.82 లక్షల కోట్లు: కేసీఆర్ 3లో..



పీజీ సీట్లు 50:50

ఎంసీఐ నిబంధన మేరకు వెయిటేజీ

నేషనల్ పూల్‌కు 50 శాతం, స్థానికులకు 50 శాతం సీట్లు
పీజీ మెడికల్ సీట్ల భర్తీపై రెండు జీవోలు జారీ

హైదరాబాద్, మార్చి 20:

భారత వైద్య మండలి (ఎంసీఐ) నిబంధనల ప్రకారం పీజీ మెడికల్ సీట్ల భర్తీపై స్పష్టతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మిగతా 6లో..



తెలుగు తప్పనిసరి

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

- ప్రభుత్వ.. ప్రైవేటు పాఠశాలలకు వర్తింపు
- తొలిదశలో పదో తరగతి వరకు బోధన
- ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం: కేసీఆర్
- సబ్జెక్ట్ సిలబస్‌ను పటిష్ఠంగా రూపొందించండి
- తెలుగు వర్సిటీ.. సాహిత్య అకాడమీలకు సూచన

హైదరాబాద్, మార్చి 20:

వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషను తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. ఈ విధానం అమలు చేయడం కోసం ఈ అసెంబ్లీ సమావేశంలోనే చట్టం తెస్తున్నట్లు వెల్లడించారు. మాతృ భాష బోధన అమలుపై తమిళనాడులోని మిగతా 6లో..

ఇదీలోకం!



సభ ఉన్నన్ని రోజులూ చెప్పడం ఎందుకని ఇలా రాయించి తీసుకొచ్చాను సార్..!

చిన్నమ్మ భర్త కన్నుమూత

- తీవ్ర అనారోగ్యంతో నటరాజన్ మృతి
- నాలుగు రోజులుగా ఆసుపత్రిలోనే..
- చాలాకాలంగా ఆరోగ్యం అంతంతమాత్రం
- పీఆర్వోగా ఉద్యోగ జీవితం ప్రారంభం
- జైల్లో కన్నీరు మున్నీరైన చిన్నమ్మ శశికళ



చెన్నై, మార్చి 20:

తమిళనాడు రాజకీయ సంచలనం వీకే శశికళ భర్త మరుదప్ప నటరాజన్ (74) చెన్నైలోని ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతిచెందారు. శరీరంలో పలు అవయవాలు పనిచేయకపోవడంతో ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఛాతీలో మిగతా 6లో..



ఆ 39 మంది.. ఇక లేరు

- ఇరాక్‌లో భారతీయుల దుర్మరణం
- అధికారికంగా తెలియజేసిన ప్రభుత్వం
- డీఎన్‌ఏ పరీక్ష ద్వారా మృతదేహాల గుర్తింపు
- వాటిని వారి బంధువులకు అందజేస్తాం
- రాజ్యసభలో మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటన
- లోక్‌సభలో మంత్రి ప్రకటనకు సభ్యుల అడ్డు
- సింధియాను రాహుల్ రెచ్చగొట్టి పంపారు
- చావులతో కూడా కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది
- తీవ్రంగా మండిపడిన విదేశీ వ్యవహారాల మంత్రి



ఇరాక్ మృతుల కుటుంబ సభ్యులతో సుష్మాస్వరాజ్ (ఫైల్)

న్యూఢిల్లీ, మార్చి 20:

ఇన్నాళ్లూ అదృశ్యమయ్యారని భావించిన 39 మంది భారతీయులు మరణించారు. వారు ఎవరెవరన్న విషయాన్ని కూడా భారత ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ మిగతా 6లో..

ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: చవితి మ.3.29 తదుపరి పంచమి; నక్షత్రం: భరణి సా.6.59 తదుపరి కృత్తిక; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.00–12.48; రాహుకాలం: మ.12.24–1.54; అమృతఘడియలు: మ.2.22–3.55; శుభసమయం: మ.1.55–3.00.

సూర్యోదయం: 6.23

సూర్యాస్తమయం: 6.24

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం బుధవారంనాడు కొంత మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. గాలిలో తేమ శాతం తగ్గుతుంది. రాత్రిపూట గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 24 డిగ్రీలు

గాలిలో తేమ: 50 శాతం



అవిశ్వాసం.. ఆలస్యం!

- మూడో రోజూనా వీలుకాని తీర్మానాల పరిశీలన
- ఏపీ, తమిళనాడు ఎంపీల నిరసన... నినాదాలు
- గందరగోళం మధ్య పార్లమెంటు నేటికి వాయిదా
- విపక్ష నేతలు సరేనన్నా స్తంభించిన ఉభయసభలు
- ఎందుకిలా? చైర్మన్ వెంకయ్యనాయుడు నిర్వేదం
- ప్రభుత్వ వైఖరి కారణంగానే ప్రతిష్ఠంభన: ఆజాద్
- మేం సిద్ధమే.. విపక్షాల సహకారం లేదు: రవిశంకర్

న్యూఢిల్లీ, మార్చి 20:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కావేరీ జలాల యాజమాన్య బోర్డు ఏర్పాటు తదితర అంశాలపై మంగళవారం ఏపీ, తమిళనాడులకు చెందిన ఎంపీలు గందరగోళం సృష్టించారు. దీంతో పార్లమెంటు ఉభయసభలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే బుధవారానికి వాయిదాపడ్డాయి. ఇరాక్‌లో ఐఎస్ ఉగ్రవాద సంస్థ నిర్బంధించిన 39 మంది భారతీయుల మిగతా 6లో..

మరింత 'కరుణ'

సింగరేణిలో కారుణ్య నియామక ప్రక్రియ మొదలు

- మెడికల్ బోర్డు జాబితాలో అదనంగా 16 వ్యాధులు
- సీఎం కేసీఆర్ హామీ నెరవేరే దిశగా సర్క్యులర్ జారీ
- సర్వీసుతో నిమిత్తం లేకుండా అవకాశం కోసం వినతి
- ప్రభుత్వాన్ని వేడుకుంటున్న పలువురు గని కార్మికులు



హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి):

సింగరేణి కాలరీస్‌లో బొగ్గు గని కార్మికులపై ప్రభుత్వం మరింత కరుణ కురిపించింది. ఈ మేరకు ఇప్పటికే కారుణ్య నియామకాల ప్రక్రియ ప్రారంభానికి యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ అంశంపై కార్మికులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఇచ్చిన హామీ నెరవేరే తరుణం ఆసన్నమైంది. అంతేకాకుండా ఈ నియామకాలలో ఎలాంటి ఇబ్బందులకూ తావులేని విధంగా మెడికల్ బోర్డు జాబితాలో వ్యాధుల సంఖ్యను పెంచాలని సీఎం సూచించారు. ఆ మేరకు అదనంగా 16 వ్యాధులను చేరుస్తూ సింగరేణి యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు మిగతా 2లో..

భార్యాబిడ్డలను కడతేర్చిన కిరాతకుడు

- **హైదరాబాద్‌లో ట్రిపుల్ మర్డర్**
- **పోలీసుల అదుపులో నిందితుడు**


నిందితుడు సురేంధర్

హైదరాబాద్/బాలాపూర్, మార్చి 20(మనం న్యూస్): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ భర్త తన భార్యతోపాటు ఇద్దరు పిల్లలను గొంతునులిమి చంపాడు. హైదరాబాద్ నగరంలోని మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధి శివనారాయణపురంలో జరిగిన ట్రిపుల్ మర్డర్ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. తెల్లాపూర్ లింగంపల్లికి చెందిన సంగిశెట్టి సురేంధర్ (35) ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బడంగ్‌పేటలోని సాయిప్రభ హోమ్స్‌లో నివాసముండే మహేశ్ కుమార్తె వరలక్ష్మికి సురేందర్‌కు ఏడేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి నితిష్(5), యశస్విని(3) ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉగాది సందర్భంగా ఈనెల 18న సురేందర్ బడంగ్‌పేట సాయిప్రభ హోమ్స్‌లో ఉన్న అత్తగారింటికి వెళ్లాడు. సోమవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. తిరిగి తమ ఇంటికి వెళ్ళాలని వరలక్ష్మి(28) మంగళవారం ఉదయం సిద్ధమవుతుండగా, సురేందర్ తన మామ, బావమరిదిని కల్లు తెమ్మని బయటకు పంపాడు. వరలక్ష్మి తల్లి కిరాణా దుకాణానికి వెళ్లింది. ఈ సమయంలో సురేందర్ తన ఇద్దరు పిల్లల గొంతు నులిమి చంపాడు. అనంతరం భార్య వరలక్ష్మి గొంతు నులిమి ఆమె ప్రాణం తీశాడు. వరలక్ష్మి తల్లిదండ్రులు సోదరుడు ఇంటికి తిరిగి వచ్చే సరికి విగతజీవులుగా ఉన్న వరలక్ష్మి, ఇద్దరు పిల్లలను చూసి కన్నీరుమున్నీ రయ్యారు. హత్య సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ డీసీపీ వెంకటేశ్వ రరావు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. నిందితుడు సురేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఉద్యోగ భద్రత కోరుతూ స్కీం వర్కర్ల ధర్నా



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్‌రావు డిమాం డ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద స్కీం వర్లర్లు మంగళవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని మాట్లాడుతూ.. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీసం వేతనం రూ.18 వేలు, పెన్షన్ రూ.3వేలు అందజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి, నాయకులు కె.సమ్మయ్య, ఈశ్వరి, నిర్మల, యామిని, తదితరులు పాల్గొన్నారు.



దామాషా పద్ధతిలో కోటా

- **బీసీల కోసం నిలబడిన కేసీఆర్ గెలుస్తారు**
- **బీసీ కమిషన్ ఎదుట చిన్నారుల మనోగతం**

హైదరాబాద్, మార్చి 20: ''దామాషా పద్ధతిలో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి. బీసీల హక్కుల కోసం పోరాడుతున్న కేసీఆర్ వెనుక నిలుస్తాం. ఆయన వచ్చే ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తారు'' అని పలువురు చిన్నారులు అభిప్రాయపడ్డారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలలో బీసీ కులాల అధ్యయనంపై క్షేత్ర స్థాయికి వెళ్లిన బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్‌కు ఈ విజ్ఞప్తులు వచ్చాయి. ''బీసీల ఐక్యతతో దేశంలోని ఒక బలమైన ఉద్యమాన్ని కేసీఆర్ నిర్మిస్తారు'' అని వందల మంది విద్యార్థులు గౌరీ శంకర్‌తో పేర్కొన్నారు. ఈ సంఘటన తనకు అమితాశ్చర్యాన్ని కలిగించిందని మంగళవారం ఒక ప్రకటనలో గౌరీ శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల కోరికను కేంద్ర ప్రభుత్వం మన్నించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల నిరసన

హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ఓలా, ఉబర్ సంస్థలు తమను మోసం చేస్తున్నాయని ఆరోపిస్తూ ఆ సంస్థలో పని చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. లక్షల్లో బిజినెస్ కల్పిస్తామని, ఇన్సెంటీవ్స్ దండిగా ఇస్తామని నమ్మబలికి ఇప్పుడు అవేమీ ఇవ్వకుండా ఓలా, ఉబర్ తమను మభ్య పెడుతున్నాయని డ్రైవర్లు ఆరోపించారు. రెండ్రోజులుగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నారు. కొత్త కార్లను తీసుకోవద్దని, సంస్థ సొంతంగా క్యాబ్‌లను నిర్వహించొద్దని, తమకు ఇస్తామన్న విధంగా ఇన్సెంటీవ్స్ ఇవ్వాలని, నెలకు రూ.లక్షా 25వేల బిజినెస్ కల్పించాలని క్యాబ్ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ఓలా, ఉబర్ క్యాబ్ సేవల సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలో ఎటువంటి అనుమతులు లేవని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు.

మిషన్ భగీరథ త్వరగా పూర్తి కావాలి

- **రాష్ట్ర మంత్రులు జోగు, అల్లోల**
- **ఉమ్మడి ఆదిలాబాద్ పనులపై సమీక్ష**

హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): మిషన్ భగీరథ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రులు జోగు రామన్న, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న మిషన్ భగరీథ పనులపై మంగళవారం అరణ్య భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రులు జోగు రామన్న, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ పనుల విషయంలో నిర్లక్షా ్యన్ని సహించేది లేదన్నా రు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలు, నియోజకవర్గాల్లో నెలకొన్న మంచినీటి ఎద్దడి పై మంత్రులు తీవ్రంగా స్పందించారు. ఆదిలాబాద్ పట్టణంలో 26 వేల ఇండ్లకు మిషన్ భగీరథ కింద మంచినీటి కనెక్షన్లు ఇవ్వాల్సిందేనని మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, బాపురావు రాథోడ్, దుర్గం చిన్నయ్య, గడ్డం వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై వేటు ప్రభుత్వ కుట్రే

దేశంలో ఎక్కడా ఇలా జరగలేదు

- **హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం**
- **స్వామిగౌడ్ అంటే మాకూ అభిమానమే: ఉత్తమ్**
- **జానారెడ్డి ఇంట్లో ముఖ్య నేతల భేటీ**
- **భవిష్యత్తు కార్యాచరణపై చర్చ**
- **మోదీకి మద్దతు.. మమతతో మంతనాలు**
- **కేసీఆర్ వ్యవహారంపై కోమటిరెడ్డి ఎద్దేవా**



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ప్రజల పక్షాన మాట్లాడుతున్న మండలి సభ్యులను పాలక పక్షం కుట్రపూరితంగా బహిష్కరించిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శాసనసభ నుంచి ఎమ్మెల్యేలు కోమటి రెడ్డి, సంపత్ కుమార్‌ల బహిష్కరణ, సభ్యుల సస్పెన్షన్ రాజ్యసభ ఎన్నికలు తదితర అంశాలపై చర్చించేందుకు సీఎల్పీ నేత జానారెడ్డి ఇంట్లో పార్టీ ముఖ్య నేతలు భేటీ అయ్యారు. భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. శాసనసభలో జరిగిన ఘటనపై హైకోర్టు తీర్పుపై వారు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ.. తమ ఎమ్మెల్యేలపై వేటు, సభ్యుల సస్పెన్షన్ వెనక కుట్ర ఉందని ఆరోపించారు. దేశంలోనే ఎక్కడా ఇటువంటి ఘటన జరగలేదన్నారు. కాంగ్రెస్ మండలి సభ్యులనూ సస్పెండ్ చేయటం విచారకరమన్నారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు దెబ్బ తగిలిందని, ఈక్రమంలో చర్య తీసుకున్నట్టుగా ప్రభుత్వం చిత్రీకరించిందన్నారు. స్వామిగౌడ్ అంటే తమకూ అభిమానమేనని, దెబ్బ తగలినట్టుగా ఆధారాలు చూపించాలని అడిగితే ప్రభుత్వం స్పందించలేదన్నారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకముందని పేర్కొన్నారు. బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఇరువురు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేస్తారన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని టీడీపీ అధిష్టానాన్ని కోరుతున్నట్టు తెలిపారు. రాజ్యసభలో తమకు మద్ధతు ఇవ్వాలని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో మాట్లాడామన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేలుగా గెలిచిన వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేయాల్సిందేనన్నారు. నామమాత్రపు బడ్జెట్ సమావేశాలు నడుపుతూ కేసీఆర్ కలకత్తాలో పర్యటిస్తున్నారని విమర్శించారు.

మోదీ, కేసీఆర్‌పై కాంగ్రెస్ పోరాటం

సీఎం కేసీఆర్ ద్వంద్వ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంట్‌లో ఓ వైపు మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ మరోవైపు పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీతో మంతనాలు సాగించటం కేసీఆర్‌కే చెల్లిందని విమర్శించారు. ఎన్నడూ జై తెలంగాణ అనని సంతోష్‌కుమార్‌కు రాజ్యసభ టికెట్ ఇచ్చారని ఆరోపించారు. అమరవీరుల కుటుంబాలకు రాజ్యసభ టికెట్ ఇచ్చి ఉంటే బాగుండేదని తెలిపారు. మమత బెనర్జీ చాలా సింపుల్‌గా ఉంటారని చెబుతూ.. సీఎం కేసీఆర్ మమతను ఆదర్శంగా తీసుకొని విలాసవంతమైన జీవితానికి స్వస్థి పలకాలని హితవు పలికారు. కాగా, రాజ్‌భవన్ కుట్రలకు వేదికగా మారిందని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకు గవర్నర్ ప్రసంగం లేనందువల్లనే కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారన్నారు. మోదీ అజెండాను అమలు చేసేందుకే రాజ్‌భవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించా రు. మోదీ, కేసీఆర్‌లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు. ఎమ్మెల్యేల బహిష్కరణ హేయమైన చర్య అన్నారు.

విప్‌గా రాంమోహన్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ విప్‌గా ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి వ్యవహరించనున్నారు. సంపత్‌ను శాసనసభనుంచి బహిష్కరించిన నేపథ్యంలో విప్‌గా ఆయన స్థానంలో రాంమోహన్‌రెడ్డిని నియమిస్తున్నట్టుగా సీఎల్పీ నేత జానారెడ్డి తెలిపారు. ఈ మేరకు శాసనసభ కార్యదర్శికి లేఖ అందజేసినట్టుగా పేర్కొన్నారు. రాంమోహన్‌రెడ్డి విప్‌గా బాధ్యతలు స్వీకరించారు.

సంపాదిత సెలవులు ఇవ్వాలని వినతి

హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా 2016 సంవత్సరంలో వేసవిలో మధ్యాహ్న భోజనం విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు జమ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ కోరింది. ఈ మేరకు బి.కొండల్‌రెడ్డి, మైస శ్రీనివాస్, చావ రవి తదితరులు మంగళవారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. రోజుకు రూ.25, రూ.18.75 చొప్పున చెల్లించాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని వారు ఖండించారు. వేసవి మొత్తం 49 రోజులు పనిచేసినందున 24రోజుల సంపాదిత సెలవులను జమ చేయాలని కోరారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు

హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): డబుల్ బెడ్ రూం ఇండ్ల విషయంలో పేద ప్రజలకు మేలు చేసేందుకు అవసరమైతే నిబంధనలు సడలించేందుకు సర్కారు సిద్ధంగా ఉందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీలో మంగళవారం రెవెన్యూ అధికారులతో మంత్రులు హరీశ్, తలసాని సమీక్ష నిర్వహించారు.సనత్‌నగర్ నియోజకవర్గం లోని వెంగళ్‌రావు నగర్, శ్యామల కుంటల లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం వక్ఫ్ పరిధిలో ఉన్నందున మినహాయింపు ఇవ్వాలని మంత్రి తలసాని.. హరీశ్‌రావుకు విన్నవించారు.

మరింత 'కరుణ'

(మొదటిపేజీ తరువాయి)



(సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/సీ/081/305) ఇచ్చింది. ఇవన్నీ కాకుండా ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు కొత్త గనుల ప్రారంభానికీ సన్నాహాలు మొదలు కావడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, వారసత్వ ఉద్యోగాలిస్తామని లోగడ సీఎం ప్రకటించిన సమయంలో గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించగా ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీనిపై కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి తలెత్తడంతో ప్రభుత్వం న్యాయ నిపుణులతో సంప్రదించింది. తదనుగుణంగా వారసత్వం స్థానే కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టింది. అయితే, దీనిపైనా సందేహ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో వాటిని తుత్తునియలు చేస్తూ సీఎం సూచన మేరకు సీఎండీ శ్రీధర్ సంబంధిత ఉత్తర్వులు జారీచేశారు. తద్వారా మెడికల్ బోర్డు జాబితాలో మరో 16 వ్యాధులను చేర్చి కార్మికులకు వెసులుబాటు కల్పించారు.

అందరికీ అవకాశం కల్పించాలి

సీఎం కేసీఆర్ లోగడ ఇచ్చిన హామీ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారందరికీ సర్వీస్‌తో నిమిత్తం లేకుండా కారుణ్య నియామకాలలో అవకాశం కల్పించాలని కార్మికులు వేడుకుంటున్నారు. మెడికల్ బోర్డు జాబితాలో అదనపు వ్యాధులను చేర్చిన తరహాలోనే తమపైనా కరుణ చూపి వెసులుబాటు కల్పించాలని విన్నవిస్తున్నారు. దళారుల బెడద లేకుండా అర్హులందరికీ కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించి తమ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని కార్మిక కుటుంబాలు ఆకాంక్షిస్తున్నాయి. మరోవైపు కొత్త గనుల ప్రారంభానికి సీఎం ఆదేశాలిచ్చిన నేపథ్యంలో యాజమాన్యం తన కసరత్తును ముమ్మరం చేసింది.

అదనంగా చేర్చిన వ్యాధులివే

కేన్సర్, మూత్రపిండ వ్యాధులు, మెదడు సంబంధిత వ్యాధులు, పక్షవాతం, కాలేయ వ్యాధులు, పార్కిన్సన్ వ్యాధి, అవయవాలు కోల్పోవడం, గుండెజబ్బు, క్షయ, హెచ్ఐవీ (ఎయిడ్స్), కుష్ఠు, కీళ్ల నొప్పులు, దృష్టిలోపం, మానసిక వ్యాధులు, ఊపిరితిత్తులను బలహీన పరిచే దీర్ఘకాలిక వ్యాధులు, ప్రమాదాల్లో క్షతగాత్రులైన నిస్సహాయ స్థితి.. తదితర వ్యాధులు, పరిస్థితుల్లో ఉన్నవారు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని యాజమాన్యం ప్రకటించింది.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లకు ఓకే

- **టీఎంయూ నేతలతో మంత్రుల భేటీ**


అసెంబ్లీలోని సమావేశ మందిరంలో కార్మికులు, నేతలతో భేటీ అయిన మంత్రులు

హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) కార్మికుల డిమాండ్లు అమలు చేసేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం అంగీకరించింది. మంగళవారం, అసెంబ్లీలోని సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, తదితరులు..

సంస్థ గుర్తింపు కార్మిక సంఘమైన తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాని కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, అధ్యక్షుడు తిరుపతి, ఇతర నేతలు, సంస్థ ఎండీ జి.వి రమణారావుతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కార్మికుల సమస్యలు, సంస్థ ప్రస్తుత స్థితిగతులను మంత్రులకు వివరించామని టీఎంయూ ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీలోని కండక్టర్, డ్రైవర్, మెకానిక్‌లతోపాటు మిగతా అన్ని విభాగాల్లో ఉద్యోగాల భర్తీ, సకల జనుల సమ్మె కాలానికి 'స్పెషల్ క్యాజువల్ లీవ్' పరిగణించడం, తదితర అంశాలకు సర్కారు ఆమోదం తెలిపింది.

రెండో రోజు కొనసాగిన ఈయూ దీక్షలు

సకల జనుల సమ్మె కాలానికి టీఎస్‌ఆర్టీసీ కార్మికులకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ రత్నాకర్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రెండో రోజు ధర్నాలో రత్నాకర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యుత్, సింగరేణి ఉద్యోగులకు సకల జనుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్రను మరచి మొండి చేయి చూపడం సరికాదన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవును మంజూరు చేసిందని, టీఎస్‌ఆర్టీసీ కార్మికులకు కూడా వెంటనే దీన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జనవరి 1, 2017 నుంచి నేటి వరకు పదవి విరమణ చేసిన టీఎస్‌ఆర్టీసీ కార్మికులకు సెటిల్‌మెంట్ అమౌంట్ చెల్లించలేదని కార్మిక సంఘం నాయకులు వీఎస్ బోస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్షా ్యనికి ఇదే నిదర్శనమన్నారు. తక్షణమే పదవి విరమణ బెనిఫిట్స్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2017 నుంచి 62శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల్లానే 6 శాతం రేట్ ఆఫ్ ఇంక్రిమెంట్ ఉండాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సయ్య డిమాండ్ చేశారు. రెండో రోజు రిలే దీక్షా శిబిరంలో నిజామాబాద్, కరీంనగర్, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు చెందిన కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం వెంకట్ గౌడ్, అహ్మద్, ఏ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

- **భూబాగోతం కేసులో స్వయంగా హాజరుకావాలని ఆదేశం**

హైదరాబాద్, మార్చి 20(మనం లీగల్ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూములకు పట్టాలు పొందమే కాకుండా బ్యాంకుల నుంచి రుణాలు పొందారనే ఆరోపణల కేసులో హైకోర్టు స్పందించింది. ఈ భూబాగోతంపై జిల్లా కలెక్టర్ కర్ణన్ నివేదిక ఇవ్వకపోవడంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నివేదిక ఇచ్చేందుకు సమయం కావాలని కలెక్టర్ తరపు న్యాయవాది కోరగా హైకోర్టు అనుమతించకపోగా కలెక్టర్ స్వయంగా హైకోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలని బెంచ్ ఆదేశించింది.

మంచిర్యాల జిల్లాలోని నన్నెల మండలంలోని పలు గ్రామాల్లోని రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురయ్యాయని, రికార్డులు తారుమారు చేసి ఈ భూములకు పట్టాలు పొందారని, వాటితో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారని, ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదని పేర్కొంటూ గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి రామ్మోహనరావు హైకోర్టును ఆశ్రయించాడు. ఆయన దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ మంగళవారం విచారించింది. ఈ భూబాగోతంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. కలెక్టర్ నివేదిక సమర్పించకపోవడంపై బెంచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వచ్చే నెల 3న జరిగే విచారణకు మంచిర్యాల కలెక్టర్ కర్ణన్ స్వయంగా హాజరు కావాలని బెంచ్ ఆదేశించింది.

రిటైర్డు న్యాయమూర్తి ధర్మారావుకు నివాళి

హైదరాబాద్, మార్చి 20(మనం లీగల్ ప్రతినిధి): హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఎ. ధర్మారావు మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు నివాళి అర్పించింది. మంగళవారం హైకోర్టులో ధర్మారావు సంతాప సమావేశం జరిగింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) రమేష్ రంగనాథన్ అధ్యక్షతన న్యాయమూర్తులు, న్యాయవాదులు సమావేశమయ్యారు. ధర్మారావు సేవల్ని ఏసీజేతోపాటు ఏపీ, టీఎస్‌ల పోసాని వెంకటేశ్వర్లు, ప్రతాప్‌రెడ్డి కొనియాడారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలి

హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, క్రీమీలేయర్‌ను ఎత్తేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌తో జరిగిన బీసీ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడానికి ఎలాంటి చట్టపరమైన, రాజ్యాంగపరమైన అడ్డంకులు లేవన్నారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీ జనాభా ప్రకారం 27 నుంచి 56 శాతానికి పెంచాలని కోరారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరి బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ చట్టం తీసుకురావాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. లక్ష కోట్లతో బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజలందరికీ సురక్షిత తాగునీరు

- **3 లక్షల మందికి అందిస్తున్నాం**
- **'ఐ జల్' వందో ప్లాంట్ ప్రారంభంలో..**

సేఫ్ వాటర్ నెట్‌వర్క్ సీఈవో కుర్ట్



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ఫ్లోరైడ్ జలాలతో బాధపడుతున్న ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయంగా సేఫ్ వాటర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ సీఈవో కుర్ట్ సోడర్లుండ్ పేర్కొన్నారు. సేఫ్ వాటర్ నెట్‌వర్క్, హనీవెల్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం 100వ ఐజల్ సేఫ్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా తెలంగాణలో మూడు లక్షల మందికి పైగా సురక్షిత మంచినీటిని అందిస్తున్నట్లు తెలిపారు. సేఫ్ వాటర్ స్టేషన్లు.. రివర్స్ ఒస్మోసిస్, అల్ట్రా వయొలెట్ ఫిల్టరేషన్‌తోపాటు అత్యాధునిక ఆరంచెల వడపోత సాంకేతికతతో పనిచేస్తాయని వివరించారు. ఈ స్టేషన్లు సురక్షిత నీటిని అందించడంతోపాటు స్థానికులకు ఉపాధి కల్పిస్తుందన్నారు. సోలార్ ఆధారిత వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత రిమోట్ మానిటరింగ్ సిస్టమ్‌లాంటి అత్యాధునిక సాంకేతిక వినియోగంతో వాటర్ ఏటీఎంలు నిరంతరం అందుబాటు ధరల్లో తాగునీటి అందిస్తాయని వివరించారు. వాటర్ ఏటీఎం వద్ద నీటిని పొందేందుకు వినియోగదారులు ఆర్ఎఫ్ఐడీ కార్డులను వినియోగిం చాలన్నారు. తమ సంస్థ ద్వారా 150 మంది మహిళలు ఉపాధి పొందారని ఆయన చెప్పారు.

మరో 30 కేంద్రాలు: వికాస్

హనీవెల్ ఇండియా ప్రెసిడెంట్ వికాస్ ఛాదా మాట్లాడుతూ 2019 నాటికి 30 అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 4 లక్షల మందికి పైగా తాగునీటి సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సురక్షిత తాగునీటిపై సుమారు వెయ్యి మంది సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యం, ఉత్పాదకత, జీవనోపాధికి సంబంధించి ప్రజల్లో గణనీయమైన మార్పు తీసుకురానున్నట్లు తెలిపారు. రెండేళ్లలో సేఫ్ వాటర్ నెట్‌వ ర్క్ , హనీవెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో సేఫ్ వాటర్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలో విద్యారంగం నిర్వీర్యం

- సర్కారు విధానాలే కారణం: కిషన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ఉపాధ్యాయ, ఆచార్య ఖాళీల భర్తీ చేయకుండా తెలంగాణ సర్కారు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తగు కేటాయింపులు జరగలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టలేదని విమర్శించారు. విద్యారంగానికి సంబంధించి పలు అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చినా, నిర్మాణాత్మక సూచనలు చేసినా సర్కారు పట్టించుకోలేదని వివరించారు. మంగళవారం అసెంబ్లీ, మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ స్కూళ్లకు అనుమతులిస్తున్నారు కానీ ప్రభుత్వం ఫీజు నియంత్రించడంలేదని, అధిక ఫీజుల వల్ల మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం దాటవేత ధోరణితో ఉందన్నారు. టీఆర్ఎస్ సర్కారు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పుచేస్తే ఎత్తిచూపే బాధ్యత ప్రతిపక్షాలకు ఉంటుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నా రు. టీఆర్ఎస్ సర్కారు మాటలు కోటలు దాటుతున్నా.. అభివృద్ధి పనులు ప్రగతి భవన్ దాటట్లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రజల్లోకి వెళ్లి నిలదీస్తామన్నారు.

కోమటిరెడ్డిపై కేసు ఎందుకు పెట్టలేదు?

- టీ మాస్ చైర్మన్ కంచ ఐలయ్య


హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ఎమ్మెల్యే కొమిటిరెడ్డి వెంకటరెడ్డిపై శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ కేసు ఎందుకు పెట్టడం లేదని టీ మాస్ చైర్మన్ కంచ ఐలయ్య ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఎస్వీకేలో మంగళవారం ఐలయ్య విలేకరులతో మాట్లాడారు. స్వామిగౌడ్‌పై దాడికి పాల్పడిన కొమటిరెడ్డిని అరెస్టు చేయించేందుకు స్పీకర్‌కు అధికారమున్న ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఒక వ్యక్తి శాసనసభ్యత్వాన్ని రద్దు చేయడం మంటే అతనిని ఎన్నుకున్న ప్రజలను అవమానించినట్లే అని ఐలయ్య అన్నారు. స్వామిగౌడ్‌పై దాడికి పాల్పడినట్టుగా తమ వద్ద ఆధారాలున్నాయని చెబుతున్న ప్రభుత్వం కేసు పెట్టడానికి మీనమేషాలు లెక్కిస్తుండటంలో ఆంతర్యమేమిటన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన వారే అగౌర పరిస్తే పరిస్థితి ఏంటన్నారు. కొమటిరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు శాసనసభలో సమయం లేదని, విమర్శలు, ప్రతి విమర్శలతో కాలాన్ని వృథా చేస్తున్నారని ఇది అన్యాయమన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా సభ సాగుతుండటం ప్రజలను మోసం చేసినట్లేనని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీరాం నాయక్, గోపాల్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం: రమణ




హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): వచ్చే ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యతిస్తామని టీ టీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ అన్నారు. మంగళవారం, అసెంబ్లీలోని టీడీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో ముచ్చటించారు. టీడీపీ అధికారంలోకి వస్తే 9మంది బీసీలకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని తాము ప్రకటించిన తర్వాతే, కేసీఆర్ బీసీలకు ప్రాధాన్యతిస్తున్నామని చెప్పారన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరని రమణ అభిప్రాయపడ్డారు. 1983 నుంచి టీడీపీ పొత్తులు పెట్టుకుంటోందని వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం వరకు బీజేపీతో కలిసి ఉన్నామని, ఇప్పుడు ఎవరి దారి వారిదేనన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు అంశంపై తాను అధికారికంగా ఎప్పుడూ మాట్లాడలేదని తెలిపారు. పొత్తుల విషయం తమ అధినేత చూసుకుంటారని, టీటీడీపీని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. మోత్కుపల్లిపై తుది నిర్ణయం చంద్రబాబుదే అని రమణ చెప్పారు.

కొత్తగా 4271 శ్మశాన వాటికలు: జూపల్లి



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): రాష్ట్రంలో కొత్తగా 4271 శ్మశాన వాటికలను మంజూరు చేసినట్టు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు తెలిపారు. శాసన సభలో మంగళవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గ్రామాల్లో శ్మశాన వాటిక నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి శ్మశాన వాటికల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వాటికల నిర్మాణానికి స్థల సమస్య ఉన్నమాట వాస్తవేమనని తెలిపారు. ఈ సందర్భంగా ఓ సభ్యుడు మాట్లాడుతూ ప్రజలు చెరువు శిఖం భూముల్లో ఖననం చేస్తే.. నీటిలో శవాలు తేలియాడుతున్నాయన్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ శ్మశాన వాటికలకు స్థలాల కొరత తీవ్రంగా ఉందని, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు.


న్యాయవాదుల సంక్షేమ బిల్లు



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం బిల్లును రాష్ట్ర న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. సంక్షేమ నిధి సభ్యులతో పాటు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యాలు, మరణ ప్రయోజనాలు కల్పించేందుకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు: కృష్ణయ్య

- కేంద్రంపై టీఆర్ఎస్ ఎంపీలు ఒత్తిడి తేవాలి



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ల కల్పనకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని బీసీ సంఘం జాతీయ నాయకుడు, టీటీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ అంశంపై టీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఓ సారి మొక్కుబడిగా ఓ తీర్మానం చేసిందని ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద కృష్ణయ్య మంగళవారం మాట్లాడారు. ఎస్టీ, మైనారిటీల రిజర్వేషన్లను పెంచినట్టుగానే బీసీల రిజర్వేషన్లను పెంచాలని ఎప్పట్నుంచో విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ కేసీఆర్ పట్టించుకోవడంలేదన్నారు. రిజర్వేషన్ల పెంపు అంశంపై పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్న టీఆర్ఎస్ ఎంపీలతో, బీసీల రిజర్వేషన్లపై కూడా కేంద్రంపై ఒత్తిడి పెంచేలా ఆదేశాలివ్వాలని కేసీఆర్‌ను కృష్ణయ్య కోరారు. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు 32 పార్టీలను, 74 మంది ఎంపీలను కలిసి బీసీల రిజర్వేషన్ల పెంపు అంశంపై చర్చించామన్నారు. రాష్ట్రంలో112 కులాలుంటే, 104 కులాలకు నేటికీ చట్ట సభల్లో ప్రాతినిథ్యం లేదని, 31 జిల్లాలుండగా.. 21 జిల్లాలో కనీసం ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా లేరని కృష్ణయ్య ఆవేదన వ్యక్తంచేశారు. 29 రాష్ట్రాలకుగానూ 18 రాష్ట్రాల్లో ఒక్క బీసీ ఎంపీ కూడా లేకపోవడం బీసీల అణిచివేతకు నిదర్శనమన్నారు. బీసీల అభివృద్ధి, రిజర్వేషన్ల పెంపు అంశంపై అసెంబ్లీలో పూర్తిస్థాయిలో చర్చకు అవకాశమివ్వాలని సీఎం కేసీఆర్‌కు కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

సమాధానం చెప్పారు. వివిధ అంశాలపై విపక్షాలు చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. జరుగుతున్న అభివృద్ధిని విపక్షాలు చూడలేకపోతున్నాయని, ఇలాంటి విమర్శలను ప్రజలు అంగీకరించరని చెప్పారు. చర్చలో పాల్గొన్న కొంత మంది సభ్యులు సలహాలు, సూచనలు ఇచ్చారని, ప్రతిపక్షాలు మాత్రం విద్వేషంతో కూడిన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కాగా, తాము లేవనెత్తిన అనేక అంశాలపై ఆర్థిక మంత్రి సరైన సమాధానం చెప్పలేదని, దాటవేత వైఖరిని అవలంభించారని విమర్శిస్తూ బీజేపీ, టీడీపీ, సీపీఎం సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. హైదరాబాద్ నగరానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడం, ఉద్యోగుల పాత పెన్షన్ విధానంపై సరైన సమాధానం చెప్పనందుకు నిరసనగా బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. పాత పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వనందుకు, గ్రానైట్ పరిశ్రమకు రాయితీలు ఇవ్వనందుకు, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా టీడీపీ సభ్యులు వాకౌట్ చేశారు. పోడు భూముల రైతులకు, కౌలు రైతులకు పంట సాయంచేయనందుకు నిరసనగా సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య సభ నుంచి వాకౌట్ చేశారు.

నిజాయితీని శంకించొద్దు..

విపక్షాల వాకౌట్ అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిజాయితీని శంకించవద్దని కోరారు. అభివృద్ధి విషయంలో విపక్షాలతో చెప్పించుకునే స్థితిలో ప్రభుత్వంలేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాల గురించి అభినందించాల్సిందిపోయి, గుడ్డి ద్వేషంతోనే విమర్శలు చేస్తున్నారని ఈటెల ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పులు పెరిగిపోతు న్నాయని విపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఏమీ చేయడంలేదని బీజేపీ సభ్యులు విమర్శించడం సరికాదన్నారు. ఈ నాలుగు సంవత్సరాల్లో ప్రజలు నచ్చే, మెచ్చే నిర్ణయాలు అనేకం తీసుకున్నామని చెప్పారు. 2015 నుంచి ఇప్పటి వరకు బడ్జెట్ మొత్తంలో ఖర్చు 90 శాతానికి పైగానే ఉందన్నారు.

అప్పల మాట వాస్తవమే..

అప్పులు చేస్తున్న మాట వాస్తవే అయినా అవన్నీ అభివృద్ధి పనులకే ఖర్చు చేస్తున్నామని ఈటల చెప్పారు. అప్పులు తెచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని, మంచి రోడ్లు వేసుకుంటున్నామని, మిషన్ భగీరథలో ఇంటింటికి మంచినీళ్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. వెనుకబడిన సామాజిక వర్గాల అభివృద్ధి కోసం పథకాలు చేపడుతున్నామని, గొల్ల కురుమలకు ఐదు వేల కోట్లతో గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. అభివృద్ధి పనులతో పాటు, సామాజిక బాధ్యతగా వివిధ వర్గాల ప్రయోజనంకోసం సంక్షేమ



పథకాలు భారీగా చేపడుతున్నామని ఈటల చెప్పారు.

కేంద్ర సాయం అంతంతే..

కొత్త రాష్ట్రానికి కేంద్రం చేయూత ఇస్తుందని ఆశించామని, ఈ నాలుగు సంవత్సరాలుగా ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. కేంద్రం నుంచి వస్తున్న ఆదాయాన్ని ఎక్కువ చేసి చూపించారన్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. 2014-15లో కేంద్ర పన్నుల వాటాగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు రూ. 9,779 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేస్తే వచ్చింది రూ. 8,189 కోట్లు అని అన్నారు. 2015-16లో అంచనా వేసింది 12,823 కోట్లు , వచ్చింది 12,353 కోట్లు అని, 2016-17లో 13,955 కోట్లు వస్తాయని అంచనా వేస్తే, వచ్చింది 14,877 కోట్లు అని, 2017-18లో 17,044 కోట్లు వస్తాయని అంచనా వేస్తే వచ్చింది 16,420 కోట్లు అని అన్నారు. తాజా



బడ్జెట్‌లో రూ.19,207 కోట్లు వస్తాయని అంచనా వేశామని ఈటల వివరించారు. ఈ అంచనాతోనే 2014-15 సంవత్సరంలో కేంద్ర గ్రాంట్స్ 21,721 కోట్లు వస్తాయని అంచనా వేశామని, కేంద్రం ఇచ్చింది మాత్రం 7,118 కోట్లు మాత్రమేనన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి అర్థమైనందున తరువాత సంవత్సరాల్లో అంచనాలు భారీగా తగ్గించుకున్నామని చెప్పారు. 2015-16 సంవత్సరంలో 12,400 కోట్లు వస్తాయని అంచనా వేస్తే, వచ్చింది 9,076 కోట్లు, 2016-17లో 14,557 కోట్లు వస్తాయని అంచనా వేస్తే వచ్చింది 9,752 కోట్లు. ఈ బడ్జెట్‌లో 29,049 కోట్లు గ్రాంట్స్ రూపంలో వస్తాయని అంచనా వేశామన్నారు.

జీడీపీ వృద్ధిరేటులో అగ్రగామి..

తెలంగాణ జీడీపీ 2017-18లో 14.1 శాతం ఉంటే, దేశ సగటు వృద్ధిరేటు 9.8 శాతమేనని ఈటల పేర్కొన్నారు. తలసరి ఆదాయంలోనూ తెలంగాణ దూసుకుపోతుందని, జాతీయ సగటుకంటే ముందున్నామని చెప్పారు. తెలంగాణలో తలసరి ఆదాయం 1,74,534 రూపాయలు ఉంటే, జాతీయ సగటు తలసరి ఆదాయం 1,12,764 రూపాయలు ఉందన్నారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ వృద్ధిరేటు 16.8 శాతం, పారిశ్రామిక రంగం వృద్ధిరేటు 8.0 శాతం, సర్వీస్ రంగం వృద్ధిరేటు 14.1 శాతం ఉందని ఈటల వివరించారు.

అప్పుడు కరెంట్ కోసం ధర్నాలు..

గతంలో విద్యుత్ కోతలకు నిరసనగా పరిశ్రమల యజమానులే ధర్నాలు చేశారని, వాటితో తనతో పాటు కిషన్ రెడ్డి, డాక్టర లక్ష్మణ్ కూడా పాల్గొన్నారని చెప్పారు. నేడు రాష్ట్రంలో విద్యుత్ కోతలే లేకుండా చేశామని, అందుకే రైతులతో పాటు, పారిశ్రామికవేత్తలు కూడా సంతృప్తిగా, సంతోషంగా ఉన్నారని చెప్పారు. హైదరాబాద్, పాతబస్తీతో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమదృష్టితో అభివృద్ధి చేస్తామని, అవసరానికి అనుగుణంగా నిధులు కేటాయిస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యే నిధులు కోటి రూపాయల కోసం వందలసార్లు తిరగాల్సి వచ్చేందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేల ఆత్మగౌరవం పెరిగే విధంగా మూడు కోట్లు కేటాయిస్తున్నామని, పార్టీలకు అతీతంగా ఈ నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదన్నారు.

రేషన్ సరుకుల్లో కోత వాస్తమే..

గతంలో ఇస్తున్న రేషన్ సరుకుల్లో కోత విధించిన మాట వాస్తవమేనని, కేంద్రం నిర్ణయం వల్లే ఇది జరిగిందని ఈటల పేర్కొన్నారు. కేంద్రం కోటి 91 లక్షల మందికి మనిషికి 5 కేజీల బియ్యం ఇస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం 2 కోట్ల 74 లక్షల మందికి మనిషికి 6 కేజీల చొప్పున బియ్యం ఇస్తుందన్నారు.

జీడీపీలో అప్పల వాటా 21 శాతమే..

రాష్ట్ర జీఎస్‌డిపిలో అప్పుల వాటా 21 శాతం మాత్రమే ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాలకు పది సంవత్సరాల్లో లక్షా 19 వేల కోట్లు పెట్టుబడి వ్యయం చేస్తే, అదే ఈ నాలుగు సంవత్సరాల్లో లక్షా 17 వేల కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. రైతులకు 17 వేల కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాల్లో ఒక్కటైనా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా అని ఈటెల ప్రశ్నించారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఏమీ చేయడంలేదని బీజేపీ సభ్యులు విమర్శించడం సరికాదన్నారు. పసుపు, కారం, చింతపండు ఎవరూ తీసుకోకపోవడం వల్ల ఆపేశామని, కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకే లభిస్తున్నందున దాన్ని ఆపేసినట్లు చెప్పారు.

మానవతా విలువలతో ఉన్నాం..

గొప్ప మానవతా విలువలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని ఈటల చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 5 లక్షల బీమా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంబీసీ కార్పోరేషన్‌కు గతేడాది వెయ్యి కోట్లు కేటాయించినా, ఖర్చు చేయలేక పోయామని, ఈసారి 3 నెలల్లోనే విధి విధానాలు రూపొందిస్తామన్నారు.

మైనారిటీ సంక్షేమంకోసం నిధు లు విడుదల చేయడంలేదన్న అక్బరుద్దీన్ విమర్శలను ఈటల ఖండించారు. అన్ని వర్గాల కోసం నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. తెలుగు విషయంలో ఏ భాషకు ఇబ్బంది లేనివిధంగా అమలు చేస్తామని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.


బీజేపీ ప్రభుత్వాలు అప్పులు చేయట్లేదా?: కేసీఆర్



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): కేంద్రం విధించిన పరిమితికి లోబడే అప్పులు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. బడ్జెట్ పై చర్చ అనంతరం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సమాధానం చెబుతున్న సమయంలో శాసన సభలోకి వచ్చిన ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ ఈ విషయం చెప్పారు. దేశంలోనూ, 21 రాష్ట్రాల్లో అధికారంలో బీజేపీ ప్రభుత్వాలు అప్పులు చేయకుండానే నడుస్తున్నాయా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.82 లక్షల కోట్ల అప్పులని పేర్కొన్నారు. ఈ విషయంలో బీజేపీ సభ్యులు కేవలంరాజకీయ కోణంలోనే విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కేంద్రం చేసిన అప్పులు జీడీపీలో 49 శాతానికి చేరుకున్నాయని, తెలంగాణ ప్రభుత్వం చేసిన అప్పులు జీఎస్‌డీపీలో 21 శాతం మాత్రమేనన్నారు. నాలుగు సంవత్సరాల్లో తాము ఒక్క మంచి పని కూడా చేయాలేదా అని సీఎం ప్రశ్నించారు. సద్విమర్శలు చేస్తే మంచిదని, ప్రభుత్వం వాటిని పరిగణలోకి తీసుకుని, పరిష్కరిస్తుందన్నారు. రుణ మాఫీతో 38 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని, ఎక్కడైనా రుణమాఫీ కాకుంటే తమ దృష్టికి తీసుకువస్తే రెండుమూడు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. దేశంలో మంచి వేత నాలు ఉద్యోగులకు చెల్లిస్తున్నామని, పీఆర్‌సీ తప్పకుండా వేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా తెలంగాణ అమలుచేస్తున్నన్నీ పథకాలు అమలు చేస్తుందా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రానికి మనమే శాపనార్థాలు పెట్టు కోవడం సరికాదన్నారు. మనకు మంచి ఆదాయం వస్తున్నందునే మంచి పథకాలకు రూపకల్పన చేస్తున్నామని చెప్పారు.

ఫలక్‌నుమా వరకు వంద శాతం మెట్రో

- భవిష్యత్తులో ఎయిర్‌పోర్టు దాకా..: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు వంద శాతం మెట్రో పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శాసనసభలో మంగళవారం పాతబస్తీ ప్రాంతానికి మెట్రో రైలు పనుల ఆలస్యంపై ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, ముంతాజ్ అహ్మద్‌ఖాన్, మహ్మద్ మోజంఖాన్, జాఫర్ హుస్సేన్, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కౌసర్ మొయినుద్దీన్ అడిగిన ప్రశ్నకు మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పారు. మెట్రో రైలును మొదటి దశలో 72 కిలోమీటర్ల దూరానికి 30 కిలోమీటర్లలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమయ్యాయన్నారు. 85 శాతం పురోగతితో ప్రాజెక్టు ఇతర పనులు త్వరితగతిన జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి 68.5 కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణాన్ని పూర్తిచేస్తామన్నారు. ఫేజ్ -2 మెట్రో రైల్ నిర్మాణానికి ఎల్ అండ్ టీ విముఖత చూపడంతో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ సమగ్ర ప్రాజెక్టు రూపొందించే పనిని అప్పగించామన్నారు. జేబీఎస్- ఫలక్‌నుమా కారిడార్‌లోని ఫేజ్-1 ప్రాజెక్టు పనులు ఎంజీబీఎస్- జేబీఎస్ మధ్య చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. కాగా, టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేండ్లయినా పాతబస్తీ ప్రాంతంలో మెట్రో రైలు నిర్మాణం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బీజేపీ సభ్యులు సభను వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందిస్తూ రాజకీయంగా లబ్ధి పొందేందుకే బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు.

పార్కింగ్‌కోసం స్మార్ట్‌కార్డు

వాహనాల పార్కింగ్ కోసం స్మార్ట్ కార్డు, స్మార్ట్ యాప్ రూపకల్పన చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. శాసనసభలో మంగళవారం టీఆర్ఎస్ సభ్యుడు వి.శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. జీహెచ్ఎంసీ పరిధిలో 10,15,431 ఫోర్ వీలర్ వాహనాలు, 40,14,034 టు వీలర్ వాహనాలు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణ ప్రాంతాల కోసం ప్రణాళిక, అభివృద్ధి కార్యకలాపాలు, అమలు, నిర్వహణ వంటి అంశాలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పార్కింగ్ విధానాన్ని జారీ చేసిందని తెలిపారు. తాను బాధ్యతలు చేపట్టే నాటికి జీహెచ్ఎంసీ పరిధిలో 54 పార్కింగ్ యార్డుల ద్వారా సంవత్సరానికి కేవలం రూ.96 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చేందని చెప్పారు. దీన్ని సైతం తర్వాత ఫ్రీ పార్కింగ్ జోన్లుగా చేశామన్నారు. నగరంలో పార్కింగ్ సమస్య వేధిస్తోన్న మాట వాస్తవమేనని తెలిపారు. దీని పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఐఏఎస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా నియమించామని పేర్కొన్నారు.

10 లక్షల ఎకరాల స్థిరీకరణ: హరీశ్



హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): మిషన్ కాకతీయ పథకంతో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల భూమి స్థిరీకరణ జరుగుతుందని నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. మిషన్ కాకతీయపై అధ్యయన యాత్రలు, పండ్ల మార్కెట్ల అభివృద్ధి అంశాలపై పాతూరి సుధాకర్‌రెడ్డి, నారాదాసు, గంగాధర్ గౌడ్, బోడకుంటి వెంకటేశ్వర్లు, బాలసాని, సుంకరి రాజు మంగళవారం జరిగిన మండలిలో వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4678 చెరువులను మిషన్ కాకతీయ పథకం ద్వారా పునరుద్ధరించామన్నారు. ఇప్పటి వరకు 2.88 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగిందన్నారు. చెరువుల పునరుద్ధరణతో చేపల దిగుబడి కూడా 36 శాతం నుంచి 39 శాతానికి పెరిగిందని తెలపారు. నల్గొండలో బత్తాయి పండ్ల కోసం ప్రత్యేకంగా మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లకు ఏర్పాటు చేసిన దుకాణాల్లోనే ఇథలిన్ రిఫైనింగ్ చాంబర్లను నిర్మించుకునేందుకు అనుమతినిచ్చినట్టు తెలిపారు. కాగా, భూమి రికార్డులు, సర్వే, సెటిల్‌మెంట్, రిజిస్ట్రేషన్ సర్వీసులను ఏకీకృతం చేసి వివరాలన్నింటినీ ఒకే ప్రదేశంలో నిర్వహించడానికి కోర్ బ్యాంకింగ్ విధానం తరహాలోనే ఒక కొత్త వెబ్ ఆధారిత సమీకృత భూమి రికార్డుల నిర్వహణ విధానాన్ని డిజైన్, అభివృద్ధి, నిర్వహించడానికి ధరణి ప్రాజెక్టును ప్రారంభించామని రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ తెలిపారు. దొంగ పాస్ పుస్తకాలను నివారించడానికి, ప్రభుత్వం అందించే సబ్సిడీలు అసలైన రైతులకు చేరడానికి వీలు కల్పించడం కోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, వ్యవసాయ శాఖలు, ఆర్థిక సంస్థలకు అనుసంధానించి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

అన్ని వర్గాల బడ్జెట్: శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రయోజనాలు ఉన్నాయని టీఆర్ఎస్ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉందనడానికి జీఎస్‌డిపీ పెరుగుదలే సాక్ష్యమన్నారు. మంగళవారం నాడు సభలో బడ్జెట్ పై జరిగిన చర్చలో పాల్గొన్నారు . రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నిరంతరం రాష్ట్ర అభివృద్ధి గురించే తపిస్తున్నారని, ఆయనే స్వయంగా ప్రాజెక్టులకు రీడిజైన్ చేశారని, అనేక గొప్ప పథకాలకు రూపకల్పన చేశారని అభినందించారు. రైతులకు బీమా పథకం, పంట పెట్టుబడి సాయం పథకం దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయడంలేదన్నారు. పాలమూరు, చేవెళ్ల పథకంతో రంగారెడ్డి జిల్లాకు నీళ్లే రావన్నారు. అర్హులైన పేదలందరికీ కులాలతో సంబంధం లేకుండా ఆసరా ఫించన్లు ఇస్తున్నామని, ఇలా ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు.

13 కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్లు: లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13 కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్లా, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలో కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని మండలిలో తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేంద్రాల్లో 5 లక్షల మందికి పైగా స్క్రీనింగ్ చేసినట్టు తెలిపారు. అందులో 2 వేల మందికి పైగా కేన్సర్ ఉన్నట్టు గుర్తించినట్టు పేర్కొన్నారు. మందుల దుకాణాల్లో తనిఖీలను పెంచాలని, నెలలో కనీసం 25 రోజులు తనిఖీలను నిర్వహించాలని, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లనందరినీ ఆదేశించినట్టు తెలిపారు.

కౌలు రైతులకు 'సాయం'లేదు

- 96 శాతం భూ రికార్డుల ప్రక్షాళన
- ఆరు బ్యాంకుల్లో చెక్కుల చెల్లుబాటు
- గతంలో రైతులనుంచి శిస్తు వసూలు
- నేడు రైతులకు చెల్లింపు: పోచారం



హైదరాబాద్, మార్చి 20(మనం ప్రతినిధి): రైతులకు అందించే ముందస్తు పెట్టుబడి ఎకరాకు రూ.4 వేలు పథకాన్ని కౌలు రైతులకు ఇచ్చే పరిస్థితిలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం శాసనసభలో సభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పుట్టా మధుకర్, వేముల వీరేశం, వి.శ్రీనివాస్‌గౌడ్, ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. చెరుకు పంటతో పాటు సంవత్సరం మొత్తం పంటకాలంగా ఉండే కొన్ని ఉద్యాన పంటలకు రెండు సార్లు చెక్కుల పంపిణీ ఉంటుందని తెలిపారు. పార్ట్ ఏ కింద రాష్ట్రవ్యాప్తంగా 96 శాతం(1.42 లక్షల ఎకరాలు) వివాదరహిత భూములను సర్వే చేసినట్టు చెప్పారు. పార్ట్ బి కింద మరో 4 శాతం భూముల రికార్డులను పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. భూరికార్డుల ప్రక్షాళన ఆధారంగా రైతు పెట్టుబడి పథకం కింద 72,13,111 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ఈ మొత్తం పథకం కింద 2018-19 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించినట్టు గుర్తు చేశారు. వానాకాలం పంటకు ఏప్రిల్ 20 నుంచి మే చివరి వరకు, యాసంగి పంటకు నవంబరు 20 నుంచి చెక్కులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
బుధవారం, మార్చి 21


ప్లీనరీ ఫలిస్తుందా?

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమిలో భాగస్వామ్యం కావడం కానీ, బయట నుంచి మద్దతివ్వడం గానీ జరగదని వామపక్షాల్లో సీపీఎం ఇప్పటికే నిర్ణయించుకుంది. దానికితోడు కాంగ్రెస్ వ్యతిరేక, బీజేపీ వ్యతిరేక ప్రాంతీయ పార్టీలు మూడో ఫ్రంట్ పెట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. జాతీయస్థాయిలో విడివిడిగా వామపక్షాలు, వివిధ ప్రాంతీయ పార్టీల ప్రభావం గణనీయమైనది కాకపోయినా, ఫ్రంట్‌గా ఏర్పడిన సమయంలో విజయావకాశాలను కల్పించే శక్తిని తోసిపుచ్చలేము. అయితే గత సార్వత్రిక ఎన్నికల్లో దెబ్బతిని, అస్తిత్వ సంక్షోభంలోకి కూరుకుపోయిన కాంగ్రెస్ బలమైన జాతీయ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందన్న ఆశలు అడుగంటినట్లు ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల వ్యూహ రచన కోసం కాంగ్రెస్ పార్టీ తన 84 ప్లీనరీ సమావేశాలను న్యూఢిల్లీలో మూడు రోజులపాటు జరుపుకుంది. లోక్‌సభలో 50 సీట్లు, మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తిరిగి జాతీయస్థాయి ప్రత్యామ్నాయంగా పుంజుకోవడం కష్టతరమైన విషయం. అయితే ప్రధాన స్రవంతి ఎన్నికల రాజకీయాల్లో సొంత పార్టీ నిర్మాణం, ప్రజాబలం కన్నా అధికార పార్టీపై ప్రజావ్యతిరేకత అనేది గెలుపు గీటురాయిగా ఉంది. ఈ నేపథ్యంలో ఐదేళ్ళ పాలనలో బీజేపీ సాధించిన ప్రజావ్యతిరేకతే కాంగ్రెస్ గెలుపునకు ప్రాతిపదికగా నిలుస్తుంది. అయితే చిక్కేమిటంటే తృతీయ ప్రత్యామ్నాయం పేరుతో బీజేపీ వ్యతిరేక, కాంగ్రెస్ వ్యతిరేక థర్డ్ ఫ్రంట్ అధికార పార్టీ వ్యతిరేక ఓట్లను ఆకర్షిస్తే కాంగ్రెస్ గెలుపు అసాధ్యమవుతుంది. ఎన్నికలు సమీపించే కొద్దీ రాజకీయ పార్టీల సమీకరణాలు ఎలా మారుతాయో వేచిచూడాలి.


కాంగ్రెస్‌కు రాహుల్ గాంధీ అధ్యక్షుడయ్యాక జరిగే తొలి ప్లీనరీ సమావేశం వల్ల, రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ సమావేశాలు అత్యధిక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ప్లీనరీలో జరిగే తీర్మానాలపై ఆధారపడి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలుంటాయి. వివిధ వర్గాల ప్రజలకు పలు హామీలిస్తూ ఎన్నికల ప్రణాళికను ముందస్తుగా ప్లీనరీలో వెల్లడించారు. ఎన్నికల పొత్తులపై సంకేతాలిచ్చారు. బీజేపీ పాలనలోని పలు వైఫల్యాలను, నిరంకుశ పోకడలను, ప్రజలను విచ్ఛిన్నం చేసే విద్వేష-విభజన రాజకీయాలను కాంగ్రెస్ ఈ ప్లీనరీలో దుయ్యబట్టింది. దేశవ్యాప్తంగా గోరక్షక దళాల అమానవీయ అకృత్యాలు, దాడులు వగైరా విద్వేషకాండలకు బీజేపీ ప్రత్యక్ష/పరోక్ష సమర్థనను ప్లీనరీ విమర్శించింది. బీజేపీ పాలనలో విదేశాల్లో నల్లధనం వెలికితీత, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, యువతకు ఉపాధి కల్పన వంటి ఎన్నికల హామీల విఫలం నుంచి పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ తప్పుడు చర్యలు, అవినీతి కుంభకోణాలపై కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. మోదీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిన వైనాన్ని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం దేశం ఎదురు చూస్తోందని ప్లీనరీ సరిగానే అంచనావేసింది.

అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ పాలనకు ముందు పదేళ్ళ పాటు సాగిన కాంగ్రెస్ పార్టీ యూపీఏ పాలనలో పౌర అణు ఒప్పందం నుంచి వివిధ సరళీకరణ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు, వాటి నేపథ్యంలో తలెత్తిన అసంఖ్యాక కుంభకోణాల గురించి ఈ ప్లీనరీ కించెత్తు పశ్చాత్తాపం కానీ, ఆత్మవిమర్శను ప్రకటించలేదు. పైగా ఆ విధానాలను బీజేపీ సవ్యంగా అమలు చేయలేదని, తాను అధికారంలోకి వస్తే మరింత సమర్థంగా ఆ విధానాలను అమలు చేయగలనని ప్లీనరీ ప్రకటించింది. ప్రపంచ వాణిజ్యసంస్థలో భారత్ భాగస్వామ్య పక్షమైనప్పటి నుంచి అధికారంలోకి వచ్చిన ఏ రాజకీయ పార్టీ అయినా ఆ సంస్థ విధివిధానాలను అనుసరించి వ్యవసాయ, పారిశ్రామిక విధానాలను, విదేశీ వాణిజ్య విధానాన్ని అమలు చేయడం తప్ప మరొక ప్రత్యామ్నాయమంటూ ఉండదు. దాంతో స్వాతంత్రోద్యమ అనంతరకాలంలో వివిధ రాజకీయపక్షాలు ప్రత్యామ్నాయ రాజకీయార్థిక విధానాల ఎజెండాతో ఎన్నికల్లో తలపడేవి. అయితే డబ్ల్యూటీవో ఒప్పందం తర్వాత రాజకీయ పక్షాలకు సొంత ఆర్థిక విధానమంటూ అమలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దాంతో ఆయా రాజకీయ పక్షాల లక్ష్యాలను బట్టి విభిన్న ఆర్థిక విధానాలతో రూపొందిన ఎన్నికల ఎజెండా స్థానంలో అవినీతి నిర్మూలన, పాలనలో పారదర్శకత, అస్తవ్యస్తత, ప్రపంచీకరణను మరింత సమర్థంగా అమలు చేయడం వంటి నినాదాల ఎజెండా మాత్రమే మిగిలింది. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయ పక్షాలైన బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు గానీ, వివిధ ప్రాంతీయ పార్టీలకు గానీ ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమలు చేయడం తప్ప వేరే గత్యంతరం ఉండదు. అందువల్ల జాతీయ రాజకీయ పక్షాలు, థర్డ్ ఫ్రంట్‌లు అధికారంలోకి రావడం వల్ల ప్రజలకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. తాత్కాలికంగా ఏవో కొన్ని సంక్షేమ పథకాల వల్ల కలిగే ప్రయోజనం తప్ప దీర్ఘకాలిక ఆర్థికలబ్ధి అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదు. అయితే ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఫాసిజం రెక్క విప్పుతోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రభుత్వంలోనూ, సమాజంలోనూ నేడు ఫాసిజం బలంగా వేళ్లూనుకుంటున్న సందర్భంలో కనీస నిరసన కూడా వ్యక్తం చేయలేని పరిస్థితి రోజురోజుకూ ఏర్పడుతోంది.

నేడు దేశంలో ఆర్థిక ఉదాసీనత అలుముకొని ఉంది. రైతులు, కార్మికులు, చేతివృత్తుల వాళ్ళు, అసంఘటిత రంగ శ్రామికులు, దళిత-బహుజన సమూహాలు, మహిళలు, యువజనులు తదితర సమాజంలోని ప్రతి సమూహమూ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలు సంఘటితం కావల్సిన తరుణంలో కుల, మత, జాతి అస్తిత్వాల మధ్య అంతర్గత వైషమ్యాలు ప్రజ్వరిల్లడం వల్ల సంక్షోభ వ్యతిరేక సంఘటిత పోరాటం నీరుగారి పోతోంది. మాల-మాదిగలు, ఆదివాసి-లంబాడీ, బీసీ-ఎంబీసీ, మైనారిటీ వగైరాల రూపంలో పాలకవర్గాలు సృష్టించిన ప్రజల మధ్య వైరుధ్యాలు వైషమ్యాల స్థాయికి చేరుకోవడంతో పరిష్కారాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో కొన్ని సూచనలు, సంక్షేమ పథకాలు, దేశంలో ఒక్క శాతంగా ఉన్న శతకోటి సంపన్నులపై 5 శాతం పన్ను విధించడం వంటి ప్రజాకర్షక విధానాలతో కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల బరిలోకి దిగబోతుంది. కొనుగోలు శక్తి పోయి, రోజురోజుకు దిగజారుతున్న ఆర్థిక పరిస్థితుల నుంచి పెరుగుతున్న ప్రజాగ్రహాన్ని ప్లీనరీ నినాదాలు ఏ మేరకు ఓట్లుగా మారేందుకు ఉపకరిస్తాయో వేచి చూడాలి.



మంచిమాట



‘ఎందుకు ఈపని చేస్తున్నాను? దీనివల్ల ఫలితం ఏమిటి? ఇందులో విజయం సాధించగలనా? ఈ మూడు ప్రశ్నలు వేసుకోకుండా ఏ పనీ మొదలు పెట్టకూడదు.’

- చాణక్యుడు

స్వేచ్ఛారావం



జి. హరగోపాల్

ఉప ఎన్నికలు రైతాంగ ఉద్యమాలు

గత ఒకటి రెండు నెలల్లోనే భారత రాజకీయాలు కొన్ని మలుపులు తిరుగుతున్నాయి. మూడు నాలుగు సంవత్సరాలుగా రాజకీయాలు సాంస్కృతిక రంగానికి పరిమితమై ప్రజలను మత లేదా కల్చరల్ (cultural) సమస్యల చుట్టూ సమీకరించే దిశగా సాగుతున్నాయి. కల్చర్ మానవ జీవితంలో ప్రధానమైనదే కానీ, దానికి రాజకీయ, ఆర్థిక (political economy) మూలాలుంటాయి. ఈ మధ్యకాలంలో గోరఖ్‌పూర్ లాంటి బలమైన మతతత్వ ప్రభావముండి మఠాధిపతులు రెండున్నర దశాబ్దాల నుంచి తిరుగులేకుండా గెలిచే ప్రాంతాల్లో స్వయాన యోగి ఆదిత్యనాథ్, అదీ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత బీజేపీ అభ్యర్థి ఓడిపోయాడు. దానికి తోడు ఫూల్‌పూర్ నియోజకవర్గంలో కూడా బీజేపీ అభ్యర్థి ఓడిపోయాడు. అయితే, గతంలో గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో బీజేపీకి వ్యతిరేకంగా గాలులు వీస్తున్న వాతావరణం కనిపించినా గోరఖ్‌పూర్‌లో ఓటమి రాజకీయాలను ఒక మలుపు తిప్పే ప్రాధాన్యత కలిగుంది. యోగి ఆదిత్యనాథ్‌ను రాష్ట్రీయస్వయం సేవక్ సంఘ్ దాదాపు మోదీకి ప్రత్యామ్నాయంగా లేదా ఆయన వారసుడిగా భావించి ఆయనను దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి ఉపయోగిస్తోంది. తన సొంత నియోజకవర్గంలో తన సొంత అభ్యర్థిని గెలిపించలేని వ్యక్తి ఇతర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం చేయడానికి కావలసిన అర్హత కోల్పోయాడు. ‘ఇంట గెలిచి రచ్చ గెలవాలనే’ నానుడి మనదేశంలో విస్తృతంగా ప్రజల నాలుకల మీద ఆడుతుంది. ఇది యోగికే కాక బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కి కొంతకాలం కోలుకోలేని దెబ్బ.

బీజేపీకిగానీ, ఆ మాటకొస్తే ఏ పార్టీకైనా ఎన్నికలలో ఎదురుదెబ్బ తగలడానికి లేదా గాలి ఎదురు తిరగడానికి కారణాలు కొంత లోతుగానే ఉంటాయి. అవి అంత సులభంగా తేలవు. టీవీ చానెల్‌లో జరిగే చర్చలలో లేవదీసే అంశాలకంటే ఈ కారణాలు చాలా నిక్షిప్తంగా ఉంటాయి. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్‌లో ఓడిపోవడానికి ఎస్పీ (SP), బీఎస్పీ పార్టీల పరస్పర సహకారం అంటున్నారు, అది కొంతవరకు నిజమైనా గత పార్లమెంటరీ ఎన్నికలలో యోగికి 53 శాతం ఓట్లు వచ్చాయి. ఈ లెక్కన ఈ రెండు పార్టీల సహకారమే కాక వేరే కారణాలు కూడా ఉన్నాయి. యోగి ఆదిత్యనాథ్ గెలిచినప్పటి నుంచి చేపట్టిన సమస్యలలో కల్చరల్ సమస్యలే ఎక్కువ. శాంతిభద్రతల పేర చాలామంది క్రిమినల్స్ అని ఆరోపించి ఎన్‌కౌంటర్ చేశారు. దీనికి కనీసం మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లో చేసే కట్టుకథలు కూడా లేవు. నేరస్తులను సరాసరి చంపవచ్చునా, అది చట్టబద్ధపాలనా పరిధిలో ఇముడుతుందా అనే ప్రమాణం కాక ‘ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే’ అనే ధర్మసూత్రం ఉపయోగిస్తే దాని పర్యవసానాలు ఉంటాయని, భారత్ ప్రజలకు కొంతైనా రాజ్యాంగం, రాజ్యాంగపర హక్కులు, చట్టబద్ధ పాలనమీద ఈ ఏడు దశాబ్దాలలో కొంతైనా అవగాహన ఏర్పడిందనేది ఒక వాస్తవం. ఇది ఉన్నతమైన చైతన్యస్థాయి అని నేనడం లేదు, కానీ కొంత చైతన్యమైనా పెరిగిందనేది నా భావన. భవిష్యత్తులో బీజేపీ రాజకీయాలు అణచివేయండి, అణగదొక్కండి అనే అవగాహన మీద సాధ్యమవుతుందా అనేది వాళ్లు తేల్చుకోవలసిన అంశం.

రాజకీయాలు కల్చరల్ పరిధి నుంచి క్రమక్రమంగా ఆర్థిక రాజకీయ సమస్యల వైపు మళ్లడం మనం కొంత స్పష్టంగా చూడవచ్చు. నిజానికి కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికలలో ఎందుకంత చిత్తుగా ఓడిపోయిందనే ప్రశ్నకు చాలామంది అవినీతి అని, స్కాంలని విశ్లేషిస్తూ వచ్చారు. పెద్దపెద్ద టూజీ (2G) స్కాం లాంటి ప్రభావం గ్రామీణ ప్రాంత ప్రజలపై ప్రత్యక్షంగా ఉండదు. ప్రత్యక్షంగా ఉండాలి అంటే రాజ్యం సంక్షేమ రాజ్యమై ఉండాలి. అలాంటప్పుడు 2జీ స్కాం వలన రాజ్యం దాదాపు లక్షా 73 వేల కోట్లు కోల్పోయింది అని అంచనా వేస్తే ఆ ఆదాయం నికరంగా ప్రభుత్వ ఖజానాకు వస్తే అది పేదల సంక్షేమం కొరకు, వైద్యం కొరకు, విద్య కొరకు ఖర్చు పెట్టే విధానాలుంటే ప్రజల జీవనం మీద దాని ప్రభావం ఉంటుంది. దేశంలో వంద కార్పొరేట్ల దగ్గర 49 లక్షల కోట్ల సంపద కేంద్రీకృతమైనపుడు 2జీ స్కాం వలన అది యాభై లక్షల కోట్లకు చేరుకోలేదనేది వాస్తవం. పేదలను దోచి పెద్దలకు చేరవేసే బాధ్యత రాజ్యం తనమీద వేసుకున్నపుడు స్కాంలు పెద్దల సమస్యేగానీ పేదల సమస్య కాదు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయక సంపదను కొల్లగొట్టి కేవలం ఒక్కశాతం మంది దేశ ఆదాయంలో 73 శాతం సంపద అనుభవిస్తున్నారని ఆక్స్‌ఫాం (oxoform) ఈ మధ్యే తన అధ్యయనంలో పేర్కొంది. గత నాలుగు అయిదు దశాబ్దాలుగా మొత్తం జాతి ఆదాయంలో వ్యయసాయం తన వాటాను ప్రతి సంవత్సరం కోల్పోతూ ఇపుడు గ్రామీణ ప్రాంతాల వాటా అంటే 60 శాతం ప్రజల వాటా కేవలం 11 శాతానికి పరిమితమైంది. ఈ ఆర్థిక అభివృద్ధి నమూనా పుణ్యమా అని గత రెండు దశాబ్దాలలో మూడున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ పెరిగిన అంతరాల వలన నిర్వీర్యమౌతున్న రైతాంగం 2014లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఒక ప్రధాన కారణమని ఇంతవరకు విశ్లేషకులు కాని, కాంగ్రెస్ పార్టీ కాని అంగీకరించడం లేదు. దీనిని అంగీకరించకున్నా నిన్న మొన్న జరిగిన ఎ.ఐ.సి.సి. ప్లీనరీలో రాహుల్‌గాంధీ రైతాంగాన్ని, వాళ్ల సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈ సమస్యను పరిష్కారం చేస్తామని మొత్తం రుణమాఫీ చేస్తామని, వ్యవసాయ పంటలకు మద్దతుధర ఇస్తామని, రైతు చేసే అన్ని ఖర్చులని, (కుటుంబసభ్యుల శ్రమతో బాటు) పరిగణనలోకి తీసుకుని కనీసధర నిర్ణయిస్తామని అన్నారు. అని ఒకవైపు అంటూనే వ్యవసాయ వ్యతిరేక విధానానికి ప్రధాన సంధానకర్తలైన మన్‌మోహన్ సింగ్, చిదంబరంల సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాళ్ళిద్దరు కూడా ప్రపంచీకరణకు, అంతర్జాతీయ పెట్టుబడికి చేసిన సేవలు అంతా ఇంతా కాదు. ఇద్దరికీ ప్రజలతో ఎలాంటి ప్రత్యేక సంబంధాలు లేవు. ఇద్దరు 2014 ఎన్నికలలో పోటీ చేయలేదు ప్రచారం కూడా చేయలేదు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయాన్ని అంతర్జాతీయ వాణిజ్య సంస్థలో చేర్చకూడదని దేశంలో ఒత్తిడి ఉన్నా దానిని విస్మరించి మనం (WTO) అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందంలో భాగమైపోయాము. ఈ అంగీకారం ప్రకారం రాజ్యం లేదా ప్రభుత్వం వ్యవసాయానికి 10శాతం కంటే ఎక్కువ సబ్సిడీ ఇవ్వడానికి వీలులేదు. అవసరమున్నా లేకున్నా విదేశీ ధాన్యాలను దిగుమతి చేసుకోవాలి. నిజానికి ఈ ఒప్పందం భారతదేశంలోని చిన్న సన్న రైతుల పాలిటి శాపంలాంటిది. పూర్తి రుణమాఫీ అంటే అంతర్జాతీయ ఒప్పందాన్ని ఉల్లంఘించడమే. కాంగ్రెస్ పార్టీకి అంత ధైర్యం, చొరవ ఉందా అన్నది కీలకమైన ప్రశ్న. కాంగ్రెస్ లాగే ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ ముఖ్యమంత్రులు రైతులకు రాయితీలు ఇస్తామని ప్రకటించి ఉన్నారు. కానీ వీళ్ళు ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ప్రభావాన్ని ఎదిరించగలరా, ఆ సత్తా వాళ్ళకుందా అన్నది కీలక ప్రశ్న.

> ఉప ఎన్నికలలో పాలక పార్టీలను ఓడించడం ఒక ఎత్తైతే, మహారాష్ట్ర రైతాంగం చేపట్టిన ఉద్యమం మరో ఎత్తు. రైతాంగం తమ సమస్యల పరిష్కారానికి తామే చర్యకు దిగారు. అయితే మొత్తం అభివృద్ధి నమూనాను ప్రశ్నించి, ప్రత్యామ్నాయ అభివృద్ధి గురించి ఇంకో రైతాంగ చైతన్యంతో స్పష్టంగా వచ్చేదాకా రైతాంగ సంక్షోభం అనివార్యంగా భావించవలసి ఉంటుంది.



రైతాంగ సమస్య రాయితీలకు, రుణమాఫీలకు చెందిన అంశమే కాదు. అవి కేవలం ఒక తీవ్ర సమస్య బహిర్గత రూపాలు (Symptoms) మాత్రమే. రైతాంగ సమస్య మొత్తం సామ్రాజ్యవాద ప్రేరేపిత అభివృద్ధి నమూనాలో భాగం. పెట్టుబడి నిజమైన సంపదగా కాక ద్రవ్యపెట్టుబడిగా మారింది. ద్రవ్య పెట్టుబడి (Financial capital)కి విపరీత చలనముంటుంది. అది ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్ళిపోవచ్చు. అది పరిశ్రమలలా కాదు. రాజ్యం దానిని ఏమాత్రం ముట్టినా అది భగ్గుమంటుంది. దానికి ఎన్ని లాభాలు వచ్చినా అంతం, ఆది ఉండదు. విదేశీ పెట్టుబడి రావాలంటే, వాళ్ళ లాభాలు విపరీతంగా పెరగాలంటే, వృద్ధిరేటు రెండంకెలు చేరుకోవాలంటే వ్యవసాయ రంగాన్ని పిప్పిపిప్పి చేస్తే కాని సాధ్యం కాదు. మొత్తం నమూనా మూలాలను మార్చవలసి ఉంటుంది. ఇది పాలకులు తమంతగా తాము చేస్తారని మనం భావించడం కేవలం భ్రమే అవుతుంది.

రాజకీయాలు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనప్పుడు, చరిత్రలో ప్రజలే ప్రత్యక్షంగా ప్రవేశిస్తారు. దేనిని ఎవ్వరికి వదలరు. గత రెండు దశాబ్దాలుగా తీవ్ర నష్టాల్ని ఎదుర్కొని, ప్రాణాలని సైతం పోగొట్టుకున్న రైతులు ఇప్పుడు సమీకరణ అవుతున్న సంకేతాలు స్పష్టంగా మహారాష్ట్ర నుంచి వచ్చాయి. ముప్పై నలభై వేలమంది రైతులు మార్చి ఏడు నుంచి మార్చి 12 వరకు అంటే ఐదు రోజులు నాసిక్ నుంచి బయలుదేరి కాలినడకన చాలా క్రమశిక్షణతో బాంబే చేరుకున్నారు. వాళ్ళ డిమాండ్స్ చాలా స్పష్టంగా, నిర్దిష్టంగా ఉన్నవి. అవి తమ జీవిత అనుభవం నుంచి తాము భాగమైన వ్యవసాయ సంక్షోభం నుంచి వచ్చినవి. పోయిన యు.పి. ఎన్నికలలో బీజేపీ రుణమాఫీ ప్రకటించి 34 వేల కోట్లు ఇస్తామని వాగ్దానం చేసినా, భిన్న సాంకేతిక పాలనాపర అభ్యంతరాల వలన అది అమలు కాలేదు. అందుకే ఈ పర్యాయం ఏ అడ్డంకులు, ఆంక్షలు లేకుండా మొత్తం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ చేసిన సిఫారసులను అమలు చేయాలని అకాలపు వర్షానికి నష్టపోయిన వారికి ఎకరాకు నలభైవేలు ఇవ్వాలని సూటిగా స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాల మేరకు తాత్కాలికంగా ఉద్యమాన్ని విరమించి, ఏమాత్రం తాత్సారం చేసినా మళ్ళీ ఉద్యమిస్తామని హెచ్చరిక చేసి తిరిగి వెళ్ళారు. మహారాష్ట్ర రైతాంగ ఉద్యమంలో ఉండే సమస్యలే దేశవ్యాప్తంగా ఉన్నవి. ఉప ఎన్నికలలో బీజేపీ ఓడిపోవడానికి ఈ బలమైన కారణం అంతర్లీనంగా ఉన్న విషయాన్ని మనం గమనించాలి.

ఎన్నికలు వచ్చినా, ఒక పార్టీ ఓడి మరొక పార్టీ గెలిచినా అన్ని పార్టీలు (పార్లమెంటరీ వామపక్షాలు సహా) ఒక అభివృద్ధి నమూనాలో చిక్కుకున్నాయి. పాలకులకు ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మధ్య ఒక అగాథమేర్పడింది. నిజమే ఒకదేశం పారిశ్రామీకరణ చెందుతున్నప్పుడు వ్యవసాయ ప్రాధాన్యత కొంత తగ్గుతుంది. కాని గ్రామీణ ప్రాంతంలో రైతులతో సహా భూమిలేని నిరుపేదలు ఎక్కడికి పోతారు ఏమౌతారు అనేది ప్రధాన ప్రశ్న. అందుకే గుజరాత్‌లో ‘ఉనా’ సంఘటన తర్వాత దళిత ఉద్యమం ఒక గణనీయమైన మార్పుకు గురైంది. ఇంతకుముందు మధ్యతరగతి దళిత ఉద్యమ డిమాండ్లలా కాక ‘‘ఆవుతోక మీకు ఐదు ఎకరాలు మాకు’’ అనే ఒక బలమైన అర్థవంతమైన డిమాండ్ ముందుకు వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో భూసంస్కరణతో బాటు, వ్యవసాయేతర పరిశ్రమలను వికేంద్రీకరించి ఉత్పత్తి శక్తులను పెంచాలి. దానికి ఉత్పత్తి సంబంధాలు కూడా మారాలి. ఈ కీలక మార్పు ప్రభుత్వాలు తీసుకరావడమనేది చరిత్రలో ఇప్పుడు సాధ్యమయ్యేలా అగుపించడం లేదు. ఇది మహారాష్ట్ర రైతాంగం, అలాగే గుజరాత్ దళిత ఉద్యమం వేసిన బాట ఈ మధ్యకాలంలో జరిగిన ప్రజాస్వామ్య పరిణామంలో గణనకు తీసుకోవలసిన అంశం. ఉప ఎన్నికలలో పాలక పార్టీలను ఓడించడం ఒక ఎత్తైతే, మహారాష్ట్ర రైతాంగం చేపట్టిన ఉద్యమం మరో ఎత్తు. రైతాంగం తమ సమస్యల పరిష్కారానికి తామే చర్యకు దిగారు. అయితే మొత్తం అభివృద్ధి నమూనాను ప్రశ్నించి, ప్రత్యామ్నాయ అభివృద్ధి గురించి ఇంకో రైతాంగ చైతన్యంతో స్పష్టంగా వచ్చేదాకా రైతాంగ సంక్షోభం అనివార్యంగా భావించవలసి ఉంటుంది.

ప్రపంచ రికార్డు!

అవి బంధాలు కావు
కాలం గడుస్తుంటే బలోపేతమవడానికి
ఒట్టి ఒప్పందాలు! / అవసరం తీరాక
ఎవరో ఒకరు పుటుక్కున తెంచేస్తారు!
ఇద్దరివీ గ్లిజరిన్ కన్నీళ్ళే
ప్రజల దుఃఖానికి అవి ప్రతీకలు కావు
పదవీ లాలస ఆడే / చదరంగపు ఎత్తుగడ!
బ్రేకింగ్ న్యూస్తో / టీవీ ఛానల్లు రక్తి కట్టిస్తాయి!
ఆశలు పెంచుకున్న జన సమూహం
నిలువునా రెండుగా చీలి
జెండాలతో రోడ్డునెక్కుతారు!
వింత వింత వాదనలతో
మన దృష్టిని మరలుస్తారు!
ఎవరికీ ఏమి కానప్పుడు
ఈ దేశం ఎటుపోయినా
ఎవరికీ ఇసుమంత బాధ ఉండదు!
ఏడు దశాబ్దాలుగా ఇదే తంతు
ఏయ్! గిన్నీసోడా రాసుకో
పవర్ పాలిటిక్స్‌లో మాదే ప్రపంచ రికార్డు!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి

భావి జీవితానికి పునాది

ఆంగ్ల మాధ్యమం మోజు
మార్కులు, గ్రేడులకై పరుగు
పిల్లల సామర్థ్యాన్ని గాలికొదిలేసి
తమ డబ్బును, జీవితాన్ని పణంగా పెట్టి
కన్నవారే స్వేచ్ఛా విహంగాలను
కార్పొరేటు పంజరంలో బందీ చేస్తున్నారు
ఆటపాటలకు దూరమై
ఆత్మీయుల ప్రేమాప్యాయతలు కరువై
తీరిక లేని ఒత్తిడితో / మానసికోల్లాసం కరువై
మానవ సంబంధాల లేమితో
పరీక్షలో మార్కులకై నిరంతరం శ్రమిస్తూ
జీవిత పరీక్షలో విఫలమౌతున్నారు
కార్పొరేటు అంగడిలో / బలిపశువులవుతున్నారు
కొత్తలు (డబ్బులు) పెట్టి కొరివి పెట్టిచ్చుకున్నట్టు
ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు
ఫీజులు నియంత్రించి
విద్యావ్యవస్థను ప్రక్షాళన
చేయాల్సిన బాధ్యత పాలకులదే
చదువు భావి జీవితానికి పునాది కావాలి గాని
చదువే జీవితం కాకూడదని గ్రహించండి.

- గుండు కరుణాకర్



నేడు ‘పొయిట్రీ డే’

మానవ జీవన స్రవంతికి ప్రతిఫలనంగా నిలుస్తున్న పొయిట్రీ శతాబ్దాల నుంచి విభిన్న సంస్కృతులకు వారధిగా ఉంటోంది. మానవ మనసులోని సృజనాత్మకతకు పట్టం కట్టే ఉద్దేశంతో మార్చి 21వ తేదీని ఐక్యరాజ్య సమితి ‘అంతర్జాతీయ పొయిట్రీ డే’గా ప్రకటించింది. 1999 పారిస్‌లో జరిగిన యునెస్కో 30వ సమావేశంలో ఈ మేరకు తీర్మానించింది. ఈ సందర్భంగా కొన్ని కవితల నీరాజనం....

గోగుపూలు

శిశిరంలో ఆకులు / రాల్చుకున్న చెట్టులా
రైతులు ఎవుసంపై / అధినాయకుల వాగ్దానాల
ఆశల్ని రాల్చుకొని..
వసంతంల / గోగుపూలు పూసినట్టు
పాదయాత్రలతో / పాదాలను తొవ్వల
ఎర్రని పూరేకులై పూయించిర్రు.
మాటలకు వశీకరణ లేహ్యం
పూసుకున్న ఆసనాలు / హామీల ’సూత్రా’లనిచ్చి
పదవీ గట్టుదాటినంక / చేతులు దులుపుకొని
’క్యా కరేతో కర్లో’ అంటున్నయి.
కర్షకుడి కంట్లో / కంటతడి కనవడకముందే
భూమిపుత్రుని మూడోకంటి/భృకుటి ధనువులు
ముడిపడి భస్మీపటలమవకముందే
కంటకులు కండ్లు తెరవాలి కదా !
జరంత యిప్పటికైన
తెరిచివున్న సిన్నమెదడును మూసి
పెద్దమెదడుకు పనిచెప్పకపోతే
హాలికుల పిడికిళ్ళు దారంతా
గిట్లనే ఉద్యమ పూలై పూత్తయ్ !!

- అశోక్ అవారి

పండగ

కళ్ళు పొడుచుకునే కటిక చీకటికి
కూసింత కాంతిరేఖ ప్రసరిస్తే పండగ
నోళ్ళు వెళ్ళబెట్టిన బీళ్ళకి
ఓ వర్షపు చుక్క తగిలితే పండగ
ఆకలేసిన పసిపాప నోటికి పాలందితే
పండగ
ఎండిన మోడుకి చిన్న చిగురొస్తే
పండగ
రణగొణ ధ్వనికి చిన్న విరామమొస్తే
పండగ
వరదవస్తే ఏటికి, పాటవస్తే నోటికి
పండగ
మనం జనమై, జనం ప్రభంజనమై
పాలితులంతా పాలకులై, సమత
మమత నిలిస్తే...
అది - అచ్చమైన స్వచ్ఛమైన
ప్రజాస్వామ్య పండగ!
ప్రజా‘‘సామాన్యానికి’’ అసలు సిసలు
పండగ

- రమాప్రసాద్ ఆదిభట్ల
డైరెక్టర్, డిడియు కేశల్ కేంద్రం

ప్రజా మనిషి

ఆకాశంలో మబ్బుల సంపులన్నీ
మరో లోకంలో జీవనరాగాలు
తనయెదలో సొదలు సుధలు
విన్పించే ప్రేమగుణం
తేనెపలుకులు
అప్పుడు చీకటి ఊడలను
ఖండించే వెన్నెల వెలుగుగా ప్రవాహించే
ఆకు ఆకుల్లో పచ్చని ఆశారాగమై
ఆహ్లాదమై ఆహ్వానించే ఆత్మీయావరణం
ఈ దారి వైపు గరికపై నిల్చే
నిమిషం నిమిషం రాగచెట్లన్ని
చలించిపోయినాయి
మహామనిషి ఉన్నంత వరకు
ఆచరణ దిశపై
సామాన్యునిపై ఆదరణమెంత
పదిమంది మన కోసం నిలవాలి
మనం వాళ్ల కోసం ఎంతటి త్యాగానికైనా
సిద్ధపడిన రోజే ప్రజామనిషి నిజంగా

- డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు

పదం

సంతోష సూత్రం (హ్యాపీనెస్ ఫార్ములా) :
ఎస్ + సి + వి = హెచ్.

ఇక్కడ 'హెచ్' అంటే ఆనందంలో మన స్థాయి, 'ఎస్' అంటే సహజంగా, జన్యుపరంగా మనలో ఉన్న ఆనందించే శక్తి, 'సి' అంటే మన జీవన పరిస్థితులు, మన జీవితంలో ఎదురైన సంఘటనలు, 'వి' అంటే మనం మనకు చేసుకునే మంచీ, చెడూ.., అంటే ఇవి మన నియంత్రణలోనే ఉంటాయి. ఈ సూత్రాన్ని మార్టిన్ సెలిగ్మాన్ అనే అమెరికన్ మనస్తత్వ నిపుణుడు ప్రతిపాదించారు. మన జన్యువులు, పరిస్థితులు, మనకి మనం చేసుకునే మంచీ, చెడూ మన ఆనందాన్ని నిర్ణయిస్తాయన్నది ఈ సూత్రంలోని పరమార్థం. మన ఆనందంలో సగానికి సగాన్ని మన జన్యుకారణాలే నిర్ణయిస్తాయిట, పరిస్థితులు పదిశాతం వరకు కారణమవుతాయి. మిగిలినదంతా మన చేతుల్లోనే ఉంది. అంటే సంతోషమైనా, దుఃఖమైనా మన చేతుల్లోనే ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి.

ఆనం'దగ్ధం'

నల్లపూసైన భారతీయుల సంతోషం



ఆనందం అంటే ఏమిటి, అది ఎక్కడ, ఎలా దొరుకుతుంది? ఇంతకన్నా దారుణమైన ప్రశ్న మరొకటి ఉండదేమో?! ఇలా ప్రశ్నిస్తున్నామంటే, మనమే నరకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయినట్టు! కానీ ఇవాళ భారతీయుల పరిస్థితి ఇంచుమించు ఇలాగే ఉంది. భారతీయులు ఆనందంగా లేరు, ప్రపంచ ఆనంద సూచికలో మన స్థానం నిరుటి కన్నా కిందికి జారిపోయింది. ఆనందంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) దేశాల్లో పొరుగునే ఉన్న రెండు దేశాల కన్నా మనం దిగువనే ఉన్నాం.

ప్రపంచదేశాల ప్రజలు ఎంత మేరకు ఆనందంగా ఉన్నారన్న విషయంపై ఐక్యరాజ్యసమితి ఏటా ఒక నివేదిక తయారు చేస్తుంది. ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి 156 దేశాల్లో సర్వే నిర్వహించి, 'ప్రపంచ ఆనంద సూచిక 2018'ని తాజాగా విడుదల చేసింది. ఆనందంలో భారతీయుల పరిస్థితి 2016 కన్నా 2017లో నాలుగు స్థానాలు దిగజారితే, ఈ ఏడాది ఇది మరీ దారుణంగా మరో 11 స్థానాలు కిందికి దిగజారింది. జాతీయ గరిష్ట ఆదాయం, సామాజిక మద్దతు, ఆరోగ్యకరమైన జీవితం, కనీస ఆయుర్దాయం పెరుగుదల, సామాజిక స్వేచ్ఛ, అవినీతి రహిత సమాజం, దాతృత్వం వంటి అంశాల ప్రాతిపదికన ప్రజల ఆనందాన్ని అంచనా వేస్తారు. అంతర్యుద్ధంతో అతలాకుతలమైన అఫ్గానిస్తాన్‌తో పాటు, ఇతర సార్క్ దేశాలన్నింటికన్నా ప్రపంచ ఆనంద సూచిక 2018లో భారత్ స్థానం దిగువనే ఉంది. 'జీవితావకాశాల్ని ఎంచుకోవడంలో స్వేచ్ఛ', 'దాతృత్వం' వంటి అంశాల్లో భారత్ సామర్థ్యం నానాటికీ తీసికట్టుగా ఉందని నివేదిక చెబుతోంది. ఈ నివేదిక ప్రకారం భారతీయులు ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళి పోతున్నట్టు తేలింది.

ప్రపంచంలో అత్యధిక స్థాయిలో ఆనందంగా ఉన్న దేశం ఫిన్లాండ్. ఇది నిరుటి కన్నా నాలుగు స్థానాలు పైకి ఎగబాకినట్టు నివేదిక తెలిపింది. ప్రపంచ ఆనంద సూచికలో ఇంతవరకు నార్వేనే మొట్టమొదటి స్థానంలో ఉండేది. అత్యుత్తమ విద్యావకాశాలు, ఉచిత ఆరోగ్య వసతుల కల్పన వంటి సదుపాయాలతో ఫిన్లాండ్ ఈ విజయాన్ని సాధించింది. నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, కెనడా, న్యూజిల్యాండ్, స్వీడెన్, ఆస్ట్రేలియాలు ప్రపంచ ఆనంద నివేదికలో మొదటి పది స్థానాల్ని ఆక్రమించాయి. అగ్రరాజ్యాలుగా చెప్పుకుంటున్న అమెరికా 18 వ స్థానంలోను, బ్రిటన్ 19 వ స్థానంలోను ఉన్నాయి. 'తీవ్రమైన అసమానత, అపనమ్మకం, ప్రభుత్వం మీద విశ్వాసం సన్నగిల్లడం వంటివి అమెరికా ఆనందం సన్నగిల్లడానికి కారణాలని ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి సమాఖ్య అధినేత జెఫ్రీ షాస్ చెప్పారు. ఈ నివేదికలో దక్షిణాఫ్రికా దేశాలైన మధ్య ఆఫ్రికా, బురుండి, దక్షిణ సూడాన్, టాంజానియా, ఎమెన్‌లు అత్యంత దిగువ స్థానాల్లో ఉన్నాయి. ఈ దేశాల్లో ప్రజాజీవనం అత్యంత భయానకంగాను, అమానుషంగాను ఉందని నివేదిక అభిప్రాయ పడింది.

స్థూల జాతీయ ఆనంద సూచిక

ముంబయి విమానాశ్రయంలో భూటాన్ రాజు జిగ్మె సింగ్యే వాంగ్‌ఛుక్ 'ఫైనాన్షియల్ టైమ్స్' అనే పత్రికకు 1972లో ఒక ఇంటర్వ్యూ ఇస్తూ, 'స్థూల జాతీయోత్పత్తి కన్నా స్థూల ఆనంద సూచికే ప్రధానం' అని అన్నారు. ఆ మాట భూటాన్‌ను నడిపిస్తున్న తాత్విక చింతనకు అద్దం పడుతుంది. భూటాన్ రాజ్యాంగంలో సామాజికంగా ప్రజల ఆనందమే ప్రధాన లక్ష్యంగా నిర్వచించారు. ఐక్యరాజ్యసమితి 2011లో ఈ 'స్థూల జాతీయ ఆనంద సూచిక' అనే భావన నుంచి స్ఫూర్తి పొంది, ప్రజల ఆనందాన్ని 'ప్రాథమిక మానవ లక్ష్యంగా' ప్రకటిస్తూ ఒక తీర్మానం చేసింది. సుస్థిర సామాజిక, ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతీ పరిరక్షణ, సమర్థవంతమైన పరిపాలన అనే కీలకాంశాల ఆధారంగా స్థూల జాతీయ ఆనంద సూచికను గణిస్తుంది భూటాన్ ప్రభుత్వం. స్థూల జాతీయ ఆనంద సూచికను సరికొత్త ఆర్థిక సూత్రంగా అభివర్ణిస్తూ భూటాన్ ప్రధాని జిగ్మె థిన్లె, ఐక్యరాజ్యసమితి నాటి ప్రధాన కార్యదర్శి బాన్‌కీ మూన్ 2012లో ఒక అత్యున్నత సమావేశాన్ని నిర్వహించారు. అయితే ప్రపంచదేశాలన్నింటికీ

వీక్షణం

ఆదర్శంగా నిలిచిన ఈ స్థూల జాతీయ ఆనంద సూచిక అనే భావనను విమర్శించే వారు లేకపోలేదు. భూటాన్‌లో జరుగుతున్న అంతః కలహాలు, మానవ హక్కుల ఉల్లంఘన వంటి తీవ్ర సమస్యల నుంచి దృష్టి మళ్ళించేందుకే అక్కడి ప్రభుత్వం స్థూల జాతీయ ఆనంద సూచిక వంటి నిష్ఫలమైన ప్రచారాలకు పాల్పడుతోందన్నది విమర్శకుల అభిప్రాయం.

ప్రపంచంలో ఆనంద నిలయాలివి

ప్రపంచంలో డెన్మార్క్, కోస్టారికా, సింగపూర్ వంటి ప్రదేశాలన్నింటా ఒక ఏకరూపత ఉంది. ఆయా దేశాల్లో నివసించే ప్రజలంతా భద్రత, జీవన సాఫల్యతలకు సంబంధించిన కనీస అవగాహనతో జీవిస్తారు. ఎవరికి వారు తమ వ్యక్తిగత జీవితాల్లో స్వయంగా ఒత్తిడిని తగ్గించుకుంటూ, ఆనందాన్ని పెంచుకోవడానికి ప్రాధాన్యమిస్తారు. ఇది వారికి ఎలా సాధ్యమైంది?

డెన్మార్క్‌లో ప్రజల జీవనశైలిలో శారీరక శ్రమదే అగ్రస్థానం. వారు ఎంతటి ఒత్తిడిలోనైనా ఈత వంటి శారీరక శ్రమ అధికంగా ఉండే క్రీడల్లో నిమగ్నమవుతారు. ఆ దేశ ప్రభుత్వం ప్రజలకు విద్య, ఆరోగ్య సదుపాయం, ఆర్థిక భద్రతల్ని కల్పించడంలో పూర్తిస్థాయి నిజాయితీని కలిగి ఉంటుంది. అందువల్లే డెన్మార్క్ ప్రపంచ ఆనంద సూచికలో కొన్నేళ్ళుగా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది.

కోస్టారికాలో ఒక సగటు పౌరుని రోజువారీ జీవితం ఇలా ఉంటుంది, అతను రోజుకు ఆరుగంటలు స్నేహితులు, బంధువులతో గడుపుతాడు. పనిచేసే చోటుకు కాలినడకన వెళతాడు. ప్రతి రోజూ రోజుకు ఆరుసార్లు పండ్లు, కాయగూరల్ని ఆహారంగా స్వీకరిస్తాడు. తనకు నచ్చిన పనిని, నచ్చిన సహోద్యోగులతో వారానికి 40 గంటలు పనిచేస్తాడు. వారంలో కొన్ని గంటలు సామాజిక సేవలో గడుపుతాడు. వారాంతంలో ప్రార్థనా స్థలాల్ని సందర్శిస్తాడు. సాకర్, ఫుట్‌బాల్ వంటి ఇష్టమైన క్రీడల్ని కూడా ఆడుతాడు. ఇంతకన్నా ఆరోగ్యకరమైన, ఆనందకర మైన జీవితం అవసరమా?!

డెన్మార్క్‌లోని ఒక సగటు మహిళ బంధు, మిత్రులతో కలిసి ఇంటి పనులు, పిల్లల పెంపకం వంటి పనులను పంచుకుంటూ ఆనందంగా జీవిస్తోంది. ఆమెకు ముగ్గురు పిల్లలు. ఆమె వృత్తిరీత్యా సోషియాలజిస్టు. ప్రభుత్వం ఆమెకు, ఆమె కుటుంబానికి విద్య, ఆరోగ్య సదుపాయాల్ని ఉచితంగా అందజేస్తుంది. ఉద్యోగ విరమణ తరువాత కూడా ఆమెకు అవసరమైన ఆర్థిక సౌలభ్యాలు లభిస్తాయన్న నమ్మకం ఉంది. డెన్మార్క్‌లో ఆమె లాగానే ప్రజలందరూ కూడా తమకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందని నమ్ముతారు.

ఇక కోస్టారికా విషయానికి వస్తే, ఆ దేశం అగ్ని పర్వతాలతో నిండి ఉంటుంది. అందువల్ల పెద్ద పెద్ద భూ కమతాలు ఏర్పడే అవకాశమే లేదు. ఆ దేశవాసులు ఆర్థికంగా భూస్వాములు కారు. ఉన్న కొద్దిపాటి ఆస్తిపాస్తులతో వాళ్ళు తమకు అన్ని విధాలా అండగా నిలిచే అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. విద్య, రక్షిత తాగునీరు, సామాజిక భద్రత, గ్రామాల్లో ఉచిత వైద్య సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన లక్ష్యంగా ఈ అధ్యక్షుడు కృషి చేస్తారు. కోస్టారికాలో 1869లో ప్రాథమిక విద్యను ప్రతి విద్యార్థికి తప్పనిసరి చేస్తూ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ముఖ్యంగా బాలికలకు ప్రాథమిక విద్యను తప్పనిసరి చేశారు. తద్వారా 1930ల నాటికి లాటిన్ అమెరికా దేశాల్లో కోస్టారికా అత్యధిక అక్షరాస్యత కలిగిన దేశంగా ఎదిగింది. గ్రామాల్లో ఉచిత వైద్య సౌకర్యాన్ని కల్పిస్తూ 1961 నాటికి చట్టాన్ని తెచ్చింది. ఈ పట్టుదల నేటికీ కొంచెం కూడా సడల లేదు. కోస్టారికా ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఇక సింగపూర్, తదితర ప్రాంతాల విషయానికి వస్తే, అక్కడి ప్రజలు ఆర్థిక పురోగతి కోసం పట్టుదలతో శ్రమిస్తారు. తద్వారా జీవన సాఫల్యాన్ని అనుభూతిస్తారు. తాజాగా వెలువడిన ప్రపంచ ఆనంద సూచిక 2018 నివేదిక 'ప్రపంచ ఆనందంలో మూడు వంతులు ఆనందానికి ఆరు కారణాల్ని గుర్తించింది. స్థిరమైన ఆర్థిక ప్రగతి, ఆరోగ్యకరమైన జీవితం, ఆయుర్దాయం, సామాజిక సత్సంబంధాలు, దాతృత్వం, నమ్మకం, కోరుకున్నట్టుగా జీవించే స్వేచ్ఛ. ఇవన్నీ అలవోకగా లభించేవి కావు. ఒక దేశ ప్రభుత్వం, దాని సాంస్కృతిక, నైతిక విలువల మీద ఆధారపడే ఈ అంశాలన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ప్రజల ఆనందం కేవలం వ్యక్తిగతమైంది మాత్రమే కాదు, అది ప్రభుత్వ కార్యదీక్ష, సచ్ఛీలత మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.


– కల్కి

పథం

'నీ మాట, చేత,
ఆలోచనల మధ్య సమన్వయం
ఉన్నప్పుడు నువ్వు సంతోషంగా ఉంటావు'


– మహాత్మాగాంధీ

మెరుపు



గణన

దిగులు దారిలో భారత్



ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి సమాఖ్య అభిప్రాయం ప్రకారం సామాజిక పురోగతికి ప్రజల ఆనందమే సిసలైన కొలమానం.

తూణీరం

'సంపద, డబ్బు అనేవి సంతోషానికి ఎంతవరకు ముడిపడి ఉంటాయి, సామాజిక పురోగతి ప్రజల సంతోషాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది?' అన్న ప్రశ్నకు వాళ్ళు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ప్రజల శ్రేయస్సు, సామాజిక భద్రత, మౌలిక సదుపాయాల వంటి కీలక లక్ష్యాల వేదికగా 'ప్రపంచ ఆనంద సూచిక'ను అంచనా వేస్తారని అంటారు. ప్రజల ఆనందమే సామాజిక పురోగతికి కొలమానమన్న అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈ నివేదిక ప్రజల సామాజిక జీవితంలో ఆనందాన్ని ఎంత వరకు ప్రతిఫలిస్తుందో కొందరు మేధావులు, సామాజిక కార్యకర్తల మాటల్లోనే తెలుసుకుందాం.

మానవ సంబంధాలే అసలు సంపద!

అల్లం నారాయణ, తెలంగాణ ప్రెస్ అకాడమీ అధ్యక్షులు



సంపదకీ, డబ్బుకీ, ఆనందానికీ సంబంధం లేదు. కుటుంబ, సామాజిక, స్నేహ సంబంధాల్లాంటి మానవ సంబంధాల వల్లనే మనుషుల ఆనందంగా ఉంటారని శాస్త్రీయంగా వెల్లడైంది. డబ్బుతో సౌకర్యాల్ని కొనగలం. అవసరాలు తీరేంత వరకు డబ్బు అవసరమే. కానీ అవసరాలకు మించిన డబ్బు అనర్థదాయకం. మితిమీరిన సంపద సంతోష హేతువు కాదు. సంపద కంటే సామాజిక, సామూహిక జీవనమే ఆనందానికి బాటలు పరుస్తుంది. సామాజిక పురోగతి, ఆర్థిక పురోగతి అనే రెండు విషయాల మధ్య సమతుల్యతను సాధించిన సమాజాల్లో ప్రజలు ఆనందంగా ఉంటారు. అయితే వెనుకబాటుకు గురైన సమాజాల్లో ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. దారిద్ర్యం వారి సంతోషాన్ని హరించి వేస్తోంది. అవసరాల్ని తీర్చేంత వరకే డబ్బు ప్రధానమైంది, ఆనందానికి మాత్రం సామూహిక జీవనమే సరైన దారి.

కొందరి సంతోషం అందరిదీ కాదు!

కె. సత్యవతి, 'భూమిక' సంపాదకురాలు, మహిళోద్యమ నేత



డబ్బు, సంతోషం అనేవి పరస్పరం ముడిపడిన విషయాలు కావు. సంతోషం అనేది శారీరకపరమైంది కాదు. అది మానసికమైంది. శరీరపరమైన సౌఖ్యాలకు అంతు లేదు. ఆ సౌఖ్యాలకు డబ్బు కావాలి. కానీ ఒక చెట్టును లేదా పువ్వును లేదా సముద్రాన్ని చూసి మనం సంతోషిస్తాం. దీని కోసం డబ్బును ఖర్చు పెట్టనక్కర్లేదు. సుఖంగా బతకడానికి డబ్బు కావాలంటారు, అందులో ఎంతమాత్రమూ నిజం లేదు. డబ్బుతో వచ్చే సంతోషంలో ఎంతటి నిజముందో సందేహాస్పదమే! భూటాన్ స్థూల జాతీయోత్పత్తి కంటే ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారన్నదానికి విలువనిస్తుంది. అందర్నీ సంతోషంగా ఉంచడమే నిజమైన సంతోషమా, లేక కొంతమందిని మాత్రమే సంతోష పెట్టడం నిజమైన సంతోషమా? ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టును తీసుకుంటే, నీళ్ళలో సంతోషం ఉండవచ్చు, కానీ అందుకోసం నిర్వాసితులవుతున్న వారికి అది ఎంత మాత్రమూ సంతోషకరం కాదు. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందితేనే సామాజిక పురోగతి సాధ్యమవుతుంది. మన అభివృద్ధి నమూనా విధ్వంసంతో ముడిపడింది. అది అందరికీ సంతోషాన్నివ్వదు.

డబ్బు పరిపూర్ణ సంతోషాన్నివ్వదు


ఆశాలత, మహిళారైతు హక్కుల వేదిక



సంతోషం విషయానికి వస్తే, అందర్నీ ఒకే గాటన కట్టలేం. ఈ విషయంలో పేదలు ఒక విధంగా స్పందిస్తే, డబ్బున్న వాళ్ళు మరో విధంగా స్పందించవచ్చు. అలాగే పురుషులు, అగ్రకులాల వారు ఒక రకంగా స్పందించవచ్చు. దేశంలో దాదాపు 75 శాతం మంది పేదలే ఉన్నారు. అణచివేతకు, పితృస్వామ్యానికి బలవుతున్న వాళ్ళు కూడా వీరిలో ఉన్నారు. ఇంతటి కష్టాల్లో ఉన్న ప్రజలకు డబ్బు ఒక మేరకు అవసరం, వాళ్ళకు అది సంతోషాన్నిస్తుంది. ఒక స్థాయికి వెళ్ళిన తరువాత గుర్తింపు, హోదా, రాజకీయ చైతన్యం వంటివి కూడా ఆనందకారణాలవుతాయి. డబ్బు పరిపూర్ణ సంతోషాన్నివ్వదు. మహిళా రైతులతో నేను పని చేస్తుంటాను. వాళ్ళు ఇంటా, బయటా ఎంతో శ్రమ చేస్తుంటారు. వారు సమాజానికి, కుటుంబానికి చేస్తున్న సేవలకు, వారి శ్రమకు గుర్తింపు కావాలి. సమాజంలో వారికి గౌరవం కావాలి. డబ్బు, హోదా, గుర్తింపు అన్నవి సంక్లిష్టమైనవి. ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి. ఉదాహరణకు దళితుల్లో బాగా చదువుకున్న వారు, డబ్బున్న వారు, పేద దళితులు సంతోషం విషయంలో ఒకే విధంగా స్పందించలేరు. సంఘటితమవడం, జీవితపు విలువలు తెలుసుకోవడం, సామాజిక చైతన్యాన్ని కలిగి ఉండడం, ఇవన్నీ కలిస్తేనే సామాజిక పురోగతి సాధ్యమవుతుంది.

భరోసానే సంతోషానికి నాంది

జి.లక్ష్మినరసయ్య, ప్రముఖ సాహిత్య విమర్శకులు



డబ్బు లేనిదే జీవితం అసాధ్యం. ప్రేమ లేని జీవితం అసమగ్రం. అయితే డబ్బు జీవితాన్ని సాధ్యం చేసినప్పటికీ, దాన్ని సంతోషంతో నింపగలదని చెప్పలేం. ప్రేమాభిమానాలూ, పరస్పర సంఘీభావాలూ మనుషుల్లో తీసుకొచ్చే మానసిక భరోసానే అసలైన సంతోషాన్ని ఇస్తుంది. కేవలం దేహ సంబంధమైన తృప్తే సంతోషం కాదు కాబట్టి, మానసిక శాంతి, భద్రత, భవిష్యత్తు పట్ల భరోసానే సంతోషానికి ఎక్కువ కారణం అయ్యే ఆస్కారం ఉంది. సామాజిక పురోగతి అంటే నా దృష్టిలో ప్రతి మనిషికీ చెందిన హుందాతనాన్నీ, సమాన హోదానీ, స్వతంత్రతనీ పరిరక్షించేది. ఇది లేకుండా ఎన్ని భౌతిక వసతులు కలిగినా అవసరాలు తీరవచ్చు, కానీ ఆనందం కలుగుతుందని మాత్రం చెప్పలేం. అలాగే మనిషికి ప్రాథమిక సౌకర్యాలు సమకూరడానికి డబ్బు కీలకమని మరువరాదు. ఖాళీ కడుపుతో ఎవరూ సంతోషంగా గడపలేరు. పొరుగు వాళ్ళనే కాదు, ప్రియమైన వాళ్ళను కూడా ఖాళీ కడుపుతో ప్రేమించలేరు.

ఇంటర్వ్యూలు: పసుపులేటి గీత

కిటికీ

'కొరత'లమానికం!

ప్రపంచ ప్రజల ఆనంద సూచిక 2018 నివేదిక ప్రకారం ఒక దేశంలో ప్రజలు ఆనందకరమైన జీవనాన్ని కొనసాగించడానికి ప్రాథమిక విద్య, ఉచిత ఆరోగ్య సౌకర్యం, రక్షిత తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల్ని కల్పించడంలో ప్రభుత్వం తప్పనిసరిగా సంతృప్తికరమైన రీతిలో పురోగతిని సాధించాల్సి ఉంటుంది. అయితే మన దేశంలో ఈ అంశాలకు సంబంధించిన కొన్ని నిజాలు ఇలా ఉన్నాయి.

భారతదేశంలో 2011 నాటికి ప్రీప్రైమరీ పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య 58 శాతంగాను, ప్రాథమిక పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య 93 శాతంగాను ఉంది. అయితే అధ్యయనాల ప్రకారం పదేళ్ళ వయసు కలిగిన గ్రామీణ విద్యార్థుల్లో సగానికి సగంమందికి కనీసం చదవడం కూడా రాదు. అరవై శాతం మంది విద్యార్థులకు కనీసం కూడికలు, తీసివేతలు కూడా తెలియవు. ఈ విద్యార్థుల్లో సగం మంది 14 ఏళ్ళ వయసు వచ్చేనాటికి చదువుకు స్వస్తి చెప్పేస్తున్నారు.



గ్రామీణ పాఠశాలల్లో ప్రతిరోజూ 25 శాతం మంది టీచర్లు విధులకు గైర్హాజరవుతున్నారు. కొన్ని అధ్యయనాల ప్రకారం ప్రాథమిక విద్యారంగంలో ప్రతి 35 మంది విద్యార్థులకు ఒక్క టీచరు మాత్రమే ఉన్నారు.

ఒకానొక అధ్యయనం ప్రకారం ప్రతి 188 ప్రభుత్వ పాఠశాలల్లో 59 శాతం పాఠశాలల్లో రక్షిత తాగునీటి సౌకర్యం లేదు, 89 శాతం పాఠశాలల్లో మరుగుదొడ్డి సౌకర్యం లేదు.

మనదేశంలో 2017 నాటికి 63.4 మిలియన్ల మంది గ్రామీణులకు రక్షిత తాగునీటి సౌకర్యం లేదు. వీరిలో ఎక్కువ మంది పంజాబ్, హర్యాణా, ఉత్తరాఖండ్‌కు చెందిన వాళ్ళే. రక్షిత తాగునీటి సౌకర్యానికి నోచని ఈ భారతీయ జనాభా ఎంత పెద్దదంటే, ఇది ఆస్ట్రేలియా, స్వీడెన్, బల్గేరియా, శ్రీలంకల జనాభా అంత పెద్దది.

భారతీయ ఆరోగ్యరంగంలో ప్రైవేటు సంస్థల వాటానే ఎక్కువగా ఉండడం వల్ల దేశంలోని గ్రామీణ పేదల ఆరోగ్య అవసరాలు సంతృప్తికరంగా తీరడం లేదు. భారతీయ జనాభా పాతికేళ్ళలో 2016 నాటికి 450 మిలియన్లు పెరిగింది. వీరిలో సగానికి సగం మంది పేదలే ఉన్నారు. దేశంలో వృద్ధుల శాతం కూడా పెరగడం వల్ల ఆరోగ్య సమస్యల భారంతో దేశం కునారిల్లుతోంది.

దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభాకు ఆరోగ్య సౌకర్యాలు, మందులు అరకొరగానే అందుతున్నాయి. ప్రజా ఆరోగ్యరంగంలో ప్రభుత్వ సంస్థలు చాలినంతగా లేకపోవడం వల్ల పేదల ఆరోగ్య అవసరాలు తీరడం లేదు.

తెలుగు తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

విధానాన్ని అధ్యయనం చేయడానికి వెళ్లి వచ్చిన అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడంపై రూపొందించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ''మాతృ భాష అయిన తెలుగును రక్షించుకోవడం, మన సంస్కృతిని కాపాడుకోవడం లక్ష్యంగా తెలంగాణలోని అన్ని విద్యాసంస్థల్లో తెలుగును సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇంగ్లీషు మీడియంలో చదవడం అందరికీ అనివార్యమవుతున్నది. పిల్లల భవిష్యత్తును కూడా దెబ్బతీయవద్దు. అదే క్రమంలో తెలుగు కనుమరుగు కావద్దు. అందుకే ఇంగ్లిష్ మీడియంలో చదివే విద్యార్థులు కూడా తెలుగు భాష నేర్చుకోవాలనే నిబంధన పెడుతున్నాం. మొదట ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని భావించాం. అయితే ఇంటర్మీడియట్ విద్యాసంస్థల్లో ఒకే మాదిరిగా లేదు. ఇంటర్మీడియట్ లో తెలుగును అమలు చేయడం కాస్త ఇబ్బందిగా మారుతుంది. తమిళనాడు, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో మాతృ భాష బోధన అమలును పరిశీలించిన అనంతరం మొదటి దశలో పదవ తరగతి వరకు తెలంగాణలో తెలుగును తప్పనిసరిగా సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం'' అని పేర్కొన్నారు. తరగతుల వారీగా తెలుగులో బోధించాల్సిన అంశాలకు సంబంధించి సిలబస్ రూపొందించాల్సిందిగా తెలుగు యూనివర్సిటీ, సాహిత్య అకాడమీలను ముఖ్యమంత్రి కోరారు. భాషను కాపాడుకోవడంతో పాటు, మాత భాష ద్వారా జీవితంలో ఉపయోగపడే విషయాలను విద్యార్థులకు బోధించాలని చెప్పారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశ భక్తిని పెంచే అంశాలుండాలని వివరించారు. తెలుగు చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండడం కోసం అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రైవేటు పాఠశాలల్లో కూడా తప్పని సరిగా ఒక తెలుగు పండిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కేటీఆర్, జూపల్లి కష్ణారావు, పద్మారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్ ఆచార్య, సాంస్క తిక శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యా డైరెక్టర్ జి.కిషన్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహరెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.వి.సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఎస్.ఇ.ఆర్.టి. అధికారి సువర్ణ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమ్మ భర్త కన్నుమూత



(మొదటిపేజీ తరువాయి)

ఇన్ఫెక్షన్ చేరడంతో ఈ నెల 16వ తేదీన ఆయనను చెన్నైలోని గ్లెన్ ఈగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ హాస్పిటల్‌లో చేర్చారు. అప్పటి నుంచి ఆయన పరిస్థితి విషమంగానే ఉంది. సోమవారం అర్ధరాత్రి 1.35 గంటలకు నటరాజన్ తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ షణ్ముగ ప్రియన్ అధికారికంగా ప్రకటించారు. నాలుగు రోజుల పాటు ఆయన వెంటిలేటర్ మీదే చికిత్స పొందారన్నారు. గత సంవత్సరం అక్టోబరు నెలలో నటరాజన్ ప్రాణాలు కాపాడేందుకు ఆయనకు రెండు అవయవాలు మార్చారు. పూర్తిగా కోలుకున్న తర్వాతే ఆసుపత్రి నుంచి పంపారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో నటరాజన్‌ను చూసేందుకు శశికళ పెరోల్‌పై వచ్చారు. అవయవ మార్పిడి కంటే ముందు నటరాజన్‌కు మూత్రపిండాలు, కాలేయం కూడా బాగా దెబ్బతిన్నాయి.. ఊపిరితిత్తులలో నిమ్ముచేరి శ్వాస తీసుకోవడం కష్టమైంది. దాంతో గత సంవత్సరం అక్టోబరు నెలలో ట్రెకియాస్టమీ చేసి, వెంటిలేటర్ మీద ఉంచి పంపారు.

పీఆర్వోగా పనిచేసి..

మరుదప్ప నటరాజన్ తొలుత తమిళనాడు ప్రభుత్వంలో పౌర సంబంధాల అధికారిగా (పీఆర్వో) పనిచేసేవారు. ఆ ఉద్యోగంలో ఆయన 33 ఏళ్ల పాటు ఉన్నారు. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు శశికళను ఆయనే పరిచయం చేశారు. శశికళను, ఆమె చెల్లెలి కొడుకు దినకరన్‌ను, నటరాజన్‌ను కూడా ఒక సమయంలో జయలలిత పోయెస్ గార్డెన్స్ నుంచి బయటకు పంపేశారు. తర్వాత మళ్లీ చెంతకు చేర్చుకున్నారు. గత సంవత్సరం శశికళ తన భర్త నటరాజన్ పేరును తన పేరు పక్కన తీసేసి.. తన పుట్టింటి పేరైన వీకేను చేర్చుకున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా నియామకం జరగగానే ఆమె ఈ పని చేశారు.

శశికళకు 15 రోజుల పెరోల్ మంజూరు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం బెంగళూరులోని పరప్పణ అగ్రహార జైల్లో ఉన్న వీకే శశికళ.. భర్త మృతితో కన్నీరుమున్నీరయ్యారు. ఆయన అంత్యక్రియల కోసం 15 రోజుల పెరోల్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. దాంతో అధికారులు పెరోల్ మంజూరు చేయడంతో శశికళ తంజావూరుకు రోడ్డు మార్గంలో చేరుకున్నారు.

అయితే.. ఈ సందర్భంగా అధికారులు పలు షరతులు విధించారు. ఈ పక్షం రోజులు తంజావూరులోనే ఉండాలని, చెన్నై వెళ్లకూడదని షరతు విధించారు. కేవలం వ్యక్తిగత పనుల కోసమే ఈ అవకాశాన్ని వాడుకోవాలని, రాజకీయ కార్యక్రమాలకు గాని, వ్యవహారాల జోలికి కానీ వెళ్లకూడదని సూచించారు.


పీజీ సీట్లు 50:50

(మొదటిపేజీ తరువాయి)

రెండు జీవోలు జారీ చేసింది. జాతీయ పూల్‌లో 50 శాతం సీట్లు పోను, మిగతా 50 శాతం సీట్లు స్థానికులకే ఉంటాయి. అలాగే..గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేసిన వారికి సంబంధించి వెయిటేజీ మార్కుల మీద కూడా ప్రభుత్వం ఒక స్పష్టతనిచ్చింది. ఈ మేరకు జీవో 21, జీవో 22లను తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసింది. జీవో 21 ప్రకారం పీజీ సీట్లలో ఇన్ సర్వీస్ అభ్యర్థులు రూరల్ లేదా ట్రైబల్ ఏరియాల్లో పని చేస్తున్న వాళ్లకి సర్వీస్ రిజర్వేషన్లకు (రాజ్యాంగ రిజర్వేషన్లు యథావిధిగా ఉంటాయి) బదులుగా నీట్‌లో వచ్చిన మార్కులకు అదనంగా వెయిటేజీ మార్కులను కలుపుతారు. ట్రైబల్ ఏజెన్సీ లేదా ఏరియాల్లో మూడేళ్లు లేదా అంతకు మించి పని చేసిన అభ్యర్థులకు నీట్ ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులకు అదనంగా 30 శాతం మార్కులను కలుపుతారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు లేదా అంతకుమించి పని చేసిన అభ్యర్థులకు నీట్ ప్రవేశ పరీక్ష లో వచ్చిన మార్కులకు అదనంగా 24శాతం మార్కులను కలుపుతారు. ఇదిలా ఉండగా, ఇంతకుముందు సర్వీస్ అభ్యర్థులకు డిప్లొమా చేసిన సబ్జెక్టులోనే తప్పనిసరిగా పీజీ చేయాలనే నిబంధనను తొలగించారు.

జీవో 22 ప్రకారం 50 శాతం సీట్లు నీట్ పరీక్షల్లో భాగంగా నేషనల్ పూల్‌కి వెళుతుండగా.. మిగతా 50 శాతం సీట్లను స్థానిక కోటాగా పరిగణిస్తారు. ఎంసీఐ నిబంధనలకు అనుగుణంగానే పీజీ సీట్ల భర్తీ జరుగుతుందని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

నాపై కేంద్రం వ్యూహాత్మక దాడి



కొందరిని సిద్ధం చేసి నాపైకి పంపుతోంది
ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు
రాజకీయ జీవితంలో ఇది మూడో సంక్షోభం
గతంలో ఆగస్టు సంక్షోభం చూశా.. నెగ్గా
రాష్ట్ర విభజన నేనెదుర్కొన్న మరో సంక్షోభం
కేంద్రం అప్పజెబితేనే పోలవరం పని చేపట్టాం
2029 కల్లా దేశంలో ఆంధ్రప్రదేశ్ టాప్
కల కంటున్నారు.. పవన్‌పై పరోక్ష చురకలు
అసెంబ్లీలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, మార్చి 20 (మనం ప్రతినిధి):

ప్రత్యేక హోదా అన్నది ఆంధ్రుల హక్కని, తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతీస్తే తగిన గుణపాఠం తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం అసెంబ్లీ రాష్ట్రంలో కొనసాగుతున్న పారిశ్రామికాభివృద్ధిపై మాట్లాడే సందర్భంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపైన, పరోక్షంగా పవన్ కల్యాణ్‌పైన విరుచుకుపడ్డారు. రాష్ట్రాభివృద్ధి కోసం తాను అహరహం శ్రమిస్తుంటే కేంద్ర ప్రభుత్వం తనపై కొందరిని దాడికి పంపిస్తోందన్నారు. ''ఆ ముగ్గురు కలిసి నన్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వంపై దాడి చేస్తామని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్యాయంగా ప్రవర్తిస్తోంది'' అని ఆయన ధ్వజమెత్తారు. జపాన్ తరహా ఆందోళన చేయడం ద్వారా హక్కులు సాధించుకుంటామని తెలిపారు. ఒక వైపు నిరసన ప్రకటిస్తూ మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ చాలా నష్టపోయే అవకాశం ఉందని, ప్రత్యేక హోదా ఇస్తే తప్ప న్యాయం జరగదని గుర్తించి పార్లమెంటులో వెంకయ్యానాయుడు, అరుణ్ జైట్లీ పట్టుబట్టి బిల్లు పెట్టించారని గుర్తుచేస్తూ... మరి, ఆ చట్టాన్ని ఎందుకు అమలు చేయరని చంద్రబాబు ప్రశ్నించారు. ''నా రాజకీయ జీవితంలో ఇప్పటివరకు మూడు సంక్షోభాలు చూశాను. ఆగస్టు సంక్షోభం తరువాత రాష్ట్ర విభజన మరో సంక్షోభం. ఇప్పుడు ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేయటం మరో సంక్షోభం. ఈ సంక్షోభాల నుంచి ఎలా గట్టెక్కాలో నాకు బాగా తెలుసు'' అని ముఖ్యమంత్రి అన్నారు.

కలలు కనొద్దు.. పవన్‌కు చురక

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా చురకలు వేశారు. ''రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వం కొందరిని ఉసిగొల్పుతోంది. కొందరితో దండయాత్ర చేయిస్తోంది. వాళ్లంతా నాపై తెలిసీ తెలియకుండా అపవాదులు వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తనంతట తాను తీసుకోలేదు. నీతి అయోగ్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రానికి అప్పగించింది. ఏడు ముంపు మండలాలను కలపకపోతే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం కూడా చేయనని చెప్పారు. దాంతో వాళ్లు అప్పటికప్పుడు ఆర్డినెన్సు తీసుకొచ్చారు. పాత కాంట్రాక్టర్‌కు గిట్టుటాటు కాక పోలవరం నిర్మాణాన్ని నిలుపుదల చేస్తే కేంద్ర మంత్రి అనుమతితో, చొరవతో నవయుగ సంస్థకు పాత ధరకే అప్పగించాం. ఇదేం తప్పు కాదు కదా.. వాస్తవాలు ఇలా ఉంటే పోలవరం ప్రాజెక్టులో నేను అవినీతికి పాల్పడినట్టు ప్రచారం చేయటం ఎంత వరకు ధర్మం? అవగాహన లేకుండా అపవాదులేస్తే ఎలా? కలలు రావచ్చు. పీడ కలలు మాత్రం రాకూడదు'' అంటూ ఆయన పరోక్షంగా పవన్‌ను విమర్శించారు. పోలవరం తెలుగువారి జీవనాడి అని.. ప్రత్యేక హోదా ప్రజల ఆకాంక్ష అని.. ఈ రెండింటినీ చేతులు అడ్డుపెట్టి పాడు చేయాలని చూస్తే చేతులు కాలిపోతాయని హెచ్చరించారు.

ఆ 39 మంది.. ఇక లేరు



మృతుల కుటుంబాలతో సుష్మ (ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యసభలో బాధాతప్త హృదయంతో ప్రకటించారు. భారతీయులు ఎక్కడ మరణించారో సరిగా తెలియకపోయినా మోసుల్‌కు ఆగ్నేయ దిశలోని బాదోష్ అనే చోట మృతదేహాలు లభ్యమయ్యాయని, డీఎన్‌ఏ పరీక్ష ద్వారా వారిని గుర్తించామని స్వరాజ్ చెప్పారు. తగిన ఆధారాల్లేకుండా ఏ ఒక్కరూ మరణించినట్లు తాను చెప్పబోనని ఇంతకుముందు అన్న విషయాన్ని గుర్తుచేసిన సుష్మ.. బరువెక్కిన హృదయంతో, పూర్తి ఆధారాలతో ఇప్పుడు మృతదేహాలను వారి సంబంధీకులకు అప్పగించి, కేసు క్లోజ్ చేసినట్లు తెలిపారు.

అలా చేస్తే పాపం

సరైన పరీక్షలు చేయకుండా ఎవరో ఒకరి మృతదేహాలను బంధువులకు ఇచ్చేస్తే అది పాపమని.. అందుకే డీఎన్‌ఏ పరీక్షలు పూర్తిచేసి సాక్ష్యాలు ఇచ్చేవరకు ఆగానని సుష్మా స్వరాజ్ చెప్పారు. ఎవరికీ తప్పుడు హామీలు ఇవ్వలేది, ఎవరినీ చీకట్లో ఉంచలేదని ఆమె అన్నారు. మృతులలో 27 మంది పంజాబ్‌కు, ఆరుగురు బిహార్‌కు చెందినవారు కాగా నలుగురు హిమాచల్ ప్రదేశ్, మరో ఇద్దరు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు. మొత్తం 39 మందిలో 38 మంది డీఎన్‌ఏ శాంపిళ్లు పూర్తిగా సరిపోయాయని, మిగిలిన ఒక్కరిది 70 శాతం సరిపోయిందని తెలిపారు. ఐసిస్ చెర నుంచి తప్పించుకుని వచ్చిన హర్జిత్ మాసి చెప్పిన విషయం తప్పని.. భారతీయులను ఉగ్రవాదులు కాల్చి చంపినట్లు అతడు చెప్పినా, ఇప్పుడలా జరగలేదని మంత్రి వివరించారు.

మృతదేహాలను అప్పగించనున్న వీకే సింగ్

విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకేసింగ్ స్వయంగా ఇరాక్ వెళ్లి మృతదేహాలను ప్రత్యేక విమానంలో తీసుకొస్తారని ఆమె తెలిపారు. తిరిగి వచ్చేటపుడు తొలుత అమతసర్‌లో ఆగి అక్కడ, తర్వాత హిమాచల్‌ప్రదేశ్, ఆ తర్వాత పట్నా, ఆపై కోల్‌కతా వెళ్లి అక్కడక్కడ వారి బంధువులకు మృతదేహాలను అప్పగిస్తారన్నారు. మంత్రి ఈ ప్రకటన చేయగానే.. చైర్మన్ వెంకయ్యానాయుడు ఇది చాలా దుర్వార్త అని చెప్పారు. అనంతరం మతులకు సంతాప సూచకంగా సభ్యులు కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. భారతీయులంతా సురక్షితంగా ఉంటారని ప్రభుత్వం గత సంవత్సరం చెప్పిందని ఈ సందర్భంగా రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ గుర్తుచేశారు. భారతీయుల మరణంపై ఆయన సంతాపం తెలిపారు.

లోక్‌సభలో గందరగోళం

లోక్‌సభలో మాత్రం ఈ అంశంపై సుష్మా స్వరాజ్ ఎలాంటి ప్రకటనా చేయలేకపోయారు. సభలో ముందు నుంచి తీవ్ర గందరగోళం నెలకొనడంతో.. సుష్మా స్వరాజ్ ఒక సీరియస్ అంశం గురించి ప్రకటన చేయబోతున్నారని, అందువల్ల సభ్యులు అదుపులో ఉండాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే కోరారు. ఈ సమయంలో సుష్మా ఏం మాట్లాడుతున్నారో వినపడనివ్వకుండా.. కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు 'నో.. నో' అంటూ నినాదాలు హోరెత్తించారు. ఇరాక్‌లో 39 మంది భారతీయుల దుర్మరణం గురించి ఆమె చెప్పాలనుకుంటున్నారని, మంత్రి చెప్పేది వినాలని స్పీకర్ కోరారు. కానీ సభలో గందరగోళ పరిస్థితి ఉండటంతో తాను ఇలాంటి సీరియస్ అంశం చెప్పలేనని సుష్మా స్వరాజ్ చేతులెత్తేశారు. తాను సభలో సాక్ష్యం ప్రవేశపెట్టాలనుకుంటున్నానని, దయచేసి తాను చెప్పేది వినాలని ఆమె కోరారు. కానీ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్షాల సభ్యులు ఆమె మాటలు వినిపించుకోకుండా తమ నినాదాలు కొనసాగించారు. రాజ్యసభలో తను ప్రకటన చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ ఎంతో సహనంతో విన్నారని, అంతా సంతాపం కూడా ప్రకటించారని, అదే లోక్‌సభలో కూడా జరుగుతుందని తాను భావించినా.. ఇక్కడ మాత్రం జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గందరగోళం సష్టించార ని, ఇది చాలా దురదష్టకరమని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ చాలా నీచ రాజకీయాలకు దిగజారిందని, బహుశా కాంగ్రెస్ అధ్యక్షుడే రాజ్యసభలో ఎలాంటి గందరగోళం ఎందుకు జరగలేదని భావించి సిందియాను లోక్‌సభలో నిరసనలకు నాయకత్వం వహించమని చెప్పి ఉంటారని, చావులతో కూడా వాళ్లు రాజకీయం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఆ తర్వాత.. సభ అదుపులో లేనందున ఇక ఎలాంటి కార్యకలాపాలు చేపట్టలేమంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను బుధవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.

నేనింకా నమ్మలేను

కొన్నేళ్లుగా తన సోదరుడు బతికే ఉండి ఉంటాడని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ చెబుతున్నారని.. ఇప్పుడు మళ్లీ ఆమె చెబితే తప్ప తన సోదరుడు మరణించిన విషయాన్ని తాను నమ్మలేనని పంజాబ్‌కు చెందిన గుర్‌పీందర్ కౌర్ అంటున్నారు. ఇరాక్‌లో మరణించిన 39 మందిలో ఆమె సోదరుడు మన్‌జీందర్ సింగ్ కూడా ఒకరు. తాను టీవీలలో విన్నానని, కానీ మంత్రి లేదా ఆమె కార్యాలయం అధికారులు తనకు స్వయంగా ఫోన్ చేసి చెప్పేవరకు తాను ఈ విషయాన్ని నమ్మలేనని ఆమె వాపోయారు.

బతికింది ఒకే ఒక్కడు

ఇరాక్‌లో ఇస్లామిక్ స్టేట్ చెర నుంచి సజీవంగా తప్పించుకుని వచ్చిన ఏకైక వ్యక్తి... హర్‌జీత్ మాసి. అతడితో పాటు మరో 39 మంది భారతీయులను ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. మిగిలిన వాళ్లంతా మరణించినట్లు తాను ముందునుంచి చెబుతున్నానని హర్‌జీత్ అన్నారు. తాను నిజమే చెప్పానని పంజాబ్‌లోని గుర్‌దాస్‌పూర్ జిల్లా కాలా అఫ్ఘానా గ్రామంలో ఆయన తెలిపారు. తన కళ్ల ముందే మిగిలినవారందరినీ చంపేశారని.. అదే విషయం తాను ఇన్నేళ్లుగా చెబుతున్నానని అన్నారు. కానీ ప్రభుత్వం ఇంతకుముందు తన మాటలు నమ్మలేదన్నారు. ఒక రోజు తమను మోకాళ్ల మీద కూర్చోబెట్టి వరుసగా తుపాకులతో కాల్చేశారని, తనకు మాత్రం అదృష్టవశాత్తు తొడలో బుల్లెట్ తగిలి స్పృహతప్పి పడిపోయానని చెప్పారు. తనకు గాయమైందని ఉగ్రవాదులకు చెప్పి భారతదేశానికి తిరిగి వచ్చేశానని అన్నారు.

అసలేం జరిగింది...

ఇరాక్‌లో రెండో అతిపెద్ద నగరమైన మోసుల్‌లో 2014 సంవత్సరంలో 40 మంది భారతీయులతో పాటు కొంతమంది బంగ్లాదేశీలను ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. భారతీయుల్లో ఎక్కువ మంది పంజాబ్‌కు చెందినవారే. 40 మంది భారతీయుల్లో గుర్‌దాస్‌పూర్‌కు చెందిన హర్‌జీత్ మాసి మాత్రం ఎలాగోలా తప్పించుకుని వచ్చి.. మిగిలిన వారి హత్యాకాండను చూసినట్లు చెప్పారు. ఆయన కథనాన్ని ప్రభుత్వం కొట్టిపారేసింది. అవన్నీ కాకమ్మ కథలని అప్పట్లో సుష్మా చెప్పారు. బంగ్లాదేశ్‌కు చెందిన ముస్లింగా నకిలీపేరు చెప్పి అతడు ఐసిస్ బారి నుంచి తప్పించుకుని వచ్చాడన్నారు. భారతీయులను తొలుత ఒక వస్త్రాల మిల్లులో పెట్టినా, హర్‌జీత్ తప్పించుకున్నాక వారిని బాదోష్‌లోని జైలుకు తరలించారు. వారి కోసం తీవ్రంగా గాలించగా.. చివరకు బాదోష్‌లో సామూహిక సమాధులు కనిపించాయి. భూమి లోపలికి వెళ్లే రాడార్ సాయంతో అక్కడ మృతదేహాలున్నట్లు గుర్తించారు. వాటిని డీఎన్‌ఏ పరీక్షల కోసం బాగ్దాద్ పంపారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు మోసుల్ నగరాన్ని స్వాధీనంలోకి తీసుకున్నప్పుడు చాలామంది ఇరాకీలు ఆ నగరం విడిచి వెళ్లిపోయినా భారతీయులు, బంగ్లాదేశీలు మాత్రం అక్కడే ఉండిపోయారు. వారు ఒకరోజు భోజనం చేసి తిరిగి వస్తుండగా ఉగ్రవాదులు పట్టుకున్నారు. ఇస్లామిక్ స్టేట్ పతనం తర్వాత సహాయమంత్రి వీకే సింగ్ వెళ్లి అక్కడ ఇరాకీ అధికారుల సాయంతో 39 మృతదేహాలను గుర్తించారు. వెతికే సమయంలో సింగ్ ఒక చిన్న ఇంట్లో నేలమీద కూడా పడుకోవాల్సి వచ్చిందని చెబుతూ.. ఆయన సేవలను సుష్మా ప్రస్తుతించారు.

అవిశ్వాసం.. ఆలస్యం!

(మొదటిపేజీ తరువాయి)

మృతిపై విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటన చేద్దామన్నా సాధ్యపడలేదు. లోక్‌సభ తొలుత మధ్యాహ్నానికి వాయిదా పడి, తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ వాయిదా ప్రకటన చేశారు. మరోవైపు సభ అదుపులో లేనందున అవిశ్వాసం ప్రతిపాదిస్తూ విపక్షాలు సమర్పించిన తీర్మానాల పరిశీలన చేపట్టలేక పోతున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సభ తిరిగి మధ్యాహ్నం సమావేశమైనప్పుడు కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు. ఇక రాజ్యసభలో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. అయితే, అక్కడ సుష్మా స్వరాజ్ తనంతట తానే భారతీయుల మృతిపై ప్రకటన చేసిన సందర్భంగా సభ్యులందరూ సావధానంగా ఉండిపోయారు. ఆ తర్వాత సభ 30 నిమిషాలు వాయిదా పడి తిరిగి సమావేశమైంది. కార్యకలాపాలు సజావుగా సాగకపోవడానికి ప్రభుత్వమే కారణమంటూ ఆంధ్రా, తమిళ పార్టీలతోపాటు కాంగ్రెస్ కూడా మండిపడింది. బ్యాంకింగ్ మోసాలవంటి ముఖ్య మైన అంశాలపై సభలో చర్చకు వీలుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించడం లేదని ఆరోపించాయి. బ్యాంకింగ్ మోసాలు, బడ్జెట్, ఇతర అంశాలపై చర్చ కోసం సభను నడవ నివ్వాలని కాంగ్రెస్ సభాపక్ష నేత గులాంనబీ ఆజాద్ కోరారు. ఆజాద్ ప్రకటనకు వివిధ విపక్ష సభ్యులు సహకరించినా టీడీపీతోపాటు డీఎంకే, అన్నాడీఎంకే ఎంపీలు కూడా వెల్‌లోకి దూసుకెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కావేరీ నదీ జలాల యాజమాన్య బోర్డుల గురించి నినదించారు.


విపక్షాల సమావేశం

ఈ ప్రతిష్టంభన కొనసాగుతుండగానే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ, బీఎస్పీ, డీఎంకే, ఎన్‌సీపీ, సీపీఐ, సీపీఎం పక్షాల నేతలు విడిగా సమావేశమై సభను సజావుగా సాగనివ్వాలని నిర్ణయించారు. బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలు దోచుకోవడం, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కావేరీ జలాల బోర్డు ఏర్పాటు తదితర ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సి ఉందని ఆజాద్ అన్నారు. సభ సజావుగా సాగితేనే వీటిపై చర్చిస్తామని, గందరగోళానికి కారణం ప్రభుత్వ వైఖరేనని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

మేం రెడీ: ప్రభుత్వం

ఆజాద్ ఆరోపణలను కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఖండించారు. బ్యాంకింగ్ రంగంలో మోసాలుసహా అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. తొలిరోజు నుంచే తాము ఈ మాట చెబుతున్నామని సభా వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్ కూడా ప్రకటిం చారు. దీనిపై చైర్మన్ వెంకయ్యనాయుడు స్పంది స్తూ- తాను కూడా సభ ప్రారంభమైన తొలి రోజు నుంచే బ్యాంకింగ్ రంగంపై చర్చిస్తే బా గుంటుందని చెబుతున్నట్లు గుర్తుచేశారు. ఇందు కు ప్రభుత్వం కూడా అంగీకరించిందని, అయినప్పటికీ కార్యకలాపాలు నడవకపోవడానికి కారణ మేమిటో అంతుబట్టడంలేదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచిది కాదని సభ్య లకు నచ్చజెప్పారు. కానీ, ఎంతసేపటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను బుధవా రానికి వాయిదా వేశారు.

మళ్లీ తుపాకీ మోత



అమెరికా స్కూల్లో గాయపడ్డ ఇద్దరు విద్యార్థులు
దుండగ విద్యార్థిపై సెక్యూరిటీ ఆఫీసర్ కాల్పులు
వాస్తవ పరిస్థితిపై ఇంకా అందని పూర్తి సమాచారం

న్యూయార్క్, మార్చి 20:

అమెరికాలో నెల వ్యవధిలోనే మరోసారి తుపాకీ మోత మోగింది. మేరీలాండ్‌లోగల సెయిం ట్ మేరీ కౌంటీలోని 'గ్రేట్ మిల్స్ హైస్కూల్'లో మంగళవారం ఒక విద్యార్థి సహచరులపై కాల్పులకు పాల్పడగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పాఠశాల అధికారులు ధ్రువీకరించారు. ఈ దారుణాన్ని నిలువరించేందుకు సెక్యూరిటీ ఆఫీసర్ అతడిపై కాల్పులు జరపడంతో దుండగ విద్యార్థి గాయప డ్డాడని కౌంటీ షెరీఫ్ టిమోతీ కేమరన్ తెలిపారు. విద్యార్థి కాల్పులకు పాల్పడటానికి దారితీసిన కారణాలేమిటో తెలియరాలేదన్నారు. ఈ సంఘ టనతో ఆ ప్రాంగణాన్ని పోలీసులు దిగ్బంధించిన కారణంగా ప్రాణ నష్టం గురించి పూర్తి సమాచారం ఇంకా అందలేదు. విద్యార్థులందరూ తలుపులు బి గించుకుని తరగతి గదుల్లో బిక్కుబిక్కుమం టున్నారని మాత్రమే వార్తలందాయి. గతనెల 14న ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓ పాఠశాలలో కాల్పుల ఫలితంగా టీచర్లు, విద్యార్థులు మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. దీంతో తుపాకీ నియంత్రణపై దేశవ్యాప్తంగా చర్చ రేగిన నేపథ్యంలో తాజా కాల్పులు చోటు చేసుకోవడం గమనార్హం. కాగా, ఈ సంఘటనలో ఎందరు చనిపోయి ఉంటారన్న దానిపై సమాచారం లేదని షెరీఫ్ తెలిపినట్లు ఏబీసీ న్యూస్ చానల్ ఉటంకించింది. అయితే, పరిస్థితి అదుపులోనే ఉందని, పిల్లల తల్లిదండ్రులు స్కూలు ప్రాంతానికి వెళ్లవద్దని పోలీ సులు అప్రమత్తం చేశారు. మరోవైపు 'ఆల్కహాల్, పొగాకు, తుపాకులు, పేలుడు పదార్థాల నియంత్రణ సంస్థ' పరిశోధక బృందం రంగంలో దిగినట్లు ఏబీసీ చానెల్ పేర్కొంది. కాగా, తామంతా సహ విద్యార్థు లతో కలసి తరగతి గదుల్లో దాగి ఉన్నట్లు జొనాథన్ ఫ్రీస్ అనే విద్యార్థి సీఎన్‌ఎన్ చానెల్‌తో ఫోన్‌ద్వారా సంభాషిస్తూ తెలిపాడు. అయితే, తమకు కాల్పుల మోత వినిపించలేదని అతడు పేర్కొన్నాడు. ఇక పాఠశాలలో కాల్పుల సంఘటనపై విచారణను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు మేరీలాండ్ గవర్నర్ లారీ హోగాన్ తెలిపారు. విద్యార్థుతు, సమాచారమిచ్చినవారి భద్రత కోసం తాము ప్రార్థిస్తున్నామని తెలిపారు.

రక్తం ధారపోసేందుకు సిద్ధమే!

- అంగుళం భూమి కూడా వదులుకోం
- చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ హెచ్చరిక
- భారత్‌సహా పొరుగు దేశాలకు పరోక్ష హెచ్చరిక



బీజింగ్, మార్చి 20: తమ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు అవసరమైతే రక్తపు పోరుకైనా సిద్ధమేనని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ హెచ్చరించారు. తమ భూభాగంలో అంగుళం కూడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు. మంగళవారం ఆ దేశ పార్లమెంట్ సమావేశాల ముగింపు సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి జిన్‌పింగ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ సహా సరిహద్దు దేశాలకు పరోక్షంగా హెచ్చరిక లు చేశారు. ''చైనా అంగుళం భూమి కూడా వదులుకోదు. ఇది చైనా దేశం, ప్రజల బలమైన విశ్వాసం. మా దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ ప్రజల ఆకాంక్ష కూడా ఇదే. చైనాను విడగొట్టాలని ఎవరైనా ప్రయత్నం చేస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధమే. ప్రపంచ దేశాల్లో మా స్థానాన్ని తిరిగి పొందడం కోసం యుద్ధానికైనా వెనుకా డం'' అని జిన్‌పింగ్ అన్నారు. 'వన్ చైనా' సిద్ధాంతానికి చైనా కట్టుబడి ఉం టుందని, దేశాన్ని విడగొట్టాలని ఎవరైనా చూస్తే సహించబోమని హెచ్చరిం చారు. ''మన శత్రువులతో రక్తపాతం నిండిన ఘోరమైన యుద్ధానికి తీర్మానిం చుకున్నాం'' అని అన్నారు. జిన్‌పింగ్ వ్యాఖ్యలు ముఖ్యంగా తైవాన్, దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యంపై ఉద్దేశించి చేసినవి నిపుణులు పేర్కొంటున్నా.. భారత్‌కు కూడా వర్తిస్తాయని అంటున్నారు. చైనా, భారత్ మధ్య ఏళ్ల తరబడి సరిహద్దు వివాదాలు నడుస్తున్న విషయం తెలిసిందే. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తమ భూభాగంలోనివేనని చైనా ఆరోపణ. ఇదే కాకుండా తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రంపై కూడా అధికారం తమదేనని డ్రాగన్ దేశం వాదిస్తూ వస్తోంది. తైవాన్ దేశం కూడా చైనాలో భాగమేనని చెబుతోంది. తాజాగా ఈ వాదనలను జిన్‌పింగ్ తన ప్రసంగంలో మరోసారి పునరుద్ఘాటించారు. ''చైనాది విస్తరణ వాదం కాదు. కానీ.. మన జోలికి వచ్చి హెచ్చరికలు చేస్తే వారికి కూడా అవే హెచ్చరికలు వర్తిస్తాయి'' అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా సమృద్ధి కోసం సీపెక్ తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో జిన్‌పింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతేగాక.. అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రం పదవిలో కొనసాగే పరిమితిని ఎత్తేస్తూ చైనా చట్టంలో సవరణలు చేశారు. దీంతో జిన్‌పింగ్ అధ్యక్షుడిగా జీవితకాలం కొనసాగేందుకు మార్గం సుగమమైంది.



పర్మినెంట్ కోసం పట్టాలెక్కిన యువత!

- నియామకాలు చేపట్టాలంటూ ముంబైలో ఆందోళన
- నిలిచిపోయిన లోకల్ రైళ్లు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ముంబై, మార్చి 20: భారతీయ రైల్వేలో అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసుకున్న తమకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శిక్షణార్థులు ఆందోళనకు దిగారు. దా ఉదయం అంతా కార్యాలయాలకు, విద్యాసంస్థలకు వెళ్లే కీలకమైన సమయంలో దాదాపు 400 నుంచి 500మంది విద్యార్థులు రైళ్లను అడ్డుకున్నారు. నగరంలోని మతుంగ, దాదర్ స్టేషన్ల మధ్య సబర్బన్ సర్వీసులను అడ్డుకున్నారు. దాంతో లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు ఆందోళనకారులతో చర్చలకు దిగారు. అదే సమయంలో రైల్వే శాఖ మంత్రి పీయుష్ గోయల్ కూడా ఒక ప్రకటన చేశారు. అప్రెంటిస్ పూర్తి చేసుకన్న వారు ప్రస్తుతం కొనసాగుతున్న నియామక ప్రక్రియలో పాలు పంచుకోవచ్చునని, మార్చి 31 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని వెల్లడించారు. దాంతో అభ్యర్థులు తమ ఆందోళనను విరమించుకున్నారు. ఉదయం 10.35 గంటలకు ఆందోళన ముగియడంతో రైళ్లు యథావిధిగా నడిచాయి. వాస్తవానికి రైల్వేలో అప్రెంటిస్ పూర్తి చేసుకున్నవారికి నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. తాజాగా ఈ కోటాను 20 శాతానికి పెంచుతున్నామని పీయూష్ గోయల్ ప్రకటించారు. వాస్తవానికి.. అప్రెంటిస్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు 100 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రాథమిక విచారణ తర్వాతే అరెస్టు

- ప్రభుత్వ అధికారుల మీద అట్రాసిటీ కేసులపై సుప్రీం



న్యూఢిల్లీ, మార్చి 20: ప్రభుత్వ అధికారులపై అట్రాసిటీ ఆరోపణల విషయంలో ఫిర్యాదు అందిన వెంటనే వారిని అరెస్టు చేయడం ఇకపై కుదరదని మంగళవారం నాడు సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగమవుతున్న విషయాన్ని తాము గుర్తించినట్లు బెంచ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులపై ఆరోపణలు వస్తే.. ముందుగా ప్రాథమిక విచారణ జరిపి ఆరోపణలలో నిజముందని నిర్ధారణకు వచ్చాకే ముందడుగు వేయాలని పోలీసులకు సూచించింది. డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయి అధికారి ఈ ప్రాథమిక విచారణ నిర్వహించి సానుకూలంగా స్పందిస్తేనే ముందుకెళ్లాలని పేర్కొంది. దీంతోపాటు అరెస్టు చేయాలంటే నిబంధనల మేరకు సంబంధిత అధికార వర్గాల అనుమతి తప్పనిసరని సుప్రీం వెల్లడించింది. ఎస్సీఎస్టీలపై కొనసాగుతున్న వివక్షను రూపుమాపేందుకు ప్రభుత్వం ఈ యాక్ట్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే! ఈ చట్టం కింద అరెస్ట్ అయిన వారికి బెయిల్ ఇవ్వడం కుదరదు. అయితే, వాస్తవంలో ఈ యాక్ట్ దుర్వినియోగమవుతోందని, అమాయకులపై కేసు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారన్న వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టు ఈ వెసులుబాటు కల్పించింది.

నకిలీలకు చెక్ పెట్టే కొత్త వ్యవస్థ

- వచ్చే ఐదేళ్లలో అందుబాటులోకి
- ఐబీఎం పరిశోధక బృందం వెల్లడి



లాస్ వెగాస్, మార్చి 20: కరెన్సీ నోట్ల నుంచి ఆహార పదార్థాలదాకా అన్నింటా పేరుకుపోయిన కల్తీని అరికట్టేందుకు త్వరలో సరికొత్త విధానం అందుబాటులోకి రానుందని టెక్ దిగ్గజం ఐబీఎం పేర్కొంది. రాబోయే ఐదారేళ్లలో కల్తీని అడ్డుకునే ఇంక్ డాట్స్, బుల్లి కంప్యూటర్ వంటి క్రిప్టోగ్రాఫిక్ యాంకర్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. ఇసుక రేణువు కన్నా చిన్నగా ఉండే కంప్యూటర్‌ను గుర్తింపు చిహ్నంగా వాడడం ద్వారా నోట్లలో నకిలీలను వెంటనే గుర్తించవచ్చని వివరించింది. అదేవిధంగా ఆహార పదార్థాల ప్యాకింగ్‌లో ఈ ఇంక్ డాట్స్‌ను ఉపయోగిస్తే వాటికి నకిలీలను తయారుచేయడం సాధ్యంకాదని తెలిపింది. ఎంత అత్యాధునిక కంప్యూటర్ అయినా భవిష్యత్తులో రాబోయే క్వాంటమ్ కంప్యూటర్‌తో కూడా వీటికి నకిలీలను సృష్టించడం కుదరదని ఐబీఎం రీసెర్చ్ హెడ్ అర్వింద్ క్రిష్ణ తెలిపారు. కాగా, కొన్ని దేశాల్లో ఆహార పదార్థాలతో పాటు ప్రాణాంతక మందులకూ నకిలీలను తయారుచేస్తున్నారని క్రిష్ణ వివరించారు. సుమారు 70శాతం మందులకు నకిలీలు మార్కెట్లో ఉన్నాయని తెలిపారు. ఖరీదైన వస్తువులకు నకిలీలు సృష్టించే వీలుండదని చెబుతూ.. మరో ఐదేళ్లలో ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తుందని అర్వింద్ క్రిష్ణ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఐబీఎం నిపుణుల బృందం పరిశోధనలు చేస్తోందని వివరించారు.



ఎత్తుపల్లాల జీవితం

హిందీ వ్యతిరేకతతో కరుణకు సన్నిహితం.. చిన్న పోస్టింగ్ గొడవతో ద్రవిడ నేతకు దూరం

- జయలలితతో అనుకోకుండా పరిచయం
- పార్టీ.. ప్రభుత్వం.. రెండింటిలోనూ కీలకం
- నటరాజన్‌ను బలిగొన్న తీవ్ర అనారోగ్యం





చెన్నై, మార్చి 20: వీకే శశికళను నటరాజన్ పెళ్లి చేసుకోకపోయి ఉంటే.. ఎవరో ఒక రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి మరణించారని స్థానిక పత్రికలలో సింగిల్ కాలమ్ వార్తగా మిగిలిపోయేవారు. కానీ యుక్త వయసులో ఆయన తీసుకున్న నిర్ణయం.. ఒక ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా మెలిగే అవకాశం కల్పించింది. దేశవ్యాప్తంగా ఆయన పేరు మార్మోగిపోయేలా చేసింది. జయలలితకు తన భార్య శశికళ దగ్గరయ్యే కొద్దీ తాను కూడా తెరవెనుక కీలక పాత్ర పోషించడం మొదలుపెట్టాడు. కేవలం అన్నాడీఎంకేని నియంత్రించడమే కాక.. రాష్ట్ర పాలన యంత్రాంగాన్ని కూడా ఆడించసాగారు. ప్రభుత్వోద్యోగి కాకపోయి ఉంటే.. 1965 ప్రాంతంలో వచ్చిన హిందీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రముఖ ద్రవిడనేతగా ఎదిగే ఉండేవారు. తంజావూరులో విద్యార్థులను ఉద్యమానికి పురిగొల్పడమే కాక.. నాటి డీఎంకే యువనేత ఎల్.గణేశన్‌కు బాగా దగ్గరయ్యారు. ఆయనే శశికళ, నటరాజన్‌లకు పెళ్లి చేశారు. ఆ పెళ్లికి కరుణానిధి కూడా వచ్చారని గణేశన్ మీడియాకు చెప్పారు.

మాతృభాష తమిళంపై నటరాజన్‌కుగల అవ్యాజానురాగం ఫలితంగా హిందీ వ్యతిరేక ఉద్యమ సమయంలో కరుణానిధికి కూడా దగ్గరయ్యారు. తద్వారా 1970-71 ప్రాంతంలో ఏపీఆర్వో ఉద్యోగం వచ్చింది. చిన్న పోస్టింగ్ విషయమై గొడవ అయ్యేవరకూ కరుణతో సన్నిహితంగానే ఉండేవారు. అటుపైన 1980 తొలినాళ్లలో అన్నాడీఎంకే ప్రచార కార్యదర్శిగా ఉన్న జయలలిత కడలూరుకు వచ్చినపుడు చంద్రలేఖ ఆ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తుండేవారు. అక్కడే నటరాజన్ పీఆర్వోగా ఉండేవారు. జయలలిత రాక సందర్భంగా ఆ కార్యక్రమ వీడియో రికార్డింగ్ కాంట్రాక్టు శశికళకు దక్కింది. అప్పుడు తన భార్యను జయలలితకు పరిచయం చేశారు. తర్వాత కొన్నేళ్లలో ఆ దంపతులు జయలలితకు బాగా దగ్గరయ్యారు. పోయెస్ గార్డెన్స్‌లో చేరిపోయి.. జయలలిత జీవితంలో అనేక ఎత్తుపల్లాల సమయంలో ఆమె వెన్నంటి ఉన్నారు. ఎంజీఆర్ మరణం, అన్నాడీఎంకేలో చీలిక, 1989 ఎన్నికల్లో డీఎంకే విజయం.. తదితర పరిణామాలన్నిటిలోనూ వారు జయలలితతోనే ఉన్నారు. చివరకు 2016 డిసెంబరు 5న జయలలిత మరణం తర్వాత అప్పటివరకూ తెరవెనుకే ఉండిపోయిన నటరాజన్.. ఒక్కసారిగా తెరమీదకు వచ్చారు. జయలలితను రాజకీయంగా తీర్చిదిద్దింది తానేనని ప్రకటించుకున్నారు. ఒకానొక సమయంలో నటరాజన్ ఒక వెలుగు వెలుగుతారని అనుకున్నా.. నిరుడు సెప్టెంబరులో తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ఏనాడూ అన్నాడీఎంకే సభ్యుడైనా కాని నటరాజన్.. మూడుసార్లు పార్టీ నుంచి బహిష్కృతుడు కావడం విశేషం. ఆయనే లేకపోతే జయలలిత అన్నాళ్లు రాజకీయాలలో ఉండేవారా అనేది కూడా అనుమానమేనంటారు. ఒకానొక సమయంలో జయలలిత స్పీకర్‌కు రాసిన రాజీనామా లేఖను పోలీసులు నటరాజన్ ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. అంటే... దాన్ని ఆయన తొక్కిపెట్టి ఉంచారన్న మాట. జయ-జానకి వర్గాలను కలిపేందుకు నటరాజన్ కృషి చేసినప్పటికీ జయ మాత్రం ఎప్పుడు పార్టీ పగ్గాలను ఆయన చేజిక్కించుకుంటాడోనని అనుమానిస్తూ ఉండేవారని వాళ్ల సన్నిహితులు చెబుతారు.

తాను ప్రత్యక్షంగా రాజకీయాల్లో లేకపోయినా.. ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం లేని తన భార్య శశికళ ఏకంగా జయలలితకు నెచ్చెలి కావడం ఆయనకు కలిసొచ్చింది. తూర్పు మదురై, మరుంగపురి నియోజకవర్గాల అభ్యర్థులను కూడా ఆయనే ఎంపిక చేశారు. డీఎంకే ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయించడంలో ఢిల్లీలో తనకుగల పలుకుబడిని నటరాజన్ బాగానే ఉపయోగించినట్లు తెలుస్తోంది. కానీ, 1991లో అధికారంలోకి వచ్చిన జయలలిత.. కొన్నాళ్లకే నటరాజన్ దంపతులను పోయెస్ గార్డెన్స్ నుంచి వెలివేశారు. ఇలా ఆయన ప్రస్థానమంతా ఎత్తుపల్లాలతోనే సాగింది.

పుచ్చముక్కలతో నిరసన

- అసిస్టెంట్ ప్రొఫెసర్ నీచ వ్యాఖ్యలు
- తీవ్రంగా మండిపడిన విద్యార్థిలోకం
- పుచ్చముక్కల్లా శరీరాన్ని ప్రదర్శిస్తున్నారు
- ఇస్లాం మత నిబంధనలకు అది వ్యతిరేకం
- ముస్లిం కుటుంబాల వద్ద అధ్యాపకుడి వ్యాఖ్య
- నిరసన ప్రదర్శనలకు దిగిన విద్యార్థులు
- కేరళ ఫారూక్ ట్రైనింగ్ కాలేజిలో ఘటన





కోజికోడ్, మార్చి 20: ముస్లిం విద్యార్థినుల దుస్తుల విషయంలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ చేసిన లింగవివక్ష వ్యాఖ్యలపై విద్యార్థిలోకం మండిపడింది. ఫారూక్ ట్రైనింగ్ కాలేజిలో ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు తమ చేతుల్లో పుచ్చకాయ ముక్కలు పట్టుకుని సంస్థ ప్రధాన ద్వారం వద్దకు ప్రదర్శనగా వెళ్లారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జౌహర్ మునావీర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొన్ని ముస్లిం కుటుంబాలతో సమావేశమైన సందర్భంగా ఆయన దారుణమైన వ్యాఖ్యలు చేశారు. అమ్మాయిలు ఇస్లాం వ్యతిరేక దుస్తులు వేసుకుంటున్నారన్నారు. వాళ్లు తమ ముసుగు సరిగా ధరించడం లేదని, ఎద భాగాన్ని కావాలనే ప్రదర్శిస్తున్నారని అంటూ.. పుచ్చకాయలను ముక్కలు కోసి ఆకర్షణీయంగా బయటకు చూపించినట్లుగా వీళ్ల ప్రవర్తన ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాక.. పరదా వేసుకున్న తర్వాత కూడా కావాలని దాన్ని ఎత్తిపట్టుకుని తమ లెగ్గింగ్స్ చూపిస్తుంటారని ఆయన అన్నారు. క్యాంపస్‌లో ఉన్న మొత్తం విద్యార్థులలో 80% మంది అమ్మాయిలేనని, వాళ్లలో అత్యధికులు ముస్లింలేనని చెప్పారు. అమ్మాయిలు ముఫ్తా వేసుకోవట్లదని, కేవలం స్కార్ఫులతో తమ ముఖం కప్పుకొంటున్నారని అన్నారు. మహిళ ఎదభాగం పురుషులను ఆకర్షిస్తుందని.. దాన్ని తప్పనిసరిగా మూసేసేలా దుస్తులుండాలని ఇస్లాం మతం బోధిస్తుందని జౌహర్ వ్యాఖ్యలు చేశారు.

మండిపడ్డ విద్యార్థులు

జౌహర్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడిన విద్యార్థినీ విద్యార్థులు పుచ్చకాయ ముక్కలను చేతుల్లో పట్టుకుని 'పుచ్చకాయ ప్రదర్శన'కు దిగారు. కేఎస్‌యూ సంఘానికి చెందిన వారు కూడా విద్యార్థులకు పుచ్చముక్కలు పంచుతూ ఈ ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఏబీవీపీ కార్యకర్తలు తమవంతు నిరసనగా కాలేజి గేటు ముందు పుచ్చకాయలు పగులగొట్టారు. గత వారం విద్యార్థులు క్యాంపస్‌లో హోలీ ఆడుకున్న తర్వాతి నుంచి విద్యార్థులకు, సిబ్బందికి మధ్య గొడవలు అవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జౌహర్ దారుణమైన వ్యాఖ్యలు చేశారు. టీచర్లు తమ ముఖాలు చూసి పాఠాలు చెప్పాలి తప్ప తమ శరీరం చూసి కాదని కాలికట్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ చైర్‌పర్సన్ సుజా అన్నారు. అయితే.. జౌహర్ ఈ మాటలు మూడు నెలల క్రితం.. అది కూడా కాలేజి వెలుపల అన్నారు కాబట్టి అతడిపై ఎలాంటి చర్య తీసుకోలేకపోతున్నామని ఫారూక్ ట్రైనింగ్ కాలేజి ప్రిన్సిపాల్ సీపీ జవహర్ అన్నారు.

డ్రైవర్ లేని కారు ఢీకొని.. మహిళ మృతి




- ఫీనిక్స్ శివార్లలో ఘటన
- వెంటనే పరీక్షల నిలిపివేత
- పాదచారిని ఢీకొన్న ఉబెర్ ఎస్‌యూవీ

ఫీనిక్స్, మార్చి 20: డ్రైవర్ అసవరం లేకుండా జామ్మంటూ కారులో వెళ్లిపోవచ్చని చెప్పే 'డ్రైవర్‌లెస్' కారు.. తొలిసారిగా ఓ యాక్సిడెంట్ చేసింది. అందులో కాలినడకన వెళ్తున్న ఓ మహిళ తన ప్రాణాలు కోల్పోయింది. అమెరికాలోని ఫోనిక్స్ శివార్లలో జరిగిన ఈ ప్రమాదంతో.. సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల టెక్నాలజీపైనే అనుమానాలు తలెత్తాయి. ఉబెర్ ఎస్‌యూవీ వల్ల ఈ ప్రమాదం జరగడంతో వెంటనే ఫీనిక్స్, పిట్స్ బర్గ్, శాన్ ఫ్రాన్సిస్కో, టొరొంటో ప్రాంతాలలో జరుగుతున్న ఈ తరహా పరీక్షలను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ఉబెర్ ప్రకటించింది. కొన్ని నెలలుగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. డ్రైవర్లు అక్కర్లేకుండా రిమోట్‌గానే కార్లు నడిపించే ఈ పద్ధతిని ఉబెర్ లాంటి సర్వీసులే ముందుగా అందిపుచ్చుకోవాలని ప్రయత్నించాయి. వాస్తవానికి ఈ కారులో స్టీరింగ్ వెనుక ఒక బ్యాకప్ డ్రైవర్ కూడా ఉన్నాడు. అతడు నడుపుతున్న వోల్వో కారు.. క్రాస్‌వాక్ మీదుగా సైకిల్ నడిపించుకుని వెళ్తున్న 49 ఏళ్ల ఎలైన్ హెర్జ్‌బెర్గ్ అనే మహిళను ఢీకొంది. ఆమెను ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మరణించారు. ఆమె మృతిపట్ల ఉబెర్ సీఈవో దారా ఖొస్రావ్‌షాహి తన ట్విట్టర్ ఖాతా ద్వారా సంతాపం తెలిపారు. కేసు విచారణలో స్థానిక పోలీసులకు తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రతిపాదనలు చేసే జాతీయ రవాణా భద్రత బోర్డు, అలాగే జాతీయ రహదారి ట్రాఫిక్ భద్రతా యంత్రాంగం తమ మనుషులను కేసు విచారణకు పంపాయి. తప్పు ఎవరిదో ఇంకా నిర్ణయించలేదని.. పాదచారులు ఎప్పుడూ నడకకు క్రాస్‌వాక్‌నే వాడాలని స్థానిక పోలీసు సార్జంట్ రోనాల్ ఎల్‌కాక్ చెప్పారు. ప్రమాదం జరిగే సమయానికి ఉబెర్ వాహనం గంటకు 40 మైళ్ల వేగంతో వెళ్తోందని, హెర్జ్‌బెర్గ్ వీధిలోకి వచ్చిన వెంటనే ఆమెను ఢీకొందని తెలిపారు. లేజర్, రాడార్, కెమెరా సెన్సర్లతో పాటు అత్యాధునిక కంప్యూటర్ల సాయంతో నడిచే ఆటో మేటిక్ కార్ల వల్ల ఒక్క అమెరికాలోనే ఏడాదికి 40 వేలకు పైగా ట్రాఫిక్ మరణాలు తగ్గుతాయని అంచనా. ప్రమాదాలలో 94% మానవ తప్పిదాల వల్లే జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతు న్నాయి. ఆటోమేటిక్ కార్ల వల్ల డ్రైవర్లు తాగి నడిపే అవకాశం, నిద్రకు తూలే అవకాశం ఉండవ ని, అలాగే దృష్టి మరలే చాన్స్ కూడా ఉండదని చెబుతున్నా.. వాటిలోనూ కొన్ని లోపాలున్నాయి. 2016 సంవత్సరంలో మనుష లు నడిపే వాహనాలు ఢీకొని 6 వేల మంది పాదచారులు అమెరికా లో మరణించారు. డ్రైవర్‌లెస్ కార్లకు మిషిగన్, ఆరిజోనాలాంటి రాష్ట్రాలు సానుకూలంగా ఉండగా.. కాలిఫోర్నియా మాత్రం కాస్త కఠిన ఆంక్షలు పెడు తోంది. దాంతో ఆరిజోనా రోడ్లపై వందలాది ఆటోమేటెడ్ వాహనాలు ప్రస్తుతం తిరుగుతున్నాయి.

కాల్ సెంటర్ ఉద్యోగాలకు చేటు!

- అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు
- కంపెనీల ఔట్‌సోర్సింగ్ వద్దు
- అమెరికాలో ఉండాల్సిందే...
- ఓహియో సెనేటర్ ప్రతిపాదన
- భారత్‌సహా పలు దేశాలకు దెబ్బ



వాషింగ్టన్, మార్చి 20: భారత్‌లో కాల్ సెంటర్ ఉద్యోగాలకు గండి పడబోతోందా? అమెరికాకు సంబంధించిన కంపెనీలకు ఇక్కడి నుంచి ఇక ఔట్‌సోర్సింగ్ ఉండబోదా? మన దేశ యువతను కష్టాల్లో ముంచే ఈ ప్రశ్నలు నిజమేనా? అంటే కొంత వరకు నిజమే! అమెరికాకు చెందిన కాల్ సెంటర్ కంపెనీలు ఇకపై స్వదేశంలోనే ఉండాలంటూ ఓ కొత్త బిల్లు కాంగ్రెస్‌లో తెరపైకి వచ్చింది. దీనికి ఆమోదం లభిస్తే భారత కాల్ సెంటర్లపై పెద్ద దెబ్బ పడుతుం ది. ఆ బిల్లు ప్రకారం అమెరికా సంస్థలు కచ్చితంగా అక్కడే ఉండి తీరాలి. అంతేకాదు.. విదేశాల్లో పనిచేసే కాల్ సెంటర్ ఉద్యోగులు తమ లొకేషన్‌ను విధిగా చెప్పాల్సి ఉంటుంది. ఇక, అమెరికాలో ఉన్న సర్వీస్ ఏజెంట్‌తోనే నేరు గా మాట్లాడే వెసులుబాటు కల్పించేలా కాల్స్‌ను బదిలీ చేయాల్సి ఉంటుంది. ఓహియోకు చెందిన సెనేటర్ షెరోడ్ బ్రౌన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాల్ సెంటర్ ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ చేసే సంస్థల జాబితాను బహిరం గపరచాలని, వేరే దేశాలకు ఉద్యోగాలను మార్చని సంస్థలకే ఫెడరల్ కాంట్రా క్టు ఇవ్వాలని ఆ బిల్లులో పేర్కొన్నారు. అమెరికాలో ఉన్న కస్టమర్ కేర్ ఏజెంట్ తోనే మాట్లాడేలా కాల్స్‌ను ట్రాన్స్‌ఫర్ చేయడానికి బిల్లులో నిబంధనను పొందుపరిచారు. చాన్నాళ్లపాటు అమెరికా పన్ను, వాణిజ్య విధానాలు కార్పొరే ట్ వ్యాపారాలను ప్రోత్సహించాయని, ఓహియోలోని పలు సంస్థలు మూతప డడానికి అదే కారమణమైందని బ్రౌన్ అన్నారు. అమెరికన్ల మీద పన్ను భారం వేస్తూ కంపెనీలు మాత్రం రీనోసా, మెక్సికో, వుహాన్, చైనా, భారత్ వంటి ప్రాంతాలకు తరలివెళ్లిపోయాయని చెప్పారు. కాల్ సెంటర్ ఉద్యోగాల్లోనే అత్య.దికంగా అవుట్ సోర్సింగ్‌కు అవకాశం ఉంటుందని, అలాంటి చాలా కంపెనీలు ఓహియో నుంచి తమ సంస్థలను తరలించేశాయని పేర్కొన్నారు. ఇలా అవుట్ సోర్సింగ్ చేయించడం వల్ల అమెరికాలోని యువత ఉపాధి కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా వ్యాపారాల్లో వారి ఆలోచనలకు తావు లేకుం డా పోతోందని అన్నారు. కాబట్టి వారి భాగస్వామ్యానికి ఎప్పుడూ విలువనివ్వా లని, వారి భవిష్యత్తు బాగుపడాలంటే ఉద్యోగాలు వేరే దేశాలకు తరలిపోకుం డా ఉండాలని, అందుకే ఈ బిల్లు ప్రవేశపెడుతున్నామని బ్రౌన్ వ్యాఖ్యానించా రు. కాగా, ప్రస్తుతం అమెరికాకు చెందిన పలు కంపెనీలు తమ నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునేందుకు భారత్ వంటి దేశాలపైనే ఎక్కువగా ఆధార పడుతున్నాయి. ప్రపంచంలోనే కాల్‌సెంటర్ సేవలు అందిస్తున్న దేశాల్లో భారత్ టాప్‌లో ఉంది. రూ.1.82 లక్షల కోట్ల మేర రెవెన్యూ ఈ రంగం నుంచే వస్తోందని నాస్కామ్ వెల్లడించింది. ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే ఇకపై ఇక్కడి యువతకు ఈ ఉద్యోగాలు భారీగా తగ్గిపోవడంతో పాటు భారత్‌లో ఈ రంగంపై కూడా కోలుకోలేని దెబ్బపడుతుంది.

పెరియార్ విగ్రహం ధ్వంసం

- తమిళనాడులో దుండగుల దుశ్చర్య

పుదుకోట్టయ్, మార్చి 20: తమిళనాడులో మహనీయుల విగ్రహాల కూల్చివేత విష సంస్కృతి ఇంకా కొనసాగుతోంది. సాంఘిక సంస్కర్త, ద్రవిడ ఉద్యమ నాయకుడు, పెరియార్‌గా ప్రఖ్యాతులైన ఈవీ రామస్వామి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. పుదుకోట్టయ్ సమీపంలోని ఓ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ఉలితో



పెరియార్ విగ్రహం నుంచి తలను వేరుచేసి వేరే ప్రాంతంలో వేసినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం అందగానే పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆ ప్రాంతంలో భారీ ఎత్తున పోలీసులను మోహరించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. జిల్లా యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి అదే ప్రాంతంలో పెరియార్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించింది. 2013లో ద్రవిడార్ కజగం నాయకుడు వీరమణి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 6న తమిళనాడులోని వేలూరు జిల్లాలో పెరియార్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. అంతకుముందు త్రిపురలో కమ్యూనిస్టు యోధుడు లెనిన్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. దీని వెనుక బీజేపీ కార్యకర్తల హస్తముందనే ఆరోపణలు వచ్చాయి. విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని ప్రధాని మోదీ సహా పలువురు నేతలు ఖండించారు. అయినా తమిళనాట మళ్లీ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఫేస్‌బుక్.. 'పతనం'

- సమాచారం లీక్.. షేర్ ధమాల్!
- 5 కోట్ల మంది సమాచారం బహిర్గతం
- డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి వినియోగం
- జుకర్‌బర్గ్‌ను ప్రశ్నించిన విచారణ సంస్థలు
- భారీగా నష్టపోయిన ఫేస్‌బుక్ వాటాలు
- వాల్‌స్ట్రీట్‌లో ఒక్కరోజే 7 శాతం కిందికి





శాన్‌ఫ్రాన్సిస్కో, మార్చి 20: ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ చిక్కుల్లో పడింది. ఫేస్‌బుక్ సమాచారం లీకైనట్టు వచ్చిన ఆరోపణలతో సంస్థ అధినేత జుకర్‌బర్గ్‌ను విచారణ సంస్థలు ప్రశ్నించారన్న వార్తలు రావడంతో కంపెనీ షేర్‌లు భారీగా పతనమయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లో సోమవారం ఒక్కరోజే.. ఫేస్‌బుక్ షేర్ విలువ 7 శాతం మేర పడిపోయింది. గడిచిన నాలుగేళ్లలో ఒకే రోజులో షేర్ విలువ భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రాజకీయ ప్రయోజనాల కోసం ఫేస్‌బుక్ నుంచి దాదాపు 5 కోట్ల మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం లీకైందని వచ్చిన ఆరోపణలు వెల్లువెత్తాయి. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో డొనాల్డ్ ట్రంప్ కోసం ఈ సమాచారాన్ని కేంబ్రిడ్జ్ అనలిటికా చోరీ చేసినట్టు అమెరికా, బ్రిటన్ మీడియాలో కథనాలు వచ్చాయి. ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం పనిచేసిన కన్సల్టెన్సీకి ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలు ఎలా లభించాయన్న దానిపై ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌ను అమెరికా, ఐరోపా విచారణ సంస్థల అధికారులు ప్రశ్నించనున్నారని కూడా వార్తలు వెలువడ్డాయి. దీంతో ఫేస్‌బుక్ సహా పలు టెక్ దిగ్గజ సంస్థలపై ఆయా ప్రభుత్వాలు ఆంక్షలు విధించబోతున్నాయని ప్రచారం జరిగింది. ఇది మదుపుదార్లలో గుబులురేపడంతో ఒక్కసారిగా ఫేస్‌బుక్ షేర్లు భారీగా కుప్పకూలాయి. షేరు మార్కెట్ విలువ 7 శాతం మేర పడిపోయింది. దీంతో క్షణాల్లో 2.60 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది.



అనుష్క, ప్రభాస్

'బాహుబలి 2' రిలీజ్‌కి రెడీ

ప్రభాస్, రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందిన 'బాహుబలి 2' మళ్ళీ రిలీజ్ అవుతోంది. అయితే అది తెలుగులో కాదు.. చైనా భాషలో. ప్రపంచవ్యాప్తంగా 1700 కోట్ల రూపాయలు వసూలు చేసి అన్ని రికార్డులను అధిగమించిన 'బాహుబలి 2' చిత్రం ఇప్పుడు చైనాలో విడుదల అవుతోంది. ఇప్పటికే ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. 'బాహుబలి' చిత్రాన్ని విడుదల చేసిన ఈస్టార్ మీడియా 'బాహుబలి 2'ని కూడా రిలీజ్ చేస్తోంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తారు.

'గులేబకావళి' సరాగాలు



ప్రభుదేవా హీరోగా, హన్సిక హీరోయిన్‌గా, రేవతి ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించిన చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తమిళ్‌లో సంక్రాంతికి విడుదలై సంచలన విజయం సాధించింది. కాగా, ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సుర్క్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఏప్రిల్ 6న ఈ చిత్రం విడుదల కానుంది. వివేక్ మెర్విన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. బిగ్ సీడీలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విడుదల చేశారు. ఆడియో సీడీలను ఎన్.శంకర్ విడుదల చేయగా, తొలి సీడీని జీవిత అందుకున్నారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ''టైటిల్‌లోనే సక్సెస్ కనపడుతుంది. గతంలో ఇదే టైటిల్‌తో సినిమా విడుదలై మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే టైటిల్‌తో వస్తున్న సినిమా కావడంతో తప్పకుండా సక్సెస్‌ను సాధిస్తుంది'' అన్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''తమిళం రాకపోయినా ఈ సినిమా చూసి కామన్ ఆడియెన్‌గా ఎంజాయ్ చేశాను. తెలుగు ప్రేక్షకులకు సినిమా నచ్చుతుందనిపించి.. తెలుగులో మా బేనర్‌పై ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నాం'' అన్నారు. ఎన్.శంకర్ మాట్లాడుతూ ''మిస్టరీ, కామెడీ, సస్పెన్స్ సహా అన్నీ ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. ఈ సినిమా పెద్ద సక్సెస్‌ను సాధిస్తుంది'' అన్నారు. జీవిత మాట్లాడుతూ ''మల్కాపురం శివకుమార్ గారు మంచి మనసున్న వ్యక్తి. ఆయనకు ఈ సినిమా పెద్ద హిట్ సాధించి మంచి పేరు సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

మధురవాణి సమంత



మహానటి సావిత్రి జీవిత కథ ఆధారంగా నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'మహానటి'. ఈ సినిమాలో కీర్తి సురేష్ టైటిల్ రోల్‌లో కనిపించనుంది. ఈ చిత్రంలో మోహన్‌బాబు, సమంత, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, షాలినీ పాండే, భానుప్రియ, ప్రకాశ్‌రాజ్, క్రిష్, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇందులో జర్నలిస్ట్ పాత్రలో కనిపించనున్న నటి సమంత.. సోమవారంతో 'మహానటి' కి సంబంధించి తన షూటింగ్ పార్ట్‌ను పూర్తిచేశారు. ఈ సినిమాలో భాగమవడాన్ని గౌరవంగా భావిస్తున్నానని.. ఈ చిత్రంలో పనిచేయడం అద్భుతమైన అనుభూతి నిచ్చిందని సమంత పేర్కొన్నారు. కాగా, ఇందులో సమంత పోషిస్తున్న మధురవాణి పాత్ర లేకపోతే.. 'మహానటి'కి నిండుదనం ఉండదని చిత్ర యూనిట్ అభిప్రాయపడుతోంది. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సునీల్, అల్లరి నరేష్ 'సిల్లీ ఫెలోస్'





'సుడిగాడు' వంటి విజయవంతమైన చిత్రం తరువాత కథానాయకుడు అల్లరి నరేష్, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సునీల్ మరో హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో నందిని రాయ్ కథానాయిక. తమిళంలో విజయం సాధించిన 'తమిళ్ పడం' ఆధారంగా 'సుడిగాడు' రూపొందితే.. 'తమిళ పడం'కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'తమిళ్ పడం 2' ఆధారంగా తాజా చిత్రం రూపొందుతోందని సమాచారం. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకి 'సిల్లీ ఫెలోస్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారని తెలిసింది. త్వరలోనే ఈ టైటిల్‌పై క్లారిటీ వస్తుంది.



'రంగస్థలం'లో రంగమ్మత్తగా అనసూయ

వేసవిలో 'అప్పుడు ఇప్పుడు'



సుజన్, తనిష్క్

యు.కె. ఫిలింస్ పతాకంపై ఉషారాణి కనుమూరి, విజయ రామకృష్ణంరాజు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'అప్పుడు - ఇప్పుడు'. చలపతి పువ్వల దర్శకుడు. సుజన్, తనీష్క జంటగానటిస్తుండగా, శివాజీరాజా, మళ్లీ రావా ఫేం పేరుపురెడ్డి శ్రీనివాస్ ముఖ్యపాత్రల్లో కనిపించనున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మాధవి, జబర్దస్త్ అప్పారావు తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

బృందావనంలో కీలక సన్నివేశాలు



రిచా పనయ్

జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై తేజ డైమండ్స్ సికింద్రాబాద్ అధినేత శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు నిర్మిస్తున్న చిత్రం 'బృందావనమది అందరిది'. హర్షవర్ధన్ రాణే, రిచా పనయ్ హీరోహీరోయిన్లు. శ్రీధర్ సీపాన దర్శకుడు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసి సేంపుల్ వీడియో విడుదల చేశారు ఈ సందర్భంగా దర్శకుడు శ్రీధర్ సీపాన మాట్లాడుతూ ''చిత్రం వైజాగ్‌లో సినిమా గురించి వైజాగ్ సాగర తీరంలో వేయించిన హీరోయిన్ హోమ్ సెట్ సన్నివేశాలు, వైజాగ్ పరిసర ప్రాంతాలలో చిత్రంలోని ప్రధాన తారాగణం తో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించాం. మా ఫస్ట్ షెడ్యూల్ మేకింగ్ అండ్ సేంపుల్ వీడియో టీజర్‌ని విడుదల చేశాం. ఫ్రెండ్స్ నుండి పెద్ద హీరోలనుండి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది ఆ రెస్పాన్స్ నాకు మరింత ధైర్యాన్నిచ్చింది. మిగతా షెడ్యూల్ ఏప్రిల్ 1 నుండి బెంగళూర్‌లో, ఆ తర్వాతి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది'' అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'యమ్6'



అశ్వని, మారుతి

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరి, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బేనర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు, సురేష్.ఎస్ సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'యమ్6'. మారుతి, అశ్వని, ప్రియ హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి జైరామ్‌వర్మ దర్శకుడు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. దర్శకుడు జైరామ్‌వర్మ మాట్లాడుతూ ''యమ్6' సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో ఉంటూ కడుపుబ్బ నవ్విస్తుంది. అంతర్లీనంగా చిన్న సందేశం కూడా ఇచ్చే ప్రయత్నం చేశాం'' అన్నారు. నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ ''దర్శకుడు చెప్పిన కథ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాను. మా హీరో మారుతికిది తొలి సినిమా అయినా ఎంతో అనుభవం ఉన్న హీరోలా నటించాడు'' అన్నారు. హీరో మారుతి మాట్లాడుతూ ''ఇది నా తొలి సినిమా. డైరెక్టర్ వర్మగారు సినిమాని చాలా ఎక్స్‌లెంట్‌గా తీస్తున్నారు. విజయ్ బాలాజీగారి సంగీతం ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అన్నారు.

'టెంపర్' రీమేక్‌లో సారా..



యువ కథానాయకుడు ఎన్టీఆర్ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిన చిత్రాలలో 'టెంపర్' ఒకటి. ఈ సినిమా.. తారక్‌లోని నటుణ్ని కొత్త కోణంలో చూపింది. అలాంటి 'టెంపర్'.. ఇప్పుడు హిందీలో రీమేక్ అవుతోంది. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి రోహిత్‌శెట్టి దర్శకుడు కాగా.. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో కథానాయికగా సైఫ్ అలీ ఖాన్ కుమార్తె సారా అలీ ఖాన్ ఎంపికైంది. ఇంతకుముందు ఈ పాత్ర కోసం.. అలియా భట్, జాన్వీ కపూర్, ప్రియా ప్రకాశ్ వారియర్ తదితరుల పేర్లు వినిపించాయి. ఇప్పుడు సారా అలీ ఖాన్ కన్‌ఫర్మ్ కావడంతో ఈ వార్తలకు తెరదించినట్లయ్యింది. సంగ్రామ్ భలేరామ్ అనే పోలీస్ పాత్రలో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 28న విడుదల కానుంది.

టెక్నాలజీ పేరుతో...



సూపర్ గుడ్ ఫిలింస్ ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్‌రామ్ నిర్మిస్తున్న చిత్రం 'ఒకటే లైఫ్'. హ్యాండిల్ విత్ కేర్ అనేది ఉప శీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ హీరోయిన్. ఈ చిత్రం ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను యంగ్ హీరో జీవా విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవా మాట్లాడుతూ ''ఒకటే లైఫ్ మోషన్ పోస్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంది. సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది'' అన్నారు. దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ ''టెక్నాలజీ పేరుతో పరుగులు పెడుతున్న నేటితరం హ్యూమన్ రిలేషన్స్‌కు, ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నది ఈ సినిమా కాన్సెప్ట్. ఒక మంచి సినిమా చూశామన్న సంతృప్తి ప్రేక్షకులకు కలుగుతుంది'' అన్నారు. నిర్మాత నారయణ్‌రామ్ మాట్లాడుతూ ''ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు.

ప్రాంతీయ పార్టీలపై కేంద్రం కుట్ర

- మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి, మార్చి 20 (మనం ప్రతినిధి): ప్రాంతీయ పార్టీలపై కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత వాతావరణాన్ని కల్పించి, ప్రజలను రెచ్చగొడుతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. కొన్ని ప్రాంతీయ పార్టీలతో బీజేపీ కుమ్మక్కై అవిశ్వాసాన్ని అడ్డుకుంటోందని విమర్శించారు. హామీలను అమలు చేయాలని అడిగితే కేంద్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మంత్రి తెలిపారు. బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు దగ్గరలోనే ఉందని మంత్రి హెచ్చరించారు.

మార్కులు వేసేది ప్రజలు.. పవన్ కాదు: ఎమ్మెల్యే నిమ్మల

చంద్రబాబు పాలనకు పవన్ మార్కులు వేయడం ఏమిటని.. ఆయన పాలనకు ప్రజలే మంచి మార్కులు వేస్తారని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. పవన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కంటే నిధులే ముఖ్యమని పవన్ మాట మార్చారని, పోలవరం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని పవన్ అనడం అభివృద్ధిని అడ్డుకోవడమేనని అన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రి మీద విచారణ జరపాలని పవన్ కోరుతున్నారని, ఏ1 గా ఉన్న జగన్‌ను మాత్రం ఒక్క మాట అనడం లేదని మండిపడ్డారు. అలాగే నిధులివ్వకుండా రాష్ట్రాన్ని ఇబ్బందుల పాలుచేసేందుకు ప్రయత్నిస్తున్న మోదీని ఒక్క మాట అనడం లేదన్నారు. పవన్ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, వారే సరైన జవాబు చెబుతారన్నారు.

కేటాయింపులు భారీగా.. ఖర్చు ఆవగింజంత



- బడ్జెట్‌పై బీజేపీ లక్ష్మణ్ విమర్శ

హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్‌లో అంచనాలు బారెడు వాస్తవాలు జానెడు గా ఉన్నాయని మంగళవారం శాసనసభలో బడ్జెట్ పై జరిగిన చర్చలో పాల్గొన్న బీజేపీ సభ్యుడు డాక్టర లక్ష్మణ్ విమర్శించారు. వ్యవసాయ రంగానికి భారీ కేటాయింపులు చేసినట్లు చూపినా, వాస్తవానికి ఈ రంగానికి దక్కేది రెండు వేల కోట్లేనన్నారు. మూడు లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మిస్తామని చెబుతున్న ప్రభుత్వం అందుకు తగిన విధంగా కేటాయింపులు చేయలేదనినారు. బడ్జెట్‌లో ఏ రంగం చూసినా కేటాయింపులు చాలా భారీగా కనిపిస్తున్నాయని, గత బడ్జెట్లు చూసుకుంటే, ఖర్చు మాత్రం నామమాత్రంగానే ఉందన్నారు. కేటాయింపులు తాటికాయంత కనిపిస్తున్నాయని, ఖర్చు మాత్రం ఆవగింజంతే ఉన్నాయని విమర్శించారు. సాగునీటి రంగానికి కేటాయింపుల్లో దక్షిణ తెలంగాణపై ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. అందమైన అబద్ధాలతో కూడిన బడ్జెట్ ఇదని, అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నాలుగు సంవత్సరాల్లో చేసిన కేటాయింపుల్లో కనీసం 50 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ తప్పని సరిగా తీసుకు వస్తామని స్వయంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, బడ్జెట్‌లో దాని ఊసే లేదన్నారు. ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ పెడతామని చెప్పి, ఆ విషయాన్ని విస్మరించారని లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంపై అప్పుల భారం పెరుగుతుందన్నారు. రెండు లక్షల కోట్లకు అప్పులు చేరుకున్నాయని, ప్రతి ఒక్కరిపై కనీసం 51 వేల అప్పు పడుతుందన్నారు. కేజీ టూ పీజీ విద్య గురించి పట్టించుకోవడంలేదన్నారు. మూడు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇప్పటి వరకు కేవలం 27 వేలు మాత్రమే భర్తీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. హైదరాబాద్ నుంచి 70 శాతం ఆదాయం వస్తున్నా, నగరానికి కేటాయింపుల్లో అన్యాయం జరిగిందన్నారు. ఉద్యోగులకు పీఆర్‌సి వెంటనే వేయాలని కోరారు.

పాతబస్తీకి 5 వేల కోట్లు: అక్బరుద్దీన్

హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): పాతబస్తీకి ఐదు వేల కోట్లతో ప్యాకేజీ కావాలని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. మైనార్టీలకు కేటాయిస్తున్న వాటిలో 50 శాతం కూడా ఖర్చు చేయడంలేదన్నారు. తెలుగు తప్పనిసరిపై ప్రభుత్వం నిర్దిష్టంగా ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీన్ని ఇంటర్ వరకు అమలు చేయడం సరికాదన్నారు. హిందీ, ఉర్దూ, సంస్కృతం, అరబిక్ వంటి భాషల చదువుతున్న విద్యార్థులు, లెక్చరర్లకు నష్టపోతారన్నారు. పాత పెన్షన్ విధానం విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేశారని, దీనిపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని టీడీపీ సభ్యుడు సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు.

వారి కోసమే ఆపరేషన్ స్మైల్: నాయిని



హైదరాబాద్, మార్చి 20 (మనం ప్రతినిధి): బాల కార్మికుల రక్షణ, పునరావాసం కోసం పోలీసు శాఖ సమన్వయంతో '' ఆపరేషన్ స్మైల్'' ద్వారా కార్మిక శాఖ ప్రత్యేక దాడులను చేపడుతుందని హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 331 బాలలను, రంగారెడ్డిలో 845 మందిని, వరంగల్‌లో 556 మంది బాలలను రక్షించామని, హైదరాబాద్‌లో 331 మంది బాలలకు, రంగారెడ్డిలో 737, వరంగల్‌లో 556 మందికి పునరావాసం కల్పించినట్టు తెలిపారు.



తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన రాజ్యసభ ఎన్నికల మాక్ పోలింగ్ దృశ్యాలు



పవన్‌వి పచ్చి అబద్ధాలు

మోదీతో నాకు విరోధం ఏముంది?



- ప్రధాని ఆ విషయం ఆయనకు చెప్పారా
- మొన్న లోకేశ్‌కు, శేఖర్‌రెడ్డికి ముడిపెట్టాడు
- ఇప్పుడు పోలవరంపై ఆరోపణలా...
- బీజేపీకి కోవర్టులుగా జనసేన, వైసీపీ
- టీడీపీపై బురదజల్లడమే వారి అజెండా
- గందరగోళం సృష్టించడానికే నాటకాలు
- టీడీపీ ఎంపీలు ఎవరూ వెల్‌లోకి వెళ్లొద్దు
- చర్చకు అనుకూల వాతావరణం కల్పించండి
- పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 20 (మనం ప్రతినిధి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని టీడీపీ జాతీయాధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. గతంలో జగన్ మీడియా చేసిన ఆరోపణలనే ఇప్పుడు పవన్ కల్యాణ్ వల్లె వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడానికే ఈ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. పార్టీ ఎంపీలు, ముఖ్యనేతలతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ''పవన్.. నిన్న లోకేశ్‌కు, శేఖర్ రెడ్డికి ముడిపెట్టారు. ఈ రోజు పోలవరంపై ఆరోపణలు చేస్తున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇలాంటి కీలక సమయంలో నేపవన్ ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు? ఎవరు చేయిస్తున్నారు? ప్రత్యేక హోదా గురించి ప్రధాని మోదీ చెప్పలేదు. యూపీఏ చెప్పిందని పవన్ అనడం వెనుక అర్థం ఏమిటి? ఎవరికి కొమ్ము కాస్తున్నారు? ఎవరి లాభాల కోసం పనిచేస్తున్నారు? నాకు, మోదీకి విరోధం ఏముంది? నాతో విరోధం ఉందని మోదీ చెప్పారా మీకు? ఎవరు చెప్పారు?'' అని పవన్‌పై చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.

ఆ మూడు పార్టీల స్క్రిప్ట్ ఒక్కటే

మూడు పార్టీలు (బీజేపీ, వైసీపీ, జనసేన) స్క్రిప్ట్ ఒక్కటేనని.. ఆ స్క్రిప్టులన్నీ ఒకే చోట తయారవుతున్నాయని చంద్రబాబు ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఎంత తిడితే టీడీపీకి అంత లాభమని, ప్రజల్లో మద్దతు పెరుగుతోందని ఆయన చెప్పుకొచ్చారు. వైసీపీ, జనసేనలు తనమీద విమర్శలే తప్ప మోదీపై ఈగ కూడా వాలనివ్వడం లేదని విమర్శించారు. ''రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని ఒక్క మాట అనడం లేదు. నిన్న ఏం మాట్లాడారు..? ఈ రోజు ఏం చెబుతున్నారు..? ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. కుట్రలను ఎదుర్కోవడం తెలుగువారికి కొత్త కాదు. కుట్రలను ఎదుర్కోవడంలో తెలుగువారు రాటుదేలిపోయారు'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

వాళ్లందరి ఎజెండా ఒక్కటే

''నిన్న పార్లమెంటులో జరిగింది చూశాం. రెండు పార్టీలు ఏవిధంగా చర్చను అడ్డుకున్నదీ చూశాం. ప్రతిరోజూ అప్రమత్తంగా ఉండాలి. సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి వ్యవహరించాలి. అవిశ్వాసంపై అన్నిపార్టీల నేతలతో మాట్లాడతా. అందరి మద్దతు కోరతా. రాష్ట్రానికి సహకరించాలని అడుగుతా. అన్ని పార్టీల సభాపక్ష నేతలతో ఎంపీలు సమన్వయం చేసుకోవాలి. బీజేపీ, వైసీపీ, జనసేన మూడు పార్టీల అజెండా ఒక్కటే. టీడీపీపై బురదజల్లడమే అవి సింగిల్ పాయింట్ అజెండాగా పెట్టుకున్నాయి. వైసీపీ, జనసేన.. బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నాయి. టీడీపీని బద్నాం చేయాలని చూస్తున్నాయి. దాని వల్ల ఎవరికి లాభం? మేము అడిగేది చేయకుండా ఇలా మాపై బురదజల్లడం ఏమిటని ప్రజలే ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రానికి అన్యాయం చేయడం, సమస్యను పక్కదారి పట్టించడం, టీడీపీపై బురద జల్లడం.. ఇలా ఒక పద్ధతి ప్రకారం మూడు పార్టీలు చేస్తున్నాయి. మనం కేంద్రాన్ని అడిగేది రాష్ట్రానికి న్యాయం చేయమనే. మన హక్కుల కోసం అడుగుతున్నాం. ఇందులో తప్పేమిటి? మనం యుద్ధం చేయడం ఏమిటి? ధర్మం కోసం పోరాడుతుంటే.. మీకు యుద్ధంలా కనిపిస్తోందా? ఇదేనా ఏపీ పట్ల మీరు చూపే శ్రద్ధ..? ఇదేనా చట్టం అమలు పట్ల మీ దృష్టి..?''అని ప్రతిపక్షాలపై బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీ స్థానాల్లోనే ఉండండి..

''పార్లమెంట్‌కు ఎంపీలు ఎవరూ గైర్హాజరు కావొద్దు. అందరూ అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్ర ప్రజల గొంతు పార్లమెంటులో వినిపించాలి. ఎవరూ వెల్‌లోకి వెళ్లొద్దు. మీ స్థానాల్లో లేచి నిలబడండి. సభ వాయిదా పడితేనే వెల్‌లోకి వెళ్లండి. చర్చకు అనుకూల వాతావరణం సభలో కల్పించండి. ఎవరు వెల్‌లోకి వెళ్లి చర్చ రాకుండా చేస్తున్నారో ప్రజలకు తెలుసు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీయేతో కలిశాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీయే నుంచి వైదొలిగాం. గతంలో నేషనల్ ఫ్రంట్‌లో, యునైటెడ్ ఫ్రంట్‌లో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాల కోసమే. రాజకీయాల్లో తెలుగుదేశం పాత్ర రాష్ట్ర ప్రయోజనాల కోసమే'' అని ఆయన ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. టీడీపీకి గతంలో జరిగిన అవమానాలను ఆయన గుర్తుచేశారు. ఎన్టీఆర్‌పై గాజులు పగలగొట్టి పోయడం, అసెంబ్లీలో స్మోక్ బాంబ్‌లు పేల్చడం, అసభ్య పదజాలంతో దూషించడం సంఘటనలను ప్రస్తావించారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నామని, అవమానాలకు గురైనప్పుడల్లా తెలుగువారి తడాఖా చూపించామని గుర్తుచేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత వై.ఎస్.చౌదరి, లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం, ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని, శాసనసభ, శాసనమండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాథ రెడ్డి, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, లోక్ సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబు నంబర్ 1 ద్రోహి

- మేకప్ లేకుండా డ్రామాలాడుతున్నారు
- ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావు: అంబటి



విజయవాడ, మార్చి 20 (మనం ప్రతినిధి): దేశ రాజకీయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నంబర్ వన్ ద్రోహి అని వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మేకప్ వేసుకుని పార్లమెంటు ఆవరణలో వేషాలు వేస్తుంటే.. చంద్రబాబు మాత్రం ఎటువంటి మేకప్ లేకుండా డ్రామాలాడుతున్నారని అన్నారు. రాజకీయాలను భ్రష్టుపట్టించిన చరిత్ర ఆయనదని విమర్శించారు. పాత మిత్రులు దూరం కావడంతో కొత్త మిత్రుల కోసం ఆయన వెంపర్లాడుతున్నారని ఆరోపించారు. తాజాగా కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తానని చంద్రబాబు చెబుతున్నారని తెలిపారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదాపై చంద్రబాబు పిల్లిమొగ్గలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ద్రోహులను ఎన్నికలలో ఓడించాలని చంద్రబాబు ప్రకటించడం విడ్డూరంగా ఉందని, దొంగే.. దొంగా దొంగా అని అరిచినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఆరు వందల వాగ్దానాలు ఇచ్చి ఒక్కటైనా నిలబెట్టుకున్నారా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు వంటి ద్రోహులకు డిపాజిట్లు కూడా రావన్నారు. బీజేపీ నేత రామ్‌మాధవ్‌కు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు వైఖరి ఇప్పుడు అర్థం అయ్యిందన్నారు. బీజేపీతో కుమ్మక్కయ్యారని వైసీపీపై టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి కడదామని బీజేపీ మొదట వైసీపీ వద్దకే వచ్చిందని, తాము నిరాకరించడం వల్లే టీడీపీతో కలిసిందని అంబటి రాంబాబు వెల్లడించారు. అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చ జరగనివ్వకుండా బీజేపీ ప్రయత్నిస్తోందని, చర్చ జరిగితే దేశ ప్రజలకు ఏపీకి జరిగిన అన్యాయం తెలుస్తుందన్నారు. హోదా సాధన కోసమే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టామని వివరించారు.

ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి?

ఎక్కడెక్కడ వచ్చాయో చెప్పండి.. ఓట్ల మాటలొద్దు: విష్ణుకుమార్ రాజు

అమరావతి, మార్చి 20 (మనం ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు పొంతన లేని లెక్కలు చెబుతూ అయోమయానికి గురిచేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్షం నాయకుడు విష్ణుకుమార్ రాజు విమర్శించారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు వల్ల 5 లక్షల ఉద్యోగాలొచ్చాయని ఒకరు, 10 లక్షల ఉద్యోగాలు వచ్చాయని మరొకరు మాట్లాడుతున్నారని అన్నారు. అసలు ఎన్ని ఉద్యోగాలొచ్చాయో, ఎక్కడెక్కడ వచ్చాయో వివరాలు వెల్లడించాలన్నారు. కూలిపనులు కూడా కరువై ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళుతున్నారని, లక్షలాది ఉద్యోగాలు వస్తే వీరంతా ఎందుకు వలస వెళతారని ప్రశ్నించారు. కేవలం ఓట్ల మాటలు చెప్పొద్దని, వెనుకబడ్డ ఉత్తరాంధ్ర గురించి పట్టించుకోవాలని విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు.



నామినేటెడ్ పదవికి బీజేపీ నేత రాజీనామా

బాబును కలిసి లక్ష్మీపతి రాజీనామా సమర్పణ

మిత్ర బంధం తొలగిపోవడంతో నామినేటెడ్ పదవి నుంచి రాష్ట్ర బీజేపీ నేత లక్ష్మీపతి రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్న ఆయన తన పదవి నుంచి తప్పుకొంటున్నట్లు సీఎం చంద్రబాబును కలిసి రాజీనామా లేఖ అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలగటంతో తాను కూడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నుంచి టీడీపీ వైదొలిగినపుడు తాను బీజేపీకి చెందిన వ్యక్తిగా పదవిలో ఉండటం సరికాదని లక్ష్మీపతి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఏమేమి ఇచ్చిందో ప్రజలకు స్పష్టంగా వివరిస్తామని ఆయన చెప్పారు. జనసేన అధినేత పవన్, వైసీపీ అధినేత జగన్ వెనుక బీజేపీ ఉందన్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.



మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో కార్యకర్తల కోలాహలం



ఢిల్లీలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మ అవార్డును స్వీకరిస్తున్న సంగీత విద్వాంసుడు ఇళయరాజా

హైదరాబాదీకి ఐఐఎంసీఏఏ అవార్డు



- గౌరా నైథనికి ఈ పురస్కారం ప్రదానం

హైదరాబాద్, మార్చి 20: హైదరాబాద్‌కు చెందిన గౌరా నైథనికి ప్రతిష్ఠాత్మక 'ఇఫ్‌కో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అలూమ్ని అసోసియేషన్' (ఐఐఎంసీఏఏ) అవార్డు దక్కింది. 'డిజిటల్ ప్రొడక్షన్-ఒరిజినల్ స్టోరీ టెల్లింగ్ కేటగిరి'లో గౌరాకు ఈ అవార్డు దక్కడం విశేషం. ఢిల్లీలోని భల్స్వా డంపింగ్ యార్డ్‌పై ఆమె రూపొందించిన 6 నిమిషాల నిడివిగల వీడియో సోషల్ మీడియాలో భారీ ప్రచారానికి నోచుకుని అత్యధికంగా షేర్ అయింది. అవార్డు కింద ట్రోఫీతో పాటు 21,000 నగదు బహుమతి, సామ్‌సంగ్ గెలాక్సీ టాబ్లెట్‌తో పాటు సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. దేశ వ్యాప్తంగా 14 నగరాలతో పాటు సింగపూర్, తాష్కెంట్‌లలో వార్షికోత్సవాలు నిర్వహించే ఐఐఎంసీఏఏకు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తం 20 మంది సభ్యులు కమ్యూనికేటర్లుగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల చాప్టర్ అధ్యక్షుడు బ్యోమకేష్ బిస్వాల్ ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమంలో పలువురు ఐఐఎంసీకి చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు. నిరుడు ఈ అవార్డును హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ టీఎస్ సుధీర్‌కు ప్రదానం చేశారు.


విశాఖలో విరాట్!

- మెరైన్ మ్యూజియంగా యుద్ధనౌక
- పర్యాటక వారసత్వ బోర్డు ఆమోదం
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం నివేదిక
- ప్రాజెక్టు ఏర్పాటుపై పరిశీలన: కేంద్రం


విశాఖపట్నం, మార్చి 20 (మనం న్యూస్ బ్యూరో): పచ్చని తూర్పు కనుమలు, సుందరమైన విశాల సాగర తీరంతో ఏటా లక్షలాది మందిని ఆకట్టుకొంటూ, రాష్ట్ర పర్యాటక రాజధానిగా పేరుతెచ్చుకొన్న విశాఖకు భారీ యుద్ధనౌక ఐఎన్ఎస్ విరాట్ కొత్త ఆకర్షణ కానుంది. ఇప్పటికే కురుసుర జలాంతర్గామి, టీయూ 142 యుద్ధవిమానాన్ని మ్యూజియంగా మార్చి విశాఖ కీర్తిని ఇనుమడింపజేసిన పర్యాటక శాఖ.. విరాట్‌ను పర్యాటక ప్రదర్శనశాలగా ఏర్పాటు చేయడానికి మార్గం



సుగమమవుతోంది. భారత నౌకాదళ సేవల నుంచి నిష్క్రమించిన ఈ యుద్ధనౌకను విశాఖ సాగరతీరంలో జాతీయ స్థాయి మెరైన్ మ్యూజియంగా ఏర్పాటు చేసే ప్రతిపాదనకు పర్యాటక వారసత్వ బోర్డు ఆమోద ముద్ర వేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన ఫిబ్రవరిలో తమకు అందిందని, దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ బ్రహ్మీ స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన పార్లమెంటులో సమాధానామిస్తూ.. ఈ ప్రాజెక్టు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. కురుసుర జలాంతర్గామి, టీయూ 142 యుద్ధ విమానాలను ఆర్‌కే బీచ్‌లో రోడ్డుకు అటూ ఇటూ ఏర్పాటు చేశారు. విరాట్ కోసం మాత్రం అధికారులు భారీ కసరత్తు చేయాల్సి వస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం కనీసం 18 ఎకరాల స్థలం అవసరం కావడంతో నగర పరిధిలో ముఖ్య పర్యాటక ప్రాంతాలైన రుషికొండ, భీమిలి, మంగమూరి పేట, మూలకుద్దులను పరిశీలిస్తున్నారు. సాగరతీరంలోని ఈ ప్రాంతాలు విరాట్ కొలువుదీరేందుకు అనువైనవని నిర్ధారించారు. ఇక్కడి భౌగోళిక, వాతావరణ పరిస్థితులపై సర్వే కూడా పూర్తి చేసిన అధికారులు కేంద్ర పర్యాటక శాఖాధికారులకు వివరాలను అందజేశారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అఖిల ప్రియ ఈ మ్యూజియం ఏర్పాటుపై చర్చించారు. ఇది త్వరలోనే కార్యరూపం దాల్చనుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విశాఖలో విరాట్‌ను మ్యూజియంగా మార్చే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినా.. అవసరమైన నిధులు సమకూర్చుకోవడం సమస్య అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	3.17	ఓఎన్‌జీసీ	-1.13
సన్ ఫార్మా	2.20	ఐసీఐసీఐ బ్యాంక్	-1.10
డాక్టర్ రెడ్డీస్	1.85	యస్ బ్యాంక్	-0.92
విప్రో	1.54	రిలయన్స్	-0.64
అదానీ పోర్ట్స్	1.47	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	-0.56



పెరిగినవి	%	తగ్గినవి	%
భారతి ఇన్‌ఫ్రా	5.09	వేదాంత	-6.54
టెక్ మహీంద్రా	3.85	ఓఎన్‌జీసీ	-1.55
ఐషర్ మోటార్స్	3.49	బీపీసీఎల్	-1.36
టాటా స్టీల్	3.14	సిప్లా	-1.22
సన్ ఫార్మా	2.23	అల్ట్రాటెక్	-0.90


టాప్ గెయినర్స్ 20 మార్చి
32,996.76
బి.ఎస్.ఇ సెన్సెక్స్
▲73.64

		%
593.30	టాటా స్టీల్	3.17%
508.85	సన్ ఫార్మా	2.20%
2157.40	డాక్టర్ రెడ్డీస్	1.85%
292.50	విప్రో	1.54%
369.20	అదానీ పోర్ట్స్	1.47%
1800.00	హెచ్‌డీఎఫ్‌సీ	1.38%
1162.10	ఇన్ఫోసిస్	1.30%
1293.70	లార్సెన్ టూబ్రో	1.09%
2859.15	టీసీఎస్	1.07%
339.25	టాటా మోటార్స్	1.04%


బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



భారత్ వృద్ధి అంచనాకు గోల్డ్‌మ్యాన్ కోత



ముంబయి/బెంగళూరు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి)లో 2 బిలియన్ డాలర్లకుపైగా మోసం వెలుగు చూసిన నేపథ్యంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంచనాలను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మ్యాన్ శాక్స్ తగ్గించింది. అటువంటి వాటి వల్ల బ్యాంకింగ్ రంగ నియంత్రణ మరింత కట్టుదిట్టంగా మారి, రుణాల వృద్ధికి అది ప్రతిబంధకంగా తయారవచ్చని గోల్డ్‌మ్యాన్ శాక్స్ హెచ్చరించింది. కొత్త (2019 మార్చి వరకు ఉండే) ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు వాస్తవిక స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) అంచనాను ఇంతకుముందున్న 8 శాతం నుంచి 7.6 శాతానికి తగ్గిస్తూ గోల్డ్‌మ్యాన్ శాక్స్ తన క్లయింట్లకు ఒక నోట్ పంపింది. ప్రభుత్వం రంగంలోని రెండవ అతి పెద్ద బ్యాంకు పి.ఎన్.బి.లో గత నెలలో వెల్లడైన కుంభకోణంతో బ్యాంకింగ్ రంగ షేర్లు పతనమవుతూ వస్తున్నాయి.

రుణ వృద్ధిపై సందేహాలు

ఈ కేసుకు తోడు, ఇతర బ్యాంకులు కూడా చిన్న రుణ మోసాలు చాలా వాటిని వెల్లడించడంతో కొత్త భయాలు మొదలయ్యాయి. రుణాలలో వృద్ధి పుంజుకోకపోవచ్చనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకింగ్ ఆస్తుల్లో మూడింట రెండు వంతులు ప్రభుత్వ రంగ బ్యాంకులకే చెందుతాయి. ఈ బ్యాంకుల మొండి బాకీలు పర్వత పరిమాణానికి చేరుకున్నాయి. ఇటువంటి ఆర్థిక వ్యవస్థలో కొత్త రుణాల మంజూరు కష్టంగా కనిపిస్తోంది. గోల్డ్‌మ్యాన్ శాక్స్ హెచ్చరిక ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు రెండేళ్ళలో 32 బిలియన్ డాలర్ల మేరకు మూలధనాన్ని తిరిగి సమకూర్చాలని కేంద్రం నిర్ణయించింది. పి.ఎన్.బి.లో భారీ మోసం తర్వాత, మొండి బాకీలు పర్వత పరిమాణం దాల్చిన తర్వాత భారతీయ నియంత్రణ సంస్థ కొన్ని కఠిన చర్యలు తీసుకుంది. ఆ నిబంధనల ప్రకారం భారతీయ బ్యాంకులు మొండి బాకీలకు పక్కనపెట్టవ

నియంత్రణ సంస్థ కఠిన చర్యలు

లసి వచ్చే మొత్తాలు పెరగవచ్చు. దాంతో కొత్తగా రుణాలిచ్చేందుకు బ్యాంకుల వద్ద పెద్దగా నిధులు మిగలకపోవచ్చని భయపడుతున్నట్లు గోల్డ్‌మ్యాన్ సంస్థ పేర్కొంది. ''మార్కెట్లవారు, ఇన్వెస్టర్లు ఈ సమస్య ఎక్కువగా దైహికమైనదా అని ప్రశ్నిస్తున్నారు'' అని పి.ఎన్.బి. మోసాన్ని ప్రస్తావిస్తూ గోల్డ్‌మ్యాన్ విశ్లేషకులు నోట్‌లో పేర్కొన్నారు. బ్యాంకుల పునర్‌మూలధనీకరణ వల్ల ఒనగూడే సానుకూల ప్రభావాల్లో కొన్నింటిని పి.ఎన్.బి. బాగోతం తుడిచిపెట్టేస్తుందని, మొత్తంమీద రుణాలు, పెట్టుబడులు, జి.డి.పి.లో వృద్ధిని దెబ్బతీస్తుందని మార్కెట్లు భయపడుతున్నాయని గోల్డ్‌మ్యాన్ శాక్స్ వెల్లడించింది.

బ్యాంకులు తిరిగి రుణాలివ్వడం ప్రారంభించడానికి అది సహాయపడగలదని, ఆర్థిక వ్యవస్థలో నల్లపూసైపోతున్న ఉద్యోగాల వృద్ధికి ప్రేరణగాగా ఉపయోగపడగలదని ఆశిస్తూ కేంద్రం గత ఏడాది రీక్యాపిటలైజేషన్ కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. భారతదేశంలో మొండి బాకీలు 150 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. వాటిలో అధిక భారాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులే మోస్తున్నాయి. కేంద్ర బ్యాంక్ కొత్త నిబంధనల వల్ల, మొండి బాకీల నుంచి రక్షణకు అవి పక్కనపెట్టవలసి వస్తున్న మొత్తాలు ఇప్పటికే పెరుగుతున్నాయి. దివాలా కోర్టు ద్వారా మరింత మంది ఎగవేతదార్లు లైను కడుతూండడంతో, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరిన్ని రుణ నష్టాలు మొదలవుతున్నాయి.

భారత్ అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో అప్పటికి ఐదు క్వార్టర్లలో కనపడనంత వేగంగా 7.2 శాతం



వృద్ధిని నమోదు చేసి ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అనే హోదాను తిరిగి సంపాదించుకుంది. ఈ మార్చితో ముగుస్తున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతీయ ఆర్థిక వ్యవస్థ 6.6 శాతం వృద్ధి చెందగలదని గోల్డ్‌మ్యాన్ అంచనా వేసింది. 2019/20లో వృద్ధి 8.3 శాతంగా ఉండగలదనే తన అంచనాలో ఎలాంటి మార్పూ లేదని తెలిపింది. పి.ఎన్.బి నికర విలువలో నాల్గవ వంతుకుపైగా తుడిచిపెట్టుకుపోయి, మొత్తం 2 బిలియన్ డాలర్ల ప్రభావానికి బ్యాంకు చితికిపోతుందని గోల్డ్‌మ్యాన్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

భారతీయ బ్యాంకులు గుదిబండగా మారిన రుణాల విషయంలో వచ్చే రెండేళ్ళలో 60-65 శాతం కత్తెర వేయించుకోవలసి వస్తుందని కూడా ఆ సంస్థ అంచనా వేసింది. అంటే, వాస్తవంగా, వసూలు కావలసిన బకాయికి, రుణగ్రస్తులు 'సెటిల్' చేసుకోవడం ద్వారా చెల్లించే అసలు మొత్తానికి మధ్యనుండే తేడాను ఆర్థిక పరిభాషలో హెయిర్‌కట్‌గా పిలుస్తున్నారు. ఇంకా సూటిగా చెప్పాలంటే, తీసుకున్న అప్పు వంద రూపాయలైతే, తిరిగి చెల్లించే మొత్తం 35 నుంచి 40 రూపాయల వరకు మాత్రమే ఉంటుంది. ఇంతకుముందు ఇచ్చిన రుణాలలో కనీసం 50 శాతం మొత్తమైనా తిరిగి వసూలవుతుందని భావించారు. ఇప్పుడలాంటి ఆశలు లేకపోవడంతో మొండి బాకీలకు మొత్తంమీద పక్కన పెట్టవలసి వచ్చే మొత్తాలు పెరగవచ్చు.

పి.ఎన్.బి మోసం ఇప్పటికీ ఇంకా ఆవిష్కృతమవుతున్న స్థితిలోనే ఉంది. భారతీయ బ్యాంకింగ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఘరానా మోసం. రూ. 50 కోట్ల మొత్తాన్ని మించి ఉన్న అన్ని మొండి బాకీలను క్షుణ్ణంగా పరిశీలించవలసిందని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వకుండా చూడవలసిందని ప్రభుత్వం బ్యాంకులను కోరింది. మరికొన్ని చిన్న చితక మోసాలు కూడా గత నెల రోజులుగా బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే బయటపడ్డ కేసుల్లో దర్యాప్తు వేగం పుంజుకుంది.

అదే కోవలో కెనరా బ్యాంక్

మరో ప్రభుత్వ రంగ రుణ ప్రదాన సంస్థ కెనరా బ్యాంక్ షేర్ ధరలు మంగళవారం ఉదయం 5.4 శాతం పతనమయ్యాయి. కెనరా బ్యాంక్ మాజీ ఛీఫ్, ఇతరులపై పోలీసులు అభియోగాలను దాఖలు చేశారు. నాలుగేళ్ళ క్రితం బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల్లో సుమారు 10.5 మిలియన్ డాలర్ల మేరకు బ్యాంకును మోసగించిన కంపెనీకి ఆ అధికారులు సహాయపడినట్లు ఆరోపణలొచ్చాయి.

బీమా వ్యాపారానికి వీడియోకాన్ వీడ్కోలు

న్యూఢిల్లీ: బీమా వ్యాపారం నుంచి వైదొలగుతున్నట్లు వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మంగళవారంనాడు వెల్లడించింది. అమెరికాలోని లిబర్టీ మ్యూచువల్ ఇన్సూ్యరెన్స్ గ్రూప్‌తో కలసి సంయుక్త రంగంలో వీడియోకాన్ 'లిబర్టీ వీడియోకాన్ జనరల్ ఇన్సూ్యరెన్స్ కంపెనీ లిమిటెడ్'ను నెలకొల్పింది. ఇప్పుడా సంస్థలో తనకున్న మొత్తం 51.32 శాతం వాటాను డైమండ్ డీల్‌ట్రేడ్ లిమిటెడ్‌కు, ఇనాం సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించింది. అందులో డీపీ జిందాల్ గ్రూప్‌నకు చెందిన డైమండ్ డీల్‌ట్రేడ్ 26 శాతం వాటా కైవసం చేసుకోగా, మిగిలిన వాటాను ఇనాం సెక్యూరిటీస్ కొనుగోలు చేసింది. అయితే, వీడియోకాన్ ఎంత మొత్తానికి ఆ వాటాలు విక్రయించిందీ వెల్లడి కాలేదు. వీడియోకాన్ వాటా విక్రయంతో ఇకపై ఆ సంయుక్త రంగ సంస్థను లిబర్టీ జనరల్ ఇన్సూ్యరెన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పిలుస్తారు. బీమా వ్యాపారం నుంచి ఎందుకు నిష్క్రమిస్తున్నదీ వీడియోకాన్ తెలుపలేదు. అయితే, రుణ దాతలు బకాయిలు వసూలు కాక, దివాలా కోర్టుకు లాగిన కంపెనీల్లో అది కూడా ఒకటిగా ఉంది.



టాటా వాహన ధరలు మరింత ప్రియం

న్యూఢిల్లీ: పెరుగుతున్న ఉత్పాదక సామగ్రి వ్యయాలను కొంత భర్తీ చేసుకునేందుకు ఏప్రిల్ 1 నుంచి పాసింజర్ వాహనాల ధరల్లో రూ. 60,000 వరకు పెంపు తీసుకురానున్నట్లు టాటా మోటార్స్ మంగళవారంనాడు ప్రకటించింది. రూ. 2.28 లక్షల ప్రారంభ ధరతో జన్ ఎక్స్ నానో నుంచి రూ. 17.42 లక్షల ఖరీదు (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ) చేసే ప్రీమియం ఎస్.యు.వి హెక్సా వరకు కంపెనీ రకరకాల పాసింజర్ వాహనాలు విక్రయిస్తోంది. ''పెరుగుతున్న ఉత్పాదక సామగ్రి వ్యయాలు, మారుతున్న మార్కెట్ పరిస్థితులు, వివిధ బాహ్య ఆర్థిక అంశాలు మేం ధరల పెరుగుదల అంశాన్ని పరిశీలించక తప్పని స్థితి కల్పించాయి'' అని టాటా మోటార్స్, పాసింజర్ వాహన వ్యాపార విభాగ అధ్యక్షుడు మయాంక్ పరీక్ చెప్పారు. ''టియాగో, హెక్సా, టిగోర్, నెక్సాన్ వంటి శక్తిమంతమైన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో''ని ఆలంబనగా చేసుకుని రానున్న ఏడాదిలో కంపెనీ వృద్ధి పథంలో కొనసాగగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ ఆడి వాహనాల ధరల్లో రూ. లక్ష నుంచి రూ. 9 లక్షల వరకు పెంపుదల తీసుకువస్తున్నట్లు గత వారం ప్రకటించింది. బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకాన్ని పెంచినందువల్ల ఏప్రిల్ 1 నుంచి ఈ ధరల పెంపును అమలులోకి తీసుకువస్తున్నట్లు ఆడి తెలిపింది.

నష్టాలకు ఎట్టకేలకు బ్రేక్

ఎటువైపూ ఎక్కువ మొగ్గకుండా పెరుగుతూ, తగ్గుతూ సాగిన ట్రేడింగ్‌లో సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి

ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' మంగళవారం నాడు నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ట్రేడింగ్‌లో, ఐదు సెషన్లలోని పతన ధోరణిని పక్కన పెట్టి స్వల్ప లాభాలను నమోదు చేయగలిగింది. ప్రపంచంలోని ఇతర స్టాక్ మార్కెట్ల నుంచి సంకేతాలు మిశ్రమంగా ఉండగా, ఇటీవల బాగా దెబ్బతిన్న సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి) రంగ షేర్ల కొనుగోలు పట్ల మదుపరులు మొగ్గు చూపారు. 30 షేర్ల 'సెన్సెక్స్' సుమారు 74 పాయింట్లు పెరిగి 32,996.76 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ)కి చెందిన మరింత విస్తృతమైన 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 30 పాయింట్లు లాభపడి 10,124.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఇటీవల దెబ్బతిన్న షేర్లలో 'వాల్యూ బయింగ్' (అంతర్లీనంగా ఎక్కువ విలువ కలిగిన షేర్లు తక్కువ ధరలకు లభిస్తున్నప్పుడు వాటిని ఎంపిక చేసి కొనుగోలు చేయడం)తో మార్కెట్లు ప్రయోజనం పొందాయి. విదేశాల నుంచి సంకేతాలు మిశ్రమంగా ఉన్నాయి. ఫెడరల్ రిజర్వ్ నూతన ఛైర్మన్ జిరోమ్



పోవెల్ మొదటి విధాన సమావేశంలో తీసుకునే నిర్ణయంపై మదుపరులు దృష్టి కేంద్రీకరించారు. ప్రపంచ వాణిజ్య యుద్ధ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఐ.టి, టెలికాం షేర్లు రికవరీకి నేతృత్వం వహించడంతో, తొలి దశ నష్టాల నుంచి 'సెన్సెక్స్' బయటపడి ఒక దశలో 33,102.74 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. కరెంట్ అకౌంట్ లోటు వ్యత్యాసం పెరగడం, అమెరికా ఫెడ్ రేటు పెంపునకు ఉన్న అవకాశంపై ఆందోళనలతో ఇంతకుముందు ఐదు సెషన్లలో 'సెన్సెక్స్' 994.82 పాయింట్లు నష్టపోయింది. 'నిఫ్టీ' 10,100 స్థాయిని మళ్ళీ అందుకుని 30.10 పాయింట్ల లాభంతో చివరగా 10,124.35 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు 10,155.65 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. ''బలహీనపడిన రూపాయి కారణంగా, ఐ.టి, ఫార్మా షేర్లలో షార్ట్ కవరింగ్ (పతనమై తిరిగి పెరగడం ప్రారంభించిన షేర్లు ఇంకా పెరుగుతాయని భావించి నష్టాలను తగ్గించుకునేందుకు కొనుగోలు చేయడం)తో సూచీలు సానుకూల దృక్పథంతో ముగిశాయి'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ అన్నారు. కేసులో ఇరుక్కున్న కెనరా బ్యాంక్ షేర్ ధర మంగళవారం నాడు 3.84 శాతం క్షీణించింది.

తారుమారైన ధోరణి

కొద్ది రోజులుగా అమ్మకాల పరంపరను కొనసాగిస్తూ వచ్చిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు, తాత్కాలిక డాటా ప్రకారం, సోమవారం నాడు, రూ. 292.23 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ మదుపు సంస్థలు రూ. 191.52 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించాయి.

జన్యు రుగ్మతలకూ క్లైములు వర్తిస్తాయి

- **ఢిల్లీ హైకోర్టు తీర్పు ననుసరించి ఆరోగ్య బీమా కంపెనీలను ఆదేశించిన ఐ.ఆర్.డి.ఎ.ఐ**

హైదరాబాద్: మినహాయింపులను ప్రాతిపదికగా చేసుకుని జన్యుపరమైన రుగ్మతలకు సంబంధించి వచ్చిన క్లైములను తిరస్కరించవద్దని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐ.ఆర్.డి.ఎ.ఐ) బీమా సంస్థలను ఆదేశించింది. ఈ అంశానికి సంబంధించి యునైటెడ్ ఇండియా ఇన్సూ్యరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు జై ప్రకాశ్ తయాల్‌కు మధ్య నడిచిన కేసులో ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు నిచ్చింది. బీమా పాలసీలో 'జన్యుపరమైన రుగ్మతలకు' సంబంధించిన పరిహరణ క్లాజు ''మరీ విస్తృతంగా, అస్పష్టంగా, వివక్షతో కూడినదిగా ఉంది. కనుక, అది భారత రాజ్యాంగంలోని 14వ అధికరణాన్ని ఉల్లంఘిస్తున్నట్లు లెక్క'' ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. బీమా కాంట్రాక్టులలోని మినహాయింపు క్లాజులను పునఃపరిశీలించాలని ఐ.ఆర్.డి.ఎ.ని ఆదేశించింది. మినహాయింపులను ప్రాతిపదికగా చేసుకుని జన్యుపరమైన రుగ్మతలకు సంబంధించిన క్లైములను బీమా కంపెనీలు తిరస్కరించకుండా చూడవలసిందని హైకోర్టు ఐ.ఆర్.డి.ఎకి సూచించింది. ఆరోగ్య



బీమా కాంట్రాక్టులను ఆఫరు చేసే ఏ సంస్థ అయినా సరే జన్యుపరమైన రుగ్మతకు సం బంధించిన మినహాయింపులను ఆధారం చేసుకుని ఇప్పుడున్న ఏ ఆరోగ్య బీమా పాలసీలకు సంబంధించి అయినా సరే ఏ క్లైమునూ తిరస్కరించడానికి లేదని, గౌర వనీయ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఆరోగ్య బీమా కంపెనీలను ఆదేశించడమైనది'' అని ఐ.ఆర్.డి.ఎ ఒక ఉత్తర్వులో పేర్కొంది. నూతన ఆరోగ్య బీమా పాలసీలు, ఇప్పటికే ఉన్న ఆరోగ్య బీమా పాలసీలు, ఆరోగ్య బీమా వ్యాపారంలో ప్రాడక్ట్ ఫైలింగ్‌పైన జారీ అయిన మార్గదర్శక సూత్రాల నిబంధనల కింద దాఖలైన క్లైములోకానీ జన్యుపరమైన రుగ్మతలను మినహాయింపులలో ఒకటిగా చేర్చవద్దని నియంత్రణ సంస్థ అన్ని బీమా కంపెనీలనూ ఆదేశించింది.


ఇసుక తవ్వకాలకు నిబంధనావళి

న్యూఢిల్లీ: అందరితోను తీవ్రంగా సంప్రదింపులు జరిపిన పిమ్మట ఇసుక తవ్వకాలకు సంబంధించి రూపొందించిన నియమావళిని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆవిష్కరించింది. డిమాండ్, సరఫరా కొరత, అక్రమ తవ్వకాలతో సహా ఇసుక తవ్వకాలకు సంబంధించిన సమస్యలను ఎదుర్కోవడంలో ఈ నిబంధనావళి రాష్ట్రాలకు సహాయపడగలదని భావిస్తున్నారు. గనులు, ఖనిజాలపై ఇక్కడ ఏర్పాటైన మూడవ జాతీయ సమావేశంలో కేంద్ర గనుల శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ 'శాండ్ మైనింగ్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రారంభించారు. ''ఇసుక తవ్వకాల నిబంధనావళి నొకదానిని తయారు చేశాం. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో, ఈ అంశంతో ప్రమేయం ఉన్న ఇతరులతో తీవ్రంగా సంప్రదింపులు నిర్వహించిన తర్వాత ఈ ఫ్రేమ్‌వర్క్ రూపొందించాం'' అని తోమర్ చెప్పారు. గృహ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు, నిర్మాణ కార్యకలాపాలకు ముఖ్యమైన వస్తువు ఇసుకేనని ఆయన అన్నారు. అయితే, ఇసుక తవ్వకాలకు సంబంధించి దేశంలో అనేక ప్రాంతాల్లో పర్యావరణ క్షీణత, ఇసుక దొరక్కపోవడం, ఇసుక ధరలు అధికంగా ఉండడం, అక్రమ ఇసుక తవ్వకాలు వంటి వివిధ సమస్యలు తలెత్తాయని ఆయన చెప్పారు. రాష్ట్రాలు తమ లక్ష్యాలు, ధర్మాదాయాలు, ప్రభుత్వ వనరులు వంటి వాటిని దృష్టిలో పెట్టుకుని సొంత విధానాలు రూపొం దించుకునేందుకు ఈ నిబంధనావళి సహాయపడుతుందని తోమర్ అన్నారు. వేలం ప్రక్రియను సులభతరం చేసేందుకు, ఖనిజాల బ్లాకులను వేగంగా వేలం వేయడానికి రాష్ట్రాలకు సహాయపడేందుకు 2015 నాటి ఖనిజ వేలం నిబంధనలను ప్రభుత్వం 2017 నవంబరులో సవరించిందని మంత్రి చెప్పారు. వేలం వేసిన బ్లాకుల నుంచి లీజు కాలంలో రాష్ట్రాలకు లభించే మొత్తం రాబడి రూ. 1,43,893 కోట్ల మేర ఉందని ఆయన చెప్పారు. నిబంధనలు సవరించిన తర్వాత, మూడు నెలల్లోనే 41 ఖనిజ బ్లాకులు వేలానికి వచ్చాయని తెలిపారు.

పెరిగిన ప్రైవేటు రంగ వాటా

న్యూఢిల్లీ: ఇంధన ధరపై నియంత్రణను 2014 నుంచి తొలగించినప్పటి నుంచి దేశ ఇంధన రిటైలింగ్ విభాగంలో ప్రైవేటు రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తమ వాటాను అనేక రెట్లు పెంచుకున్నాయి. ''2002 మార్చిలో రవాణా ఇంధనాలను మార్కెట్ చేసేందుకు అధికారాన్ని మంజూరు చేసే విధానాన్ని ప్రకటించిన పర్యవసానంగా, రిటైల్ వ్యాపారంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించాయి'' అని పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్ సభకు ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమకూర్చిన సమాచారం ప్రకారం, 2017-18 ఆర్థిక సంవత్సరంలో డీజిలు రిటైలింగులో ప్రైవేటు కంపెనీల మార్కెట్ వాటా 8.2 శాతానికి పెరిగిందని ప్రధాన్ చెప్పారు. అది 2015-16 ఆర్థిక సంవత్సరంలో 3.1 శాతంగా ఉంది. పెట్రోలు రిటైలింగులో 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు కంపెనీల వాటా 6.8 శాతంగా ఉంది. అది 2015-16 ఆర్థిక సంవత్సరంలో 3.5 శాతంగా ఉంది. పెట్రోలు ధరలపై నియంత్రణను 2010 జూన్‌లో, డీజిలుపై నియంత్రణను 2014 అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది.

కెనరా మాజీ సీఎండీపై సి.బి.ఐ కేసు



న్యూఢిల్లీ: వంచన, ఫోర్జరీలకు సంబంధించి కెనరా బ్యాంక్ మాజీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కె. దుబెపై, అప్పటి మరో ఇద్దరు కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపైన కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) సోమవారం అభియోగ పత్రాన్ని దాఖలు చేసింది. బ్యాంక్ 2013లో మంజూరు చేసిన రుణంలో రూ. 68 కోట్ల మేర రుణ ఎగవేతకు సంబంధించి వారు ఆ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో దుబెపైన, అప్పటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (అశోక్ కుమార్ గుప్తా, వి.ఎస్. కృష్ణ కుమార్), అకేషనల్ సిల్వర్ కంపెనీ లిమిటెడ్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్ల (కపిల్ గుప్తా, రాజ్ కుమార్ గుప్తా)పైన సి.బి.ఐ తీస్ హజారీ కోర్టులో చార్జి షీటు దాఖలు చేసింది. దుబెకు పరిచయమున్న గుప్తాలు, ఆ స్నేహాన్ని అడ్డుపెట్టుకుని రుణాలు సంపాదించారని సి.బి.ఐ ఆరోపించింది. కమలా నగర్‌లోని ఆ కంపెనీకి రుణాన్ని మంజూరు చేయడంలో అనుకూలత చూపవలసిందిగా కోరుతూ కింది అధికారులకు దుబె పంపిన ఎస్.ఎం.ఎస్ మెసేజీలు తన వద్ద ఉన్నాయని సి.బి.ఐ తెలిపింది. 2013 డిసెంబరులో రుణాన్ని మంజూరు చేసిన మూడు నెలల లోపలే మొత్తం రుణాన్ని పంపిణీ చేసినట్లు సి.బి.ఐ తెలిపింది. పంపిణీ అయిన కొద్ది నెలలకే ఆ రుణాలు 2014 సెప్టెంబరులో నిరర్థక ఆస్తులుగా పరిణమించాయని సి.బి.ఐ వెల్లడించింది.



ఎంబీబీఎస్/ బీడీఎస్ చేయాలనుకునే ప్రతి విద్యార్థికీ ముఖ్యమైన పరీక్ష నీట్. ఇది మే 6న జరుగుతుంది. ఈ ఏడాది నుంచి రెండు తెలుగు రాష్ట్రాలూ నేషనల్ పూల్‌లోకి వెళ్లడం వల్ల మన రాష్ట్రాల కన్వీనర్ కోటాలోని మెడికల్, డెంటల్ సీట్లలో 15% ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇవ్వాలి. అలాగే ఇతర రాష్ట్రాల్లోని 15% సీట్లకు మన విద్యార్థులు పోటీ పడవచ్చు. ఈ పరిస్థితుల్లో గత సంవత్సరాలకంటే మెరుగ్గా కృషి చేయాల్సిందే!

నీట్‌తో సీటు!

ఇంటర్ పరీక్షలు పూర్తయి, పోటీపరీక్షల సన్నద్ధత వేగం పుంజుకుంటోంది. బైపీసీ విద్యార్థులు రాసే ముఖ్య పరీక్షలు నీట్, ఎంసెట్. కొంతమంది ఎయిమ్స్, జిప్‌మర్ పరీక్షలు కూడా రాస్తున్నారు. ఎయిమ్స్ మే 26, 27 తేదీల్లో, జిప్‌మర్ జూన్ 3న జరుగుతుంది. కనీసం 720 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 550 మార్కులకుపైగా వస్తేనే.. 2018లో మెడికల్ కళాశాలలో ఎ- కేటగిరీ సీట్లలో చేరే అవకాశం ఉంటుంది. ఈ అవగాహన ఏర్పరచుకుని సరైన ప్రణాళికతో ఈ 45 రోజులు తయారు కాగలిగితే సులభంగా సీటు సాధించుకోవచ్చు. నేషనల్ పూల్‌కి వెళ్లడం వల్ల ఓపెన్ కేటగిరీ విద్యార్థులు నష్టపోతారు కానీ రిజర్వేషన్ (ఎస్సీ, ఎస్టీ) విద్యార్థులకు అదనంగా కొంత మేలు జరుగుతుంది.

అంటే వారు ఇతర రాష్ట్రాల్లోని సీట్లను తక్కువ మార్కులకే పొందే అవకాశముంది. 12 లక్షల మంది రాస్తున్న నీట్‌లో 550/720 మార్కులు తెచ్చుకోవాలంటే ప్రతిరోజూ ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకుని వెళ్ళాల్సిందే.





సగభాగం బయాలజీదే!

2018లో జరగబోయే నీట్‌లో బయాలజీ నుంచి మొత్తం 90 ప్రశ్నలు ఉంటాయి. బోటనీ, జువాలజీ సమంగా ఉండాల్సిన అవసరం లేదు. గత రెండేళ్లుగా బోటనీ నుంచి ప్రశ్నలు ఎక్కువ వస్తున్నాయి. కాబట్టి సుమారుగా 50, 40గా తీసుకోవచ్చు. ప్రతి సరైన సమాధానానికీ 4 మార్కులు కాబట్టి బయాలజీలో 360 మార్కులు సంపాదించుకోవచ్చు. 720 మార్కులకు జరిగే నీట్‌లో సగభాగం బయాలజీదే. దీనిలో సాధారణంగా చదివే విద్యార్థి జాగ్రత్త వహిస్తే 300కుపైగా మార్కులను సాధించుకోవచ్చు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలకు మాత్రమే పరిమితమైనా 320కుపైగా సాధించుకునే అవకాశం ఉంటుంది. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదువుతూ ముఖ్యాంశాలను పాఠ్య పుస్తకంలోనే అండర్‌లైన్ చేసుకోవాలి. తరువాత సీబీఎస్‌ఈ బోర్డు ప్రశ్నలను చదివితే ప్రశ్నపత్రంలో ఎలాంటి ప్రశ్నలకు ప్రాధాన్యం ఉంటుందో అవగతమవుతుంది. తెలుగు రాష్ట్ర విద్యార్థులు ఇంతవరకూ ఎంసెట్‌కు అలవాటుపడ్డారు కాబట్టి సీబీఎస్‌ఈ ప్రశ్నలను చూడటం తప్పనిసరి. అందుకే తెలుగు రాష్ట్రాల బయాలజీ పుస్తకం కంటే ఉత్తర భారతదేశ పుస్తకాలను ఎంచుకుంటే సీబీఎస్‌ఈ వారు ఎలాంటి ప్రశ్నలు ఇస్తున్నారో అర్థమవుతుంది. మన రాష్ట్రాల్లో చాలావరకు పాత ఎంసెట్ మెటీరియల్‌కు అట్టతీసి నీట్ పుస్తకంగా ప్రచురిస్తున్నారు. అలాకాకుండా నీట్‌ను దృష్టిలో ఉంచుకుని సీబీఎస్‌ఈలో అడిగే ప్రశ్నల విధానంపై అవగాహన పెంచే పుస్తకాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి చదవాలి. బయాలజీలో వివిధ చాప్టర్ల వెయిటేజీ గత సంవత్సరాల్లో కింది విధంగా ఉంది. ఈ ఏడాది కూడా స్వల్ప మార్పులతో అదే కొనసాగవచ్చు.







నీట్ బయాలజీలో జాగ్రత్తలు

- బొమ్మలను లేబుల్స్‌తో అర్థం చేసుకోవడం, గుర్తుంచుకోవడం.
- పరీక్షల్లో ఎక్కువగా అడిగే ప్రశ్నలను ఒక దగ్గర రాసుకోవడం.
- ఎక్కువగా మర్చిపోయే అంశాలను ఒక దగ్గర రాసుకోవడం.
- బహుళైచ్ఛిక ప్రశ్నలను వీలైనన్ని ఎక్కువగా అభ్యాసం చేయడం.
- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాన్ని మొదటి నుంచి చివరి వరకు క్షుణ్ణంగా చదవడం.
- సమయం తక్కువగా ఉంది. కాబట్టి సులభంగా మార్కులు సాధించే అంశాలకే ఎక్కువ సమయాన్ని కేటాయించడం మేలు. చదివే సమయంలో కనీసం 50% కాలాన్ని బయాలజీకి ఇవ్వగలిగితే ఎక్కువ లాభం చేకూరుతుంది.

నీట్ కెమిస్ట్రీలో జాగ్రత్తలు

- గ్రూపులు, వాటి ధర్మాలకు సంబంధించి టేబుల్స్ తయారు చేసుకుని ప్రతిరోజూ ఒకసారి చదవాలి.
- ఆక్సిడైజింగ్, రెడ్యూసింగ్ ఏజెంట్స్ గురించి విడివిడిగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- ఆర్గానిక్ రియాక్షన్స్‌ను వీలైనన్ని ఎక్కువసార్లు పేపర్ మీద సాధన చేయాలి.
- నీట్ సంబంధిత పుస్తకాల్లోని బహుళైచ్ఛిక ప్రశ్నలను మాత్రమే ఎక్కువగా తయారు చేసుకోవాలి.
- పరీక్షను 45 నిమిషాల వ్యవధిలో పూర్తిచేసేలా అభ్యాసం అలవరచుకోవాలి.

భౌతికశాస్త్రం పునశ్చరణ

భౌతికశాస్త్రంపై ఇప్పటికే పట్టు ఏర్పరచుకుని ఉండాలి. కానీ ఎక్కువ శాతం విద్యార్థులు ఈ సమయంలో భౌతికశాస్త్రానికి ఎక్కువ సమయాన్ని వెచ్చించి చివరికి పూర్తిగా నష్టపోతున్నారు. పోటీపరీక్షల్లో విద్యార్థి మానసిక స్థితి చాలా ప్రభావం చూపుతుంది. భౌతికశాస్త్రంపై భయంతో ఎక్కువ సమయం వెచ్చించేకొద్దీ విద్యార్థి తనపై ఆత్మవిశ్వాసం కోల్పోయి తుది పరీక్షలో అధ్వానస్థితికి పోయే ప్రమాదముంది. అందుకే ఈ తక్కువ సమయంలో ఏ అంశాలపై పట్టు ఉందో వాటికే ఎక్కువ సమయం కేటాయించాలి. వాటినే రెండు, మూడుసార్లు పునశ్చరణ చేసుకోవాలి. ఇలా ఆత్మవిశ్వాసంతో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థికి ప్రథమ సంవత్సర సిలబస్‌పై బాగా పట్టు ఉంటే మెకానిక్స్‌కి తోడుగా మోడర్న్ ఫిజిక్స్‌ని.. ద్వితీయ సంవత్సర సిలబస్‌పై పట్టు బాగా ఉంటే ఎలక్ట్రిసిటీకి తోడుగా మోడర్న్ ఫిజిక్స్‌ని బాగా అభ్యాసం చేయాలి. దీనివల్ల 45 ప్రశ్నల్లో 30కిపైగా జవాబులను తప్పకుండా గుర్తించే వీలవుతుంది. అవగాహనతో ఈ విధంగా సిద్ధమైన ఏ విద్యార్థి అయినా సులభంగా 600/720 పైగా మార్కులు తెచ్చుకోవచ్చు!

ఇప్పటినుంచే అభ్యాసం

9.8 ఐ 4 ఉంది అనుకుందాం. దానిని 10 ఐ 4గా తీసుకుని 40 కంటే కొద్దిగా తక్కువగా ఉన్న జవాబు ఏది ఉందో గమనిస్తే.. మిగిలినవి దూరంగా ఉంటే ఆ జవాబును వెంటనే గుర్తించవచ్చు. ఇటువంటి అభ్యాసం ఇప్పటినుంచే చేయాలి. ఈ సమయంలో రాని ప్రశ్నలకు ఎక్కువ సమయాన్ని వృథా చేసుకోకుండా వచ్చినవాటిని పునశ్చరణ చేసుకుంటే తుది పరీక్షలో వాడి, కచ్చితత్వం పెరుగుతాయి. కర్బన రసాయన శాస్త్రంలో మెకానిజం మీద ప్రశ్నలు ఇస్తున్నారు. ఎక్కువమంది విద్యార్థులు వాటిలోనే ఎక్కువ తప్పులు చేస్తున్నారు. ఈ చర్యల్లో రియేజంట్ ప్రాముఖ్యాన్ని సరిగా అర్థం చేసుకుంటే సులభంగా జవాబును గుర్తించవచ్చు.

రసాయనశాస్త్రంలో మార్పు

దీని మూడు విభాగాల్లో విద్యార్థి తయారీ విధానంలో స్వల్ప మార్పు ఉండాలి. అంటే భౌతిక, అకర్బన, కర్బన రసాయన శాస్త్రాలకు ఒకే పద్ధతిని పాటించడం సరి కాదు. అకర్బన రసాయన శాస్త్రంలో సిద్ధాంతపరమైన ప్రశ్నలుంటాయి. కాబట్టి సన్నద్ధమయేటపుడు దీన్ని చివరకు మిగులుస్తారు. ఇది చాలా తప్పు. ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో గ్రూపులకు సంబంధించి టేబుల్స్ చేసుకుంటూ వెళితే గుర్తుంచుకోవడం సులభమవుతుంది. భౌతిక రసాయన శాస్త్రంలో కొన్ని ఫార్ములాలు గుర్తుంచుకోవాలి. లెక్కించడం త్వరగా చేయడం అభ్యసించాలి.

విదేశీ విద్యకు విధానాలు!



ఉన్నతవిద్యను విదేశాల్లో చదవాలని కలలు కనే భారతీయ విద్యార్థులు ఎందరో! దాన్ని సాకారం చేసుకునే ప్రయత్నాలు ఆరంభించటానికి ఈ అక్టోబరు నెల సరైన తరుణం. ఇక్కట్లేమీ పడకుండా సుదూర విద్యాసంస్థల్లో ప్రవేశించి, సాఫీగా విద్యాభ్యాసం చేయాలంటే గమనించాల్సిన అంశాలేమిటి? సన్నద్ధతకు ప్రాతిపదికగా ఏమేం తెలుసుకోవాలి? మనదేశంలో నాణ్యమైన విద్యను అందించే ప్రముఖ విద్యాసంస్థలు తక్కువ. వాటిలోనూ సీట్లకోసం విపరీతమైన పోటీ. ఈ పరిస్థితులు విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాలను వెదికేలా చేస్తోంది. విదేశీ విద్య వాటిలో ఒకటి. ఉత్తమశ్రేణివిద్యాబోధనకూ, తద్వారా జీవితంలో మంచి స్థితిలో స్థిరపడటానికీ ఆస్కారం కలుగుతుంది కాబట్టే వ్యయప్రయాసలకోర్చి మన విద్యార్థులు సరిహద్దులు దాటుతున్నారు. దీనికోసం- టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ లాంటి ప్రీ రిక్విజిట్ పరీక్షల్లో స్కోరు తెచ్చుకోవటం, ఇతరదేశాల్లోని విద్యాసంస్థలను ఎంచుకోవటం, వాటికి దరఖాస్తు చేసుకుని, ప్రవేశం పొందటం, వీసా ఇంటర్వ్యూకు హాజరై నెగ్గటం.. ఇదంతా సుదీర్ఘ ప్రక్రియ. ఇదంతా పెద్ద శ్రమ కాక విదేశాలకు వెళ్ళి ఇంజినీరింగ్, ఎంబీఏ, సైన్స్, ఫైనార్ట్స్, ఇతర పీజీ కోర్సులు చదువుకోవడం సగటు విద్యార్థికి ఆర్థికంగా భారమే. ఇదొకరకంగా విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు పెట్టే పెట్టుబడి. చాలా దేశాలు విద్యాభ్యాసం తర్వాత అక్కడే ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పిస్తున్నాయి. దీనివల్ల విద్యారుణాలను సులువుగా తీర్చివేయగలుగుతున్నారు. జీవితంలో స్థిరపడగలుగుతున్నారు. విద్యార్థులు పీజీలో తమకు తగిన కోర్సునూ, దాన్ని చదవదల్చిన దేశాన్నీ ఎంచుకోవటం చాలా ముఖ్యం. అలాగే ప్రవేశాలకు అవసరమైన వివిధ టెస్టులకూ, డాక్యుమెంటేషన్ తయారీకీ సిద్ధమవ్వాలి.

ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో ప్రత్యేకతలు!



ప్రపంచాన్ని సమూలంగా మార్చేస్తున్న ఎలక్ట్రానిక్స్ రంగ ంలో అద్భుతమైన అభివృద్ధి వల్ల విభిన్న స్పెషలైజేషన్లతో దూసుకుపోతోంది. అభ్యర్థికి అపార అవకాశాలను అందించే ఈ కోర్సులను అమెరికాలోని ఎన్నో ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఆఫర్ చేస్తున్నాయి. మన విద్యార్థులు తమ అభిరుచులూ, ప్రావీణ్యాలూ బేరీజు వేసుకుని ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్లతో పీజీ చేస్తే వారికిక ఆకాశమే హద్దు! యూఎస్‌లో అందుబాటులో ఉండే సరికొత్త ఎలక్ట్రానిక్స్ కోర్సులూ, వాటి విశేషాలను పరిశీలిద్దాం! ఎలక్ట్రానిక్స్ వినియోగం మన నిత్య జీవితంలో ఒక భాగమైపోయింది. ఇది లేకుండా ఈ ప్రపంచాన్ని ఊహించడమూ కష్టమే. వంట నుంచి సంగీతం వరకూ ఉపయోగించే పరికరాలూ, స్టవ్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్.. ఇలా మనం వాడేవన్నీ ఎలక్ట్రానిక్స్‌వే. ఆటోమోటివ్ ఇంజిన్స్ నుంచి ఆటోమేటెడ్ ఎక్విప్‌మెంట్ వరకూ అన్ని శ్రేణి పరికరాల ప్రొడక్షన్ సెట్టింగుల్లో ఎలక్ట్రానిక్ సాంకేతికతనే ఉపయోగిస్తున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను ఆరోగ్య రంగంలో రోగనిర్ధారణ, చికిత్సకు సంబంధించిన పరిశోధనలు,వ్యాధుల నివారణోపాయాలతోపాటు జన్యుసంబంధమైన వాటికీ ఉపయోగిస్తున్నారు. మంచి ఉద్యోగావకాశాలు, జీతం, నిరంతర పరిశ్రమ అభివృద్ధి కారణంగా ప్రతి రెండో విద్యార్థీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదవాలని కోరుకుంటున్నాడని అధ్యయనాలు చెపుతున్నాయి. సొంత ఆలోచనలను అద్భుతమైన సాంకేతికాభివృద్ధిగా మలచడంలో ఈసీఈ ఇంజినీర్లు ముందుంటున్నారు. ఇటువంటి విధులకు లోతైన పరిజ్ఞానం అవసరమవుతుంది. ఈ కారణంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో కొన్ని ఉపశాఖలు ఏర్పడ్డాయి. ఈ రంగానికి యూఎస్ఏలో ఎంతో విలువ ఏర్పడి విస్తృత అవకాశాలు పెరిగాయి. అమెరికాలో ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన పీజీ స్పెషలైజేషన్లలో మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ ఫోటానిక్స్, నానో టెక్నాలజీ, బయో మెడికల్ ఇమేజింగ్, బయో ఇంజినీరింగ్ అండ్ అకాస్టిక్స్ (బీఐబీఏ), పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్, రోబోటిక్స్, స్పిన్‌ట్రానిక్స్ ఎంతో ప్రాచుర్యం పొందాయి.

మెప్పించే ఎస్ఓపీ



మనదేశంలోని ప్రసిద్ధ విద్యాసంస్థల్లో, విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునేవారు స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ) ను రాయటం తప్పనిసరి. ఇది విద్యార్థి తన కెరియర్ ప్రణాళిక, లక్ష్యాల గురించి సమర్పించే కీలక పత్రం. దీని ప్రాధాన్యం దృష్ట్యా మెరుగైనరీతిలో దీన్ని రాయటానికి ప్రయత్నించాలి! ఎస్ఓపీ అనేది విద్యార్థి వ్యక్తిత్వాన్ని చాటే, ఉన్నత లక్ష్యాలను తెలిపే విశేషాంశాల సమాహారం. నిజాయతీ దీనికి ప్రాణం. అతడిలో ఉన్న చురుకుదనం, జ్ఞానతృష్ణలను ప్రస్ఫుటంగా తెలిపేలా ఉండాలి. ఇది దరఖాస్తులో ఒక భాగం మాత్రమే. అడ్మిషన్ కమిటీతో నేరుగా సంభాషించేందుకు ఎస్ఓపీ ఒక అవకాశమని గుర్తుంచుకోవాలి. వివిధ కోర్సులూ, గ్రేడ్లూ, టెస్ట్ స్కోర్లూ, ఇతర గణాంకాల ద్వారా కాకుండా కమిటీకి విద్యార్థిని ఒక వ్యక్తిగా సన్నిహితం చేసేందుకు సాయపడుతుంది. ఎస్ఓపీ రాసేముందు విద్యార్థికి తన గురించి తనకు పూర్తి అవగాహన ఉండాలి. కళాశాల అడ్మిషన్ సిబ్బంది విద్యార్థి రాసే వ్యాసం ద్వారా అతడి గురించి అంచనాకు వస్తారు. అందుకే తన జీవితం చుట్టూ ఆసక్తికరమైన కథను అల్లటానికి ప్రయత్నించాలి. ఇప్పటికే అరిగిపోయివున్న ఆలోచనలను ఉపయోగించటం మానెయ్యాలి. అందుకని వ్యక్తిగత అనుభవాలను పంచుకోవటానికి ప్రయత్నించాలి. విజయాలూ, చేసిన మంచి పనులూ, స్ఫూర్తిదాయకమైన అంశాలూ ఉండేలా చూసుకోవాలి. రచనా శైలి ద్వారా మెప్పించటం మంచిదే. కానీ గిమిక్కులు చేయకూడదు. సహజంగా, కొంత స్వేచ్ఛగా, సొంత అనిపించే రీతిలో వాక్యనిర్మాణం చేయటానికి ప్రయత్నించాలి. భాషాపరంగా మరీ నిర్లక్ష్యంగా కనిపించే పొరపాట్లు చేయకూడదు. వ్యాకరణపరంగా కూడా పెద్ద దోషాలు దొర్లకుండా జాగ్రత్తపడాలి. ఇలాంటివి విద్యార్థిపై మంచి అభిప్రాయం కలగనీయవు. రాసిన ఎస్ఓపీ ఎలా ఉందో తెలిసిన అధ్యాపకులకు చూపించవచ్చు. వారి అభిప్రాయాలమేరకు అవసరమైతే సవరించటం మంచిది. మెరుగైన ప్రతి వచ్చేవరకూ కృషిచేయాల్సిందే.

ఆసక్తి ఉంటే సరిపోదు!

అమెరికా లాంటి దేశాల్లో చదువుకోవాలనే అభిలాష ఉంటేనే సరిపోదు. చేరబోయే కోర్సు, విశ్వవిద్యాలయాలపై కనీస పరిజ్ఞానం, అవగాహన పెంచుకోవాలి. ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే వీసా దశలోనూ, అది మంజూరై విమానం దిగాక కూడా ఇమిగ్రేషన్ అధికారులు వేసే ప్రశ్నల దగ్గరా తడబడాల్సివస్తుంది. అన్నీ సిద్ధం చేసుకుని స్వదేశానికి తిరుగుముఖం పట్టాల్సిరావటం లాంటి చేదు అనుభవాలకు తావివ్వకుండా విద్యార్థులు ముందే జాగ్రత్తపడాలి! ఎం.ఎస్. విద్యాభ్యాసం కోసం అడ్మిషన్ లభించిందిబీ వీసా మంజూరైంది. ఇక 'యు.ఎస్.లో చేరిపోవటమే' అనే భరోసాతో నిర్లక్ష్యం వహించకూడదు. యు.ఎస్.లో విమానం దిగాక ఇమిగ్రేషన్ అధికారులు చేసే ఇంటర్వ్యూ (పోర్ట్ ఆఫ్ ఎంట్రీ)లో కూడా సరైన సమాధానాలు ఇవ్వాల్సివుంటుంది. ఇంతదూరం ప్రయాణమై వచ్చిన విద్యార్థులకు తాము ప్రవేశించబోయే ప్రోగ్రాం/కోర్సుపై తగిన అవగాహన, శ్రద్ధ ఉన్నాయో లేదో ఇమిగ్రేషన్ అధికారులు గమనిస్తున్నారు. విద్యాభ్యాసమే వారి ప్రధాన ఉద్దేశం గానీ, 'సంపాదన' కాదని రూఢి చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.







రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందు కుంటున్న బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్, టెన్నిస్ ప్లేయర్ సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్

షమి అపుడు దుబాయిలో ఉన్నది నిజమే

కోల్‌కతా పోలీసుల లేఖకు బీసీసీఐ సమాధానం



ముంబాయి : టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమిపై భార్య జహాన్ చేసిన ఆరోపణల వ్యవహారంలో విచారణ వేగంగా సాగుతోంది. దక్షిణాఫ్రికా పర్యటన తర్వాత షమి దుబాయి వెళ్లాడని, అక్కడ పాకిస్తాన్‌కు చెందిన అలిస్బా అనే మహిళ నుంచి డబ్బులు తీసుకున్నాడని షమి భార్య జహాన్ ఆరోపించింది. దీనిపై విచారణలో భాగంగా షమి దక్షిణాఫ్రికా పర్యటన వివరాలు ఇవ్వాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాశారు. ఈ లేఖపై బీసీసీఐ కోల్‌కతా పోలీసులకు సమాధానమిచ్చింది. ఫిబ్రవరి 17, 18 తేదీల్లో షమి దుబాయిలో ఉన్నట్టు లేఖలో బీసీసీఐ అధికారులు వివరించారు. బీసీసీఐ నుంచి సమాచారం అందుకున్న కోల్‌కతా పోలీసులు విచారణను ముమ్మురం చేశారు. బీసీసీఐ ఇచ్చిన సమాచారం ఆధారంగా తదుపరి విచారణ కొనసాగుతుందని కోల్‌కతా పోలీసు అధికారి ప్రవీణ్ త్రిపాఠి తెలిపారు. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం షమి భారత్‌కు తిరుగుపయనమయ్యాడు. వన్డే, టి20లకు ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కకపోవడంతో షమి దక్షిణాఫ్రికా నుంచి భారత్ బయల్దేరి దుబాయిలో రెండు రోజులున్నాడని జహాన్ ఆరోపిస్తోంది.

అరెస్ట్ చేసేందుకు సహకరించండి : జహాన్

షమి అరెస్ట్ చేసేలా సహకరించాలని అతని భార్య హసీన్ జహాన్ మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా ఆమె కోల్‌కతా మెజిస్ట్రేట్‌లో వాదనలు వినిపించారు. 'నా కీర్తి, మర్యాదలను ఈ కేసులో ఫణంగా పెట్టి మరి పోరాడుతున్నాను. షమీ, అతని సోదరుడు నా పట్ల అసభ్యంగా ప్రవర్తించినప్పటికి కుటుంబం కోసం ఇన్నాళ్లు ఓపిక పట్టాను. షమిపై పోరాటం మొదలు పెట్టినప్పటి నుంచి మీడియా నన్ను పాయింట్ అవుట్ చేస్తోంది. ఈ హింసను ఓ మహిళగా నేనెందుకు తట్టుకోవాలి? చేతులెత్తి నమస్కరిస్తున్నా.. దయచేసి ఈ కేసులో నాకు మద్దతివ్వండి. ఎందుకంటే ఇది చిన్న కేసు కాదు. ఓ మహిళా గౌరవ, మర్యాదలపై జరుగుతున్న పోరాటం. షమీ నా గౌరవ, మర్యాదలను నాశనం చేశాడు' అని వేడుకున్నారు. అలిష్బా అభిమాని కాదు. అలా అని స్నేహితురాలు కూడా కాదు. మంచి క్యారెక్టర్ ఉన్న మహిళ ఎవరైన ఒక పెళ్లైన వ్యక్తితో కలిసి హోటల్ గదిలోకి వెళ్తుందా.. అని జహాన్ ప్రశ్నించింది. ప్లాన్ ప్రకారమే ఆమె నా కుంటుంబాన్ని నాశనం చేస్తుందని ఆరోపించింది.

ఇలాగైతే... ఎలా!

మహిళా క్రికెట్ జట్టు బలోపేతానికి బీసీసీఐ ప్రణాళిక



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో చేతిలో వన్డే చాంపియన్‌షిప్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు ఘోర పరాజయం తర్వాత బీసీసీఐ కీలక నిర్ణయం దిశగా అడుగులేస్తోంది. మహిళా క్రికెట్ జట్టును మరింత బలోపేతం చేసేందుకు, యువ ప్లేయర్లను ప్రోత్సహించేందుకు చర్యలు ప్రారంభించింది. దేశవాళీ మహిళా క్రికెట్‌ను గాడినపెట్టటంతో ప్రధాన జట్టుకు తోడుగా మరో జట్టును ఎంపిక చేయాలని బీసీసీఐ భావిస్తోంది. ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న యువ పేస్ బౌలర్లు, స్పిన్నర్లు, వికెట్ కీపర్లను జాతీయ క్రికెట్ అకాడమీలో పరిశీలించాలని సెలెక్టర్లను కోరింది. ఇటీవల వడోదరలో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లోభారత జట్టు 0–3 తేడాతో చిత్తుగా ఓడిపోయింది. ఆస్ట్రేలియా జట్టు చేతిలో ఘోర పరాజయంపై సమీక్షించేందుకు పాలక మండలి సభ్యులు డయానా ఎడుల్జి, మిథాలీ రాజ్ (వన్డే కెప్టెన్), హర్మన్ ప్రీత్ కౌర్ (టి20 కెప్టెన్), హేమలతా (సెలక్షన్ కమిటీ చీఫ్), ప్రొఫెసర్ రత్నాకర్ శెటి (కన్వీనర్)లు ఈ నెల 28న సమావేశమవుతారు. ఈ సమావేశంలో మహిళా క్రికెట్ జట్టును బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను కూడా చర్చిస్తారు. మహిళల జట్టులో మరింత సత్తా ఉన్న పేస్ బౌలర్లు, స్పిన్నర్లు అవసరముంది, బ్యాటింగ్ విభాగంలోనూ భారత జట్టు బలపడాలి అని డయానా ఎడుల్జీ తెలిపారు. మహిళా క్రికెట్‌కు ఆదరణ అంతకంతకూ పెరుగుతోందని, అయితే మరింత శక్తింతమైన క్రికెటర్లను తయారు చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామని ఎడుల్జీ అన్నారు.

రబడాకు లైన్ క్లియర్

నిషేధం ఎత్తేసిన ఐసీసీ



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కాగిసో రబడాపై రెండు టెస్టుల నిషేధాన్ని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఎత్తివేసింది. దీంతో గురువారం నుంచి ఆస్ట్రేలియాతో కేప్ టౌన్‌లో జరిగే మూడో టెస్ట్‌లో ఆడేందుకు రబడాకు లైన్ క్లియర్ అయింది. పోర్ట్‌ఎలిజిబెత్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌ను ఉద్దేశపూర్వకంగా ఢీ కొట్టాడని రబడాపై ఐసీసీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానాతో పాటు ఐసిసి ప్రవర్తనా నియమావళి లెవల్–2ను ఉల్లంఘించినందుకు మూడు డిమెరిట్‌పాయింట్లను కేటాయించింది. ఈ సిరీస్‌కు ముందే ఐదు డిమెరిట్ పాయింట్లు తన ఖాతాలో ఉన్న రబడా తాజాగా వచ్చిన మూడు డిమెరిట్ పాయింట్లతో మిగతా రెండు టెస్ట్‌లు ఆడే అర్హత కోల్పోయాడు. ఇక రబడాపై ఐసిసి చర్యలపై దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో మెట్టుదిగిన ఐసీసీ నిషేధంపై అప్పీల్ చేసుకోవచ్చని రబడాకు అవకాశం ఇచ్చింది. ఈ వ్యవహారాన్ని విచారించేందుకు న్యూజిలాండ్‌కు చెందిన మైక్ హెరాన్‌ను జ్యుడిషియల్ కమిషనర్‌గా నియమించింది. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన హెరాన్ రబడా మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించడంతో పాటు ఒక డిమెరిట్ పాయింట్ కేటాయిస్తున్నట్టు ప్రకటించాడు. స్మిత్‌ను రబడా ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టినట్టు తాను భావించటం లేదని అందుకే అతడ్ని వదిలేస్తున్నామని హెరాన్ చెప్పాడు. అయితే క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినందుకు రబడాకు 25 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్నట్టు చెప్పారు.

టి20 చాంపియన్స్ ట్రోఫీకి భారత్ విముఖత

న్యూఢిల్లీ : చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ విషయంలో భారత్ క్రికెట్ బోర్డు (బీసీసీఐ), ఇంటర్నేషనల్ క్రికెట్ కంట్రోల్ బోర్డు మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. రకరకాల కారణాలతో 2021లో భారత్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ ఫార్మాట్‌ను మార్చాలన్న ఐసిసి ప్రతిపాదనను బీసీసీఐ తిరస్కరించి షాక్ ఇచ్చింది. టి20 గేమ్‌లకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని చాంపియన్స్ ట్రోఫీని 50 ఓవర్ల ఫార్మాట్‌కు బదులు 20 ఓవర్ల ఫార్మాట్లో నిర్వహించాలని ఐసీసీలో కొందరు బోర్డు సభ్యులు తీవ్రంగా వత్తిడి తెచ్చారు. అయితే ఈ ప్రయత్నాలను బీసీసీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. టి20 ఫార్మాట్ ద్వారా చాంపియన్స్ ట్రోఫీ మార్కెట్ పెరిగే అవకాశముందని ఐసీసీ ఆలోచన. ఇప్పటి వరకూ వచ్చిన నష్టాల నుంచి బయటపడవచ్చని మరో అభిప్రాయం. చాంపియన్స్ ట్రోఫీకి ప్రపంచ వ్యాప్తంగా మంచి ప్రేక్షక ఆదరణ ఉంది. చివరి సారి ఇంగ్లండ్ వేదికగా జరిగిన 2017 చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ నిర్వహణకు ముందు ఐసీసీ, బీసీసీఐ మధ్య ఆదాయ పంపిణీ విషయంలో భేదాభిప్రాయాలు తలెత్తాయి. దీంతో ఆ టోర్నమెంట్‌కు భారత జట్టును పంపకూడదని నిర్ణయించింది. అయితే చివరికి మాజీల సలహాతో మెట్టుదిగిన బీసీసీఐ భారత జట్టును ఆ టోర్నమెంట్‌కు పంపింది. భారత్ నుంచి ఆదాయపు పన్ను మినహాయింపు లభించటం లేదన్న కారణలతో పాటు ఇతర కారణాలతో ఐసీసీ ఈటోర్నమెంట్‌ను భారత్‌లో కాకుండా మరో చోట నిర్వహించే ప్రయత్నాలు ప్రారంభించంతో బీసీసీఐ ఆగ్రహంతో ఉంది. తాజాగా ఐసీసీ ప్రతిపాదనను తిరస్కరించిన బీసీసీఐ ఐసీసీ చర్యలను సునిసితంగా గమనిస్తోంది. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు జగ్మోహన్ దాల్మియా ఆలోచనతో ప్రారంభమైన ఈ టోర్నమెంట్ ఫార్మాట్‌ను మార్చే ఆలోచన సరికాదు, అదే జరిగితే భారత్ నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తుందని బీసీసీఐ ప్రతినిధి తెలిపారు.



కొలంబోలో ముగిసిన నిదహాస్ కప్ టీ–20 టోర్నీ భారత జట్టుకు ఎన్నో పాఠాలు నేర్పింది. కొత్త కుర్రాళ్లతో సెలెక్టర్లు చేసిన ప్రయోగాలు మంచి ఫలితాన్నే ఇచ్చాయి. 2019 ప్రపంచ కప్ కోసం సెలెక్టర్లు ఇప్పటి నుంచే రోడ్ మ్యాప్‌ను రెడీ చేస్తుంటే.. మేము సైతం రేస్‌లో ఉన్నామంటూ యువ ఆటగాళ్లు చాలా మంది ఈ టోర్నీతో తెరపైకి వచ్చారు




ఇదే జోరు కొనసాగాలి

ఒక్క సిక్స్‌తో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన దినేశ్ కార్తీక్.. ఆఫ్ స్పిన్‌తో అదరగొట్టిన సుందర్‌లతో పాటు పలువురు యువ ఆటగాళ్లు శ్రీలంకలో ముగిసిన నిదహాస్ కప్ టి20 టోర్నీలో బ్రహ్మాండంగా రాణించారు. జట్టులో దాదాపు సుస్థిర స్థానం సంపాదించారు. వాస్తవానికి ఈ టోర్నమెంట్‌కు ముందు భారత సెలెక్టర్లు జట్టు ఎంపికకోసం సుదీర్ఘ కసరత్తే చేశారు. 2019 ప్రపంచ కప్ లక్ష్యంగా ఇప్పటి నుంచే భారత ఆటగాళ్లను సిద్ధం చేయటం కోసం ఈ సెలెక్షన్ సాగింది. పొట్టి ఫార్మాట్ అయినప్పటికీ యువ ఆటగాళ్లతో సెలెక్టర్లు పెద్ద ప్రయోగమే చేశారు. ఒకరిద్దరు మినహా మిగతా ఆటగాళ్లంతా ఈ టోర్నమెంట్ ద్వారా ఫామ్‌లోకొచ్చారు. ఏప్రిల్–మే నెలల్లో జరిగే ఐపీఎల్ ఎలా ఉన్నా...ఆ తర్వాత భారత జట్టు ఇంగ్లండ్‌లో సుదీర్ఘ పర్యటనలో ఆడుతుంది. ఇంగ్లండ్ టూర్ అనంతరం భారత జట్టు స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్ ఆడుతుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో ఆడుతుంది. ఈ మూడు సిరీస్‌లు భారత్‌కు క్లిష్టమైనవే. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో ఓడినప్పటికీ వన్డే సిరీస్, టి20ల్లో భారత్ దుమ్మురేపింది. చరిత్ర తిరగరాస్తూ సిరీస్ గెలుచుకుని సగర్వంగా స్వదేశానికి చేరుకుంది. ఇప్పుడు భారత్ ఫోకస్ అంతా భవిష్యత్‌లో ఆడబోయే సిరీస్‌లపైనే. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న జట్టుతో పాటు మరికొంత మందికి ఎలాగూ అవకాశం ఉంటుంది కనుక శ్రీలంక సిరీస్‌ను వేదికగా ఎంచుకుని పరీక్ష పెట్టింది.

ధోనీ స్థానానికి కార్తీక్ ఎసరు...

ఇప్పటికే టెస్టులకు గుడ్‌బై చెప్పిన ధోనీకి ప్రత్యామ్నాయంగా దినేశ్ కార్తీక్ సిద్ధంగా ఉన్నాడు. ఓటమి అంచుల్లో ఉన్న భారత జట్టును ఒక్క సిక్స్ కొట్టి గెలిపించి తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర చుకున్నాడు. ఈ టోర్నీ తర్వాత కార్తీక్‌పై సరికొత్త చర్చ మొదలైంది. ఇంతకాలం ధోనీ ఉండటం వల్ల కార్తీక్‌కు జట్టులో అవకాశం రాలేదు.. మరి ధోనీ జట్టులో లేనప్పుడు ఆ స్థానాన్ని భర్తీ చేయగలడనే చర్చ మొదలైంది. విశ్లేషకులంతా కార్తీక్‌కు మద్దతుగా నిలిచారు. వికెట్ కీపర్‌గా కార్తీక్‌కు ఛాన్స్ ఇవ్వాలని విశ్లేషకులు, అభిమానులు ముక్తకంఠంతో చెబుతున్నారు. భారత జట్టుకు బెస్ట్ ఫినిషర్‌గా నిలిచిన ధోని కొంత కాలం నుంచి పరుగుల వేటలో వెనకబడ్డాడు. దూకుడు తగ్గిన ధోనీ ప్లేస్‌ను కార్తీక్‌భర్తీ చేయగలడని మాజీలు అంటు న్నారు. అంత ఒత్తిడిలోనూ కార్తీక్ ప్రశాంతంగా ఆడగలగడం గొప్ప విషయం, మంచి బ్యాట్స్ మెన్‌గా మాత్రమే కార్తీక్ తెలుసు, ఇప్పుడు ఓ గొప్ప ఫిని షర్ కూడా అనిపించుకున్నాడు' అని మాజీ స్టార్ శ్రీకాంత్ అన్నాడు. ఇంత మంది అభిప్రాయాల్ని సెలెక్టర్లు గౌరవిస్తారా లేక మళ్లీ కార్తీక్‌తో ప్రయోగాలు చేస్తారో తెలుసుకోవాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే.

సవాళ్లకు సిద్ధం : సుందర్



న్యూఢిల్లీ : కొత్త కుర్రాళ్లతో శ్రీలంకలో ముగిసిన నిదహాస్ కప్ టి20 ట్రైసిరీస్‌లో భారత క్రికెట్ బోర్డు చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలనే ఇచ్చాయి. ఈ సిరీస్ ద్వారా జట్టులో సుస్థిర స్థానం పొందే అవకాశాలను చాలా మంది యువ ఆటగాళ్లు మెరుగు పరచుకున్నారు. ఆ జాబితాలో ఇప్పుడు యంగ్ ఆఫ్ స్పిన్నర్ సుందర్ కూడా చేరాడు. కేవలం 5.70 ఎకానమీతో ఐదు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు పడగొట్టిన సుందర్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకుని సత్తా ఏమిటో చూపెట్టాడు. భారత వన్డే, టి20 జట్లలో ఏడాది కాలంగా మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్ హవా కొనసాగుతోంది. దీంతో సీనియర్ స్పినర్లు అశ్విన్, జడేజాలు కూడా టెస్టులకే పరిమితమై పోయారు. అయితే కొలంబో వేదికగా జరిగిన టి20 ట్రై సిరీస్‌లో సుందర్ స్పిన్ మాయాజాలం ప్రదర్శించాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో కుల్దీప్ యాదవ్ గాయపడటంతో ఆ స్థానంలో జట్టులోకొచ్చిన సుందర్ సెలక్టర్ల నిర్ణయం సరైందేనని ప్రూవ్ చేశాడు. ఈ టోర్నీలో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కుతుందని తాను ఊహించలేదంటున్న సుందర్ అన్నింటికీ సిద్ధమై ఉన్నానని, ఎలాంటి సవాళ్లయినా ఎదుర్కొనేందుకు రెడీ అయి ఈటోర్నీలో ఆడానని చెప్పాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో తన ఆఫ్ స్పిన్ పవరేమిటో చూపెట్టి టోర్నమెంట్ మొత్తం మ్యాచ్‌లు ఆడే అవకాశాన్ని దక్కించుకున్న సుందర్ ఇక భారత జట్టులో సుస్థిర స్థానం సంపాదించినట్టే అనుకుంటున్నాడు.

కార్తీక్‌కు ప్రేమతో..

చెన్నయ్ : టి20 ట్రై సిరీస్ టోర్నీలో చివరి బంతికి సిక్స్ కొట్టి భారత్‌ను గెలిపించిన స్టార్ దినేశ్ కార్తీక్ ప్రతిభ పట్ల ఆయన భార్య దీపిక పల్లికల్ ఆనందం వ్యక్తం చేశారు. ఒకప్పటి భారత స్క్వాష్ క్రీడాకారిణి అయిన దీపిక మ్యాచ్ అనంతరం టీవీలో కనిపిస్తున్న దినేశ్ కార్తీక్ ఫోటోపై ' మై దాదా మై సూపర్ హీరో' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేశారు. మరో పోస్ట్‌లో కార్తీక్ ఫోటోపై లవ్ సింబల్ పెట్టి తన ప్రేమ చాటుకున్నారు. మొదటి భార్య నికిత నుంచి విడాకులు తీసుకున్నాక 2015లో దీపికా పల్లికల్‌ను దినేశ్ కార్తీక్ ప్రేమ వివాహం చేసుకున్నాడు.

నాసిరకం హెల్మెట్లలతో ముప్పు.. తయారీదారులపై

చర్యలు తీసుకోండి

మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ సచిన్ లేఖ



న్యూఢిల్లీ : నాణ్యతలేని హెల్మెట్లను తయారు చేస్తూ ద్విచక్రవాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలంటూ రాజ్యసభ సభ్యుడు సచిన్ టెండూల్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సచిన్ లేఖ రాశారు. టూవీలర్లపై సురక్షిత ప్రయాణంకోసం హెల్మెట్లు ధరించాలంటూ సచిన్ టెండూల్కర్ కొన్నేళ్లుగా వ్యక్తిగతప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే! ఈ క్రమంలో నాసిరకం హెల్మెట్ల తయారీదారులపై చర్యలు తీసుకోవాలంటూ గడ్కరీని కోరారు. క్రీడాకారులుగా మైదానంలో ఆడటానికి వెళ్తున్నప్పుడు హై–క్వాలిటీ భద్రతా పరికరాలను ఉపయోగించడంలోగల ప్రాముఖ్యత తమకు తెలుసని చెప్పారు. భారత్‌లో ద్విచక్రవాహనదారుల కోసం తయారుచేసే హెల్మెట్లలోనూ అదే స్థాయి ప్రమాణాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని సచిన్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారిలో 30శాతం మంది ద్విచక్రవాహనదారులేనని చెబుతూ.. 2016 ఏడాదిలో అన్ని రకాల ప్రమాదాల్లో మరణించిన వారికన్నా వీరి సంఖ్యే ఎక్కువని తెలిపారు. నకిలీ హెల్మెట్లతో ప్రమాదం పొంచి ఉందని.. సురక్షితమైన హెల్మెట్లను అందుబాటులో ఉంచడంతో ప్రమాదాల నుంచి బయటపడే వారి సంఖ్య 42శాతం మేర పెరుగుతుందని సచిన్ పేర్కొన్నారు.

ఐపీఎల్ సందడి షురూ...



కోల్‌కతా : వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభం కానున్న ఐపీఎల 11వ సీజన్ సందడి మొదలైంది. శ్రీలంకలో ముక్కోణపు ట్రై సిరీస్ తర్వాత స్వదేశానికి చేరుకున్న భారత క్రికెటర్లు ఒకటి రెండు రోజుల విరామం తర్వాత తమతమ జట్లతో ప్రాక్టీస్ మొదలు పెట్టనున్నారు. ఇక ఈ సీజన్ కోసం మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రాక్టీస్ మొదలుపెట్టింది. కెప్టెన్ దినేశ్ కార్తీక్ ఇంకా జట్టుతో చేరనప్పటికీ వైస్ కెప్టెన్ రాబిన్ ఊతప్ప, మిగతా ఆటగాళ్ల బృందం జాదవ్‌పూర్ యూనివర్సిటీ మైదానంలో కసరత్తు ప్రారంభించింది. ఈ జట్టులో అండర్–19 ప్రపంచ కప్ గెలిచిన భారత బృందంలోని సభ్యులు శుభ్‌మన్ గిల్, నాగర్ కోటి, వినయ్‌కుమార్, ఇషాంక్ జగ్గీ తదితరులున్నారు. మాజీ కెప్టెన్ గంభీర్ ఢిల్లీకి వెళ్లిపోవడంతో ఆ స్థానంలో దినేశ్ కార్తీక్ నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. బుధవారం నుంచి కార్తీక్ కూడా ప్రాక్టీస్ మొదలుపెట్టనున్నారు. ఏప్రిల్ 8న ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో కోల్‌కతాలో పోటీపడుతుంది.

కింగ్స్ లెవన్ పంజాబ్ వేదికల్లో మార్పులు

ఈ ఏడాది ఐపీఎల్ కింగ్స్ లెవెన్ పంజాబ్ సొంతగడ్డపై ఆడే మ్యాచ్ వేదికల్లో మార్పులు జరిగాయి. మే 12 నుంచి 31 వరకు చండీగఢ్ విమానాశ్రయాన్ని మరమ్మతుల కారణంగా మూసేస్తున్నారు. దీంతో మొహాలీలో మే 4,6,12,14 తేదీల్లో కింగ్స్ లెవన్ పంజాబ్ ఆడే మ్యాచ్‌లను ఇండోర్‌లో నిర్వహించను న్నారు. ఈ వేదికల మార్పునకు అనుమతివ్వాలన్న పంజాబ్ జట్టు అభ్యర్థనకు ఐపీఎల్ పాలక మండలి ఆమోదం తెలిపింది. ఇక ఏప్రిల్ 15, 19, 23న జరిగే మ్యాచ్‌ల్లో ఎలాంటి మార్పులు లేవని, ఆ మ్యాచ్‌లన్నీ మొహాలీలోనే జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కింగ్స్‌లెవెన్ పంజాబ్ జట్టుకు ఈ ఏడాది అశ్విన్ నాయకత్వం వహిస్తున్నాడు. తొలి మ్యాచ్‌ను పంజాబ్ జట్టు ఏప్రిల్8న ఢిల్లీ డేర్ డెవిల్స్‌తో ఆడుతుంది.

సన్ రైజర్స్ ప్రచారగీతం విడుదల

ఈ ఏడాది మెగా ఐపీఎల్ టోర్నీ ప్రారంభానికి గడువు దగ్గరపడుతుండటంతో ఆయా జట్ల ఫ్రాంఛైజీలు బిజీ అయిపోయాయి. ఇప్పటికే విడుదలైన ఐపీఎల్ ప్రచార గీతానికి విశేష ఆదరణ దక్కింది. అలాగే పలు ఫ్రాంఛైజీలు కూడా సొంత ప్రచార గీతాలు విడుదల చేశాయి.

తాజా గా సన్‌రైజర్స్ హైదారాబాద్ తన ప్రచార గీతాన్ని ట్విటర్ ద్వారా పంచుకుంది. 'గో గో గో గో హియర్ వి గో గో గో... వియ్ ఆర్ ది ఆరెంజ్ ఆర్మీ' అంటూ సాగే ఈ ప్రచార గీతం విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ ప్రచార గీతం హోరెత్తుతోంది. ఈ ఏడాది ఐపీఎల్ ఏప్రిల్ 7న ప్రారంభంకానుంది. టోర్నీలో భాగంగా హైద రాబాద్ తన తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను ఢీకొట్టనుంది. ఏప్రిల్ 9న ఈ మ్యాచ్ జరగనుంది.

ప్రాక్టీస్‌లో రాయల్ చాలెంజర్స్ బిజీ.. బిజీ



మరో వైపు రాయల్స్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ప్రాక్టీస్ మొదలు పెట్టింది. మంగళవారం మొదలైన ఆరు రోజుల శిక్షణ శిబిరంలో రాయల్ చాలెంజర్స్ ఆటగాళ్లు సర్ఫరాజ్ ఖాన్, పార్థివ్ పటేల్, మనన్ వోహ్రా, కుల్వాత్ ఖెజ్రోలియా, అశ్విన్, పవన్ నేగి, దేశ్ పాండే లాంటి యువ ఆటగాళ్లు పాల్గొన్నారు. కోచ్ వెటోరీ సారథ్యంలో మొదలైన ఈ శిక్షణ శిబిరంలో మరికొంత మంది ఆటగాళ్లు రేపటిలోగా చేరనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.